# దీపావళి
# శుభాకాంక్షలు

వారధి తెలుగు దినపత్రిక పాఠకులకు
దీపావళి పండుగ శుభాకాంక్షలు! ఈ
దీపాల పండుగ మీ జీవితాలను
ఆనందం, శాంతి, ఆరోగ్యం, అభివృద్ధితో
నింపాలని ఆకాంక్షిస్తూ, వెలుగు
ప్రవహించే ఈ రోజులు మీకెన్నో
విజయాలను తీసుకురావాలని
ఆశిస్తున్నాము.

-యాజమాన్యం

WANTED

జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091



Facebook.varadhi telangana

విశ్వ వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి : 1
సంచిక : 56
గురువారం
31.10. 2024


# మూసీ సుందరీకరణతో పేదల ఇళ్ల కూల్చివేత

- ఇళ్ల కూల్చివేతను తప్పకుండా వ్యతిరేకిస్తాం
- మల్లన్న సాగర్‌ను మించి మూసీకి పరిహారం ఇవ్వాలి
- రేవంత్ పాదయాత్ర చేస్తే మేమూ వస్తాం
- కుర్చీకాపాడుకునేందుకే రేవంత్ రెడ్డి తంటాలు
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వంద సీట్లు ఖాయం
- కేసులతో బెదిరింపులకు బెదిరే భయపడేది లేదు
- మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు



**వారధి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 30 :**

మూసీ సుందరీకరణకు తాము అనుకూలమేనని.. అయితే సుందరీకరణ పేరిట స్థిరాస్తి వ్యాపారానికి వ్యతిరేకమని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మూసీ పేరిట కమిషన్లు, పేదల ఇళ్లను కూల్చడం వంటి వాటిని వ్యతిరేకిస్తున్నామన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసిత కాలనీ రాజమౌళి సినిమాను తలపిస్తోందంటూ ఎద్దేవా చేశారు. మల్లన్నసాగర్ బాధితులకు ఒక్క ఇల్లూ కట్టలేదని తప్పుగా మాట్లాడారని.. మల్లన్నసాగర్‌కు 50వేల ఎకరాలు కాదు.. 17వేల ఎకరాలేనన్నారు. 14వేల ఎకరాలు ప్రభుత్వ పట్టా అసైన్డ్ భూమి.. 3వేల ఎకరాలు ఫారెస్ట్ భూమి అని చెప్పారు. ఏడు గ్రామాలు ముంపునకు గురైతే 14 గ్రామాలు అయ్యాయని తెలిపారు.

మిగతా 2 లో



# దేశానికి రోల్‌మోడల్‌గా బీసీ కులగణన

## కులగణన హామీని నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్

- సోనియాకు ఇచ్చిన హామీ అమలుచేసే యత్నం
- భవిష్యత్ జగనగణనకు ప్రామాణికంగా సర్వే
- గాంధీభవన్‌లో పార్టీ సమావేశంలో సీఎం రేవంత్

ప్రభుత్వం చేపట్టబోతున్న బిసి కులగణన దేశానికే రోల్ మోడల్‌గా మార్చాలని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బిసి కులగణన హామీని నిలబెట్టుకోవడం ద్వారా తెలంగాణను ఆదర్శంగా నిలుపుదామని అన్నారు. రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సోనియాగాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టి తీరుతామని స్పష్టం చేశారు. కులగణనపై గాంధీభవన్‌లో జరిగిన ఉన్నతస్థాయి పార్టీ సమావేశంలో పాల్గొన్న సీఎం.. ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు.

**వారధి న్యూస్, హైదరాబాద్ :** భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో మన తెలంగా ణను మోడల్‌గా పరిగణనలోకి తీసుకునేలా డాక్యుమెంటును కేంద్రాని కి పంపుతామని వివరించారు. కులగణ నపై సమన్వయం చేసుకునేందుకు 33 జిల్లాలకు 33 మంది ప్రత్యేక అబ్జర్వర్లను నియమించాలని రేవంత్ రెడ్డి సూచించారు. బాధ్యతగా పనిచేయాలని కష్టానికి తగిన ఫలితం తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశా రు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించి నా పార్టీ క్షమించదని హెచ్చరించారు. నవంబర్ 31లోగా ప్రక్రియ పూర్తి చేసి భవిష్యత్తు యుద్దానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ నుంచి నరేంద్ర మోదీపై యుద్ధం ప్రకటించాల్సి ఉందని స్పష్టం చేశారు. కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదని అది మెగా హెల్త్ చెకప్ లాంటిదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.



మిగతా 2 లో

# బంగారం ధర పెరుగులు

- దీపావళికి కలిసిరాని కాలం
- పెళ్లిళ్ల సీజన్ కోసం వ్యాపారుల చూపు



**ముంబై, అక్టోబర్ 30 :** దేశంలో బంగారం కొనుగోళ్లు తగ్గుతున్నాయి. ధరల కారణం గా బాగా డబ్బున్న వాళ్లు తప్ప పేద, మధ్యతరగతి ప్రజలకు బంగారం అందు బాటులో ఉండడం లేదు. బాంగారం ఏ కంగా 80వేలు దాటడం కలవరపెడు తోంది. పెళ్లిళ్ల సీజన్ ఆరంభం కావడం, ధనత్రయోదశి పండగలు వచ్చినా బంగా రం కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగాయి.

మిగతా 2 లో

# కేసులకు భయపడకండి

పార్టీ అండగా ఉంటుందన్న కేటీఆర్

2 లో..





2 లో..

## స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లకు కమిషన్

తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

## ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు

డీఏ 3.64శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ

3 లో..



# పంచాయితీలను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



- కేంద్రం నిధులు ఇచ్చినా దారి మళ్లించిన రేవంత్
- 1200కోట్లు విడుదల చేస్తే.. కేవలం 200 కోట్లు ఖర్చు
- సర్కార్ తీరుపై మండిపడ్డ ఎంపీ రఘునందన్ రావు

**వారధి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 30 :** గ్రామాల అభివృద్ధిని కాంక్షించి కేంద్రం నిధులు విడుదల చేస్తున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని బిజెపి మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. గ్రామాలకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించడం సరికాదన్నారు. పల్లె ప్రగతి నిధులు విడుదల చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో పంచాయతీ సెక్రటరీలు కూడా సొంత డబ్బు తో పనులు చేయించారన్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా గ్రామాలు బాగుండాలని కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని రఘునందన్ రావు అన్నారు. ఆరునెలల క్రితం కేంద్రం 1200 కోట్ల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలను

మిగతా 3 లో



# జన్వాడ ఫామ్‌హౌజ్ కేసు

పోలీసుల ఎదుట విచారణకు పాకాల హాజరు

3 లో..

## ప్రాణాంతక మయోనైజ్‌పై నిషేధం

8 లో..

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం




## ఏపీలో నేటి నుంచి ఉచిత గ్యాస్ పథకం అమలు

8 లో..





## తెలంగాణలో మూడు రోజులు వర్షాలు

3 లో..

## మూసీ సుందరీకరణతో
# పేదల ఇళ్ల కూల్చివేత

(మొదటిపేజీ తరువాయి)

సీఎం ఇలా మాట్లాడుతూపోతే ఇక ఆయన మాటలను ఎవరూ నమ్మరన్నారు. మూసీ బాధితులకు మల్లన్న సాగర్‌కు మించిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ బాధితులకు గచ్చిబౌలి భూముల్లో ఇళ్లను నిర్మించి ఇవ్వాలి. హైదరాబాద్ నుంచి వాడపల్లి వరకు పాదయాత్ర చేద్దాం. సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండా పాదయాత్రకు రావాలని షరతు విధించారు. మమ్మల్ని డీల్ చేయడం కాదు.. రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకోవాలి. పక్కనున్న వాళ్లే ఆయన్ను దించేయకుండా జాగ్రత్త పడాలి. ప్రభుత్వం వచ్చి ఏడాదైనా.. 6 మంత్రి పదవులు నింపుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే భారాసకు 100 సీట్లు రావడం ఖాయమని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌కు వంద సీట్లు వస్తాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని స్పష్టం చేశారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని.. రేవంత్ సీఎం అయ్యేవాడు కాదన్నారు. కేసీఆర్‌కు, రేవంత్‌కు నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. సీనియర్లు తన కుర్చీని గుంజుకోకుండా రేవంత్ చేసుకోవాలని.. తన కుర్చీని ఎప్పుడు గుంజుకుపోతారోనన్న భయంలో రేవంత్ ఉన్నాడన్నారు. ఐదేళ్ల తర్వాత వచ్చేది బీఆర్ఎస్ మాత్రమేనని.. సీఎం అయ్యేది కేసీఆర్ అని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్ మూడుసార్లు ఓడిందని.. మరి కాంగ్రెస్ ఖతం అయిపోయిందా? అంటూ ప్రశ్నించారు. 31 సాకులు చూపుతూ రుణమాఫీ చేయకుండా రేవంత్ రైతులను మోసం చేశారని విమర్శించారు. మంత్రి పదవులు నింపేందుకే రేవంత్‌కు హైకమాండ్ అనుమతి ఇవ్వట్లేదని.. విద్య, మైనారిటీ, పోలీసుశాఖలకు మంత్రులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ లేరన్నారు. కేసీఆర్ పవర్‌ఫుల్ ఫైటర్, లీడర్ అని చెప్పారు. రేవంత్‌రెడ్డి చిల్లరమాటలు ఆపితే మంచిదని సూచించారు. ఓ మంత్రి గవర్నర్‌ని కలిశారని.. ఇంకో మంత్రి కాబోయే సీఎంనని సోషల్ మీడియాలో పెట్టుకుంటున్నారని అన్నారు. సీఎం చిట్‌చాట్‌లో మాట్లాడి కుర్చీకి ఉన్న గౌరవం తగ్గించారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి అబద్దాలు చూసి గోబెల్స్ కూడా సిగ్గుపడుతారన్నారు. రేవంత్ మాట్లాడితే ఎక్కడ ఆ దుర్భాష విని పిల్లలు చెడిపోతారోనని.. ఇండ్లల్లో తల్లిదండ్రులు టీవీలను బంద్ చేస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు మూడువైపులా సముద్రం ఉందంటారని.. అలా అయితే గోవా వెళ్లడం ఎందుకని జోకులు వేస్తున్నారన్నారు. రాజీవ్ కంప్యూటర్ కనిపెట్టాడని అంటాడని.. దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు అమ్ముతారని.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండీ ఇలా మాట్లాడుతూ పోతే.. గ్రూప్-1 పరీక్ష రాసేవాళ్లు ఏమైపోవాలని అన్నారు. తాను కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని.. సన్యాసం తీసుకోకుండా ఎంపీకి ఎందుకు పోటీశారని నిలదీశారు. శుద్ధమైన నదీ జలాలకు బీఆర్ఎస్ అనుకూలమని.. పేదల ఇండ్ల కూల్చివేతకు వ్యతిరేకమని క్లారిటీ ఇచ్చారు. కాళేశ్వరం మంచినీళ్లు మూసీకి తీసుకురావాలన్నది కేసీఆర్ విజన్ అని తెలిపారు. కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీకి నీళ్లు తెచ్చేందుకు కేసీఆర్ డీపీఆర్ చేశారన్నారు. కొండపోచమ్మ సాగర్ కాకుండా మల్లన్నసాగర్ నుంచి ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. రూ.1100కోట్లతో అయ్యే పనిని రూ.7వేలకోట్ల కమిషన్ కోసం పెంచారని మండిపడ్డారు. గచ్చిబౌలిలో 450 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని.. మూసీ బాధితులకు ఆ స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.75కోట్లకు ఎకరా భూమి అమ్మింది రేవంత్ ప్రభుత్వమేనన్నారు. 2013 యాక్ట్ కంటే బాగా ఇవ్వమని తాము అడుగుతున్నామన్నారు. రేవంత్ పాలనలో ఇండ్లు కూల్చారు తప్పా.. ఒక్కటైనా కట్టారా? అని హరీశ్‌రావు నిలదీశారు. ఏక్ పోలీసింగ్ కోసం పోలీసుల పోరు జరుపుతున్నారని.. రేవంత్ చెప్పిందే వారు అడుగుతున్నారన్నారు. అంబేద్కర్ విగ్రహానికి సీఎం దండ వేయరని.. అక్కడికి ఎవరినీ వెళ్లనీయరంటూ హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ తప్పుడు విధానాలతో రియల్ ఎస్టేట్ పడిపోయిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో రియల్ ఎస్టేట్ పెరిగిపోతున్నా.. తెలంగాణలో మాత్రం ఎందుకు తగ్గుతోందని నిలదీశారు. హైడ్రా ఎఫెక్ట్‌తో రియల్ ఎస్టేట్ రంగం ధమాల్ ధమాల్ అయ్యిందన్నారు. రేవంత్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే తప్పుడు కేసులు పెట్టున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు కేసులతో తనను.. కేటీఆర్‌ను ఇరికించాలని చూస్తున్నారని ఆరోపించారు. తమపైనే కాకుండా ప్రశ్నించే గొంతులపైనా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉందన్నారు. హైదరాబాద్‌లో 144 సెక్షన్ పెట్టడం తుగ్లక్ చర్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి, దురాలోచనతోనే ఆర్ఆర్ఆర్‌కు రూ.35వేలకోట్ల ఖర్చు అని అంటున్నారని.. కేంద్రం ఫ్రీగా చేస్తున్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయడం ఎందుకని నిలదీశారు. అలైన్‌మెంట్ మార్చాల్సిన అవసరం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం 11 నెలల్లోనే రూ.85వేలకోట్ల అప్పులు చేసిందన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, మూలధన పెట్టుబడి, సంక్షేమ పథకాల కోసం చేసిన అప్పు రూ.4,26,499కోట్లు మాత్రమేనన్నారు. పదినెలల కాంగ్రెస్ పాలనలోనే రూ.85వేలకోట్ల అప్పులు తీసుకున్నట్లుగా క్లియర్‌గా ఉందని.. బడ్జెటేతర రుణాల వివరాలను తమకు చెప్పలేదని కాగ్ తన నివేదికలో చెప్పిందని గుర్తు చేశారు. అప్పుల వివరాలు ఎందుకు చెప్పడం లేదని.. ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. తీసుకున్న రుణాలను ఏం చేస్తున్నారని నిలదీశారు. రేవంత్‌కు ఫుట్‌బాల్ ఒక్కటే వచ్చని.. తనకు క్రికెట్ కూడా తెలుసునన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గోల్ కొట్టేది.. వికెట్ తీసేది తామేనన్నారు. రేవంత్ బెదిరింపులకు ఇక్కడ ఎవరూ భయపడరని.. ప్రశ్నించే గొంతుక కేటీఆర్‌పై పగబడుతున్నారన్నారు. ఫార్ములా రేసింగ్‌పై ఏసీబీ విచారణ చేయనివ్వాలని.. ఇంకా ఏయే కేసులు పెడతారో చూస్తామన్నారు.




# దేశానికి రోల్‌మోడల్‌గా బీసీ కులగణన

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. నవంబర్ 6 నుంచి తెలంగాణలో కులగణన పక్రియను ప్రారంభించనున్నారు. దేశంలో తొలిసారిగా ఇక్కడ కులగణన చేపట్టనున్నారు. నవంబర్ 6న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించాలని రాష్ట్ర నాయకత్వం యోచిస్తోంది. ఈమేరకు గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. కులగణన తర్వాత ఏయే సంక్షేమ కార్యక్రమాలకు ఎంత నిధులు కేటాయించాలో తెలిసే అవకాశం ఉంది. త్వరలో దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రులు తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో కులగణనపై సమావేశాలు ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వారిని ఆదుకోవడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని చెప్పారు. రాహుల్ గాంధీ హామీ మేరకు కులగణన చేస్తున్నామన్నారు. సర్వేతో అందరి సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో దేశమంతా తెలంగాణను అనుసరిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నది బీసీ కులగణన కాదు.. సమగ్ర కులగణన అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. కులగణన సర్వేను కాంగ్రెస్ అత్యంత ప్రాధాన్యం ఉన్న విషయంగా తీసుకుందన్నారు. కులగణన ఎక్స్ రే మాత్రమే కాదు మెగా హెల్త్ చెకప్ లాంటిదన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ అన్ని పరిస్థితులు చూశారు... కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కులగణన చేయాలని నిర్ణయించారు. కులగణన నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని అన్నారు. నవంబర్ 2న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలకు అన్ని వర్గాల ప్రజలను ఆహ్వానిస్తామని తెలిపారు. డిసెంబర్ 7 నాటికి కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తవుతుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆలోపు సమగ్ర కులగణన సర్వేను హైకోర్టుకు అందిస్తామన్నారు.



రాహుల్ ఇచ్చిన మాటను నెరవేర్చబోతున్నామన్నారు. రాహుల్ ప్రధాని కావడానికి తెలంగాణ మోడల్ ఉపయోగపడుతుందన్నారు. నవంబర్ 31 లోగా కులగణన పూర్తి చేస్తామన్నారు.


### నవంబర్ 5 లేదా 6న రాష్ట్రస్థాయి సమావేశం

కులగణనపై నవంబర్ 5 లేదా 6 న రాష్ట్రస్థాయి సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యులను చేస్తామని చెప్పారు. కేంద్రం చేపట్టబోయే జనగణనలో ఓబీసీ కులగణను చేర్చాలని కోరుతామన్నారు. ప్రభుత్వ ఆదాయన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచుతామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు.. దేశంలో మొదటిసారి సమగ్ర కులగణన పక్రియ ఈనెల 6 వ తేదిన ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సమగ్ర సర్వే సక్రమంగా జరిగి భవిష్యత్‌లో అందరికి సమ న్యాయం జరిగేలా అందరు సహకరించాలన్నారు. దీనికి సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా గ్రామీణ ప్రాంతాలలో అధికారులకు సహకరించాలని సూచించారు. 50 ఇళ్లకు అధికారుల బృందం సమగ్ర సమాచార సేకరణ చేపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని రకాలుగా అందుబాటులో ఉండాలన్నారు. తెలంగాణలో కులగణన పక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భారాస నేతలు ప్రభుత్వాన్ని విమర్శించ డమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుకబడిన కులాలకు చెందిన వారిపై భారాసకు ప్రేమలేదన్నారు. తెలంగాణ పీసీసీ చీఫ్‌గా బలహీన వర్గాలకు చెందిన వ్యక్తినే కాంగ్రెస్ పార్టీ నియమిం చిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తూ.. అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించని కార్యక్రమాలనూ చేపడుతున్నామన్న విషయాన్ని ప్రతిపక్ష నేతలు గుర్తించాలని హితవు పలికారు.

# బంగారం ధర పరుగులు

(మొదటిపేజీ తరువాయి)

బంగారం ధరలు స్థిరంగా ఉండడం లేదు. 80వేల మార్కును దాటిన తరవాత కిందికి దిగి రావడం లేదు. రాకుండా వ్యాపారులు కూడా తమవంతు యత్నాలు చేస్తున్నారు. మరోవైపు బంగారం ధర స్థిరంగా ఉన్నప్పటికీ, అటు వెండి ధరలు మాత్రం పెరిగాయి. ఇక కిలో వెండి ధర రూ. లక్షకు చేరుకుంది. పరిశ్రమల యూనిట్లు, నాణెపు తయారీ పరిశ్రమల నుంచి డిమాండ్ పెరగడంతో వెండి ధర పెరిగింది. పుత్తడి ధరలు పెరగడంతో గత సంవత్సరంతో పోలిస్తే అమ్మకాలు కనీసం 30 నుంచి 50 శాతం తగ్గుతాయని మార్కెట్ వర్గాల అంచనా. అయితే దీపావళి, ధంతేరస్ పర్వదినాల సందర్భంగా కొనుగోళ్లు పుంజుకుంటాయని ఆభరణాల పరిశ్రమ ఆశించింది. రికార్డు స్థాయిలో ఎగిసిన పుత్తడి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టడంతో కష్టమర్ల తాకిడి ఆశాజనకంగా వుంటుందని భావిస్తున్నారు. దేశీయంగా రిటైల్ మార్కెట్లో కూడా బంగారం పెరుగుతోంది. పెళ్లిళ్ల సీజన్‌లో పసిడి లాభాల సిరులు కురిపిస్తుందనే అంచనాల్లో ఉన్నారు. దీపావళి అంటే దివ్వెలు, వెలుగుల సంబరం మాత్రమేకాదు. పసిడి కాంతుల కళకళలు కూడా. దసరా, దీపావళి పండుగ సీజన్ వచ్చిందంటే నగల వ్యాపారులకు బోలెడన్ని ఆశలు. లక్ష్మిదేవిని పూజించడం ఎంత ముఖ్యంగా భావిస్తారో... దీంతో పాటు బంగారం గానీ, ఏదో ఒక కొత్త వస్తువు కొనడం కూడా అంతే ఆనవాయితీ వస్తున్న క్రమంలో వారికి భారీ అంచనాలే ఉన్నాయి. అయితే ఇటీవల రికార్డు స్థాయికి చేరిన పసిడి దరలు దీపావళి నాటికి దిగి వస్తాయా అని కొనుగోలుదారులు ఆశగా ఎదురుచూస్తోంటే.. కొనుగోళ్లతో తమ షాపులు కళకళలాడతాయా లేదా అని వ్యాపారులు ఆందోళనపడుతున్నారు. కొనుగోలుదారులు దీపావళికి ఎంతో కొంత బంగారాన్ని తమ సొంతం చేసుకోవాలనే ఆలోచనలో ఉంటారు. అయితే ఆకాశాన్నంటిన ధరలు మరింత దిగిరాకపోతాయా అనే మీమాంసలో చాలా మంది కొనుగోలు దారులున్నారు. క్షణక్షణానికి మారుతున్న



అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో పుత్తడి ధర ఏ రోజు ఎంత పెరుగుతుందో.. ఎంత తగ్గుతుందో అంచనా వేయడం ఒకింత కష్టంగా మారింది. ఇదిలా ఉంటే అంతర్జాతీయ పరిస్థితులు, గ్లోబల్‌గా ఆర్థిక వ్యవస్థ మందగమనం, ట్రేడ్‌వార్ తదితర కారణాల రీత్యా మెత్తం వ్యాపారం తక్కువగా ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. తక్కువ నుండి మధ్య స్థాయి వరకు జరిగే కొనుగోళ్లు తీవ్రంగా ప్రభావితమవుతాయని చెప్పారు. ధరలు పెరిగినా రానున్న పెళ్లిళ్ల సీజన్ కూడా తమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు.

# కేసులకు భయపడకండి

### పార్టీ అండగా ఉంటుందన్న కేటీఆర్

**వారధి న్యూస్, మహబూబ్‌నగర్ :** కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజల తరఫున నిరంతరం పోరాడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడని బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం కన్వీనర్ వరదా భాస్కర్ ముదిరాజ్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వన్ టౌన్ సీఐ చితకబాదారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భాస్కర్‌కు ఫోన్ చేసి ధైర్యం చెప్పారు. అంతకు ముందు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఆంజనేయ గౌడ్ ప్లలె రవికుమార్ తదితరులు పోలీస్ స్టేషన్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. సీఐ క్షమాపణ చెప్పడంతో నిరసన విరమించారు. అనంతరం జైల్లో ఉన్న బీఆర్ఎస్ నేత శ్రీకాంత్ గౌడ్‌ను కలిసి పరామర్శించారు.

# స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లకు కమిషన్

### తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**వారధి న్యూస్, హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బిసి రిజర్వేషన్లను త్వరగా తేల్చితే స్థానిక ఎన్నికల్లో లబ్ధి ఉంటుందని పిటిషనర్ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో విడుదల చేసింది. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌కు అప్పగించింది. దీనిని సవాల్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం చేసే బాధ్యతను బీసీ కమిషన్‌కు అప్పగించడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ప్రభుత్వ జీవో ప్రకారం ఒకటి రెండు నెలల పాటు రాష్ట్రంలో బీసీ కమిషన్ అధ్యయనం చేసి నివేదిక అందిస్తుంది. గతంలో మహారాష్ట్రలో ఇలాగే బీసీ కమిషన్ చేసిన అధ్యయనాన్ని అక్కడి హైకోర్టు కొట్టివేసింది. ఇక్కడ నివేదిక సమర్పించిన తర్వాత అదేవిధంగా జరిగితే సమయం వృథా అవుతుంది. అందువల్ల ఇప్పుడే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషనర్ తరఫున మాజీ అడ్వొకేట్ జనరల్ ప్రసాద్ కోర్టును కోరారు.

# విద్యుత్ చార్జీలు పెంచకుండా అడ్డుకున్నాం

### రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ సంబురాలు

**వారధి న్యూస్, హైదరాబాద్ :** కరెంట్ చార్జీలను పెంచాలన్న ప్రభుత్వ ప్రయత్నానికి చెక్ పెట్టించ గలిగామని బీఆర్ఎస్ చెబుతోంది. ఇఆర్‌సిని కలి వాదనలు సక్రమంగా వినిపించడం వల్లనే పెంపు సాధ్యం కాలేదని అంటున్నారు. సామాన్యుడిపై విద్యుత్ భారం పడకుండా ఎలక్ట్రిసిటీ రెగ్యులటరీ కమిషన్ ముందు తమ వాదనలు బలంగా వినిపించి పేద ప్రజలపై భారం పడకుండా చూడడంలో బీఆర్ఎస్ పార్టీ సాధించిన గొప్ప విజయం సాధించిందని అంటున్నారు. విద్యుత్ బిల్లుల తగ్గింపుపై విజయం సాధించిన సందర్భంగా పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



# పంచాయితీలను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1200 కోట్ల నిధులు విడుదల చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. మిగిలిన రూ.1000 కోట్ల నిధులను రేవంత్‌రెడ్డి సర్కారు ఇతర కార్యకలాపాలకు దారి మళ్లించిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందన్న రఘునందన్.. పల్లె ప్రగతికి నిధులు వెచ్చించడం లేదని దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా శానిటైజేషన్ కోసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో పనులు పూర్తి చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారని.. కేవలం 200 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన నిధులు దారి మళ్లించారని మండిపడ్డారు. ఆ బిల్లులు ఇవ్వకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.600 కోట్లు పెండింగ్‌లో పడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం రెకమండేషన్ మేరకు రూ.500 కోట్లు విడుదల చేసిందని.. నేషనల్ హెల్త్ మిషన్ కోసం 300 కోట్ల రూపాయలు విడుదల చేసిందని చెప్పారు. హెల్త్ సెంటర్ నిర్మాణం చేయాలని చెప్పిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో గ్రామాలలో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలు విడుదల చేసినా తెలంగాణ సర్కార్ వాటిని దారి మళ్లించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కావాలి కానీ కేంద్రం పేరు



చెప్పేందుకు మనసు రాదంటూ మండిపడ్డారు. నియోజకవర్గానికి 3,500 ఇల్లు కట్టిస్తామని చెప్పింది.. వాటిని కట్టేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని.. ఆ నిధులను కూడా అర్బన్ మిషన్ కింద సేకరిస్తోందన్నారు. వాటిని ఎవరు పంచాలనేది దానిపై కొట్లాట మొదలైందన్నారు. కలెక్టర్‌లతో కాకుండా గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తల చేతుల మీదుగా ఆ నిధులు అందజేస్తామని చెబుతున్నారన్నారు. మునిసిపాలిటీలలో 250 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం తాగునీటి కోసం విడుదల చేసిందన్నారు. మా పైసలు తీసుకుని మా భాగస్వామ్యం లేకుండా ఇళ్లను పంచిపెడితే కచ్చితంగా అడ్డుకుంటాం. ఇందిరమ్మ కమిటీలు చెల్లుబాటు కావు. ప్రతి స్కీంకు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పేర్లు పెట్టే భావదారిద్య్రం ఉంది. మూసీ శుద్ధి, సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదు . అభివృద్ధి పేరుతో కార్పోరేట్ కంపెనీలకు పనులు అప్పజెబితే మాత్రం వ్యతిరేకిస్తాం. మూసీకి కొండపోచమ్మ సాగర్ నుంచి నీరు తెస్తే 1500 కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. మల్లన్న సాగర్ నుంచి నీరు తెస్తే 7వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. పేదోళు కట్టిన ఇంటి వద్ద 50 మీటర్ల దూరం అభివృద్ధి చేస్తాం అంటున్నారు. మూసీ అభివృద్ధిలో క్విడ్ ప్రోక్రో ఉన్నట్లు అనుమానం ఉంది. ప్రజలు బీఆర్‌ఎస్‌కు సీఆర్‌ఎస్ ఇచ్చారు.. వారిని ఫాం హౌస్‌లకు పరిమితం చేశారు. పేదోళ్లకు కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఇస్తుంది. కుక్కతోక పటాకులు పేలుస్తారా .. సుతీల్ బాంబు పేలుస్తారా చూడాలి. అదిపేలుస్తాం ఇది పేలుస్తాం అని బ్రేకింగ్ ప్లేట్ల కోసం మాట్లాడకుండా అవినీతిపరులను అరెస్టు చేస్తే మేం స్వాగతిస్తాం అని ఎంపీ రఘునందర్ రావు వెల్లడించారు.



## పదేళ్ల పాలన చీకట్లు తొలగి పోయాయి

### ప్రజలకు దీపావళి శుభాకాంక్షల్లో సిఎం రేవంత్

**వారధి న్యూస్, హైదరాబాద్ :** దీపావళి పండుగను పురస్కరించకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గత పదేండ్ల విధ్వంసపు పాలనలోని చీకట్లు తొలగిపోయాయని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా ప్రజా పాలనలో తెలంగాణ వెలుగులు విరజిమ్ముతుందని ముఖ్యమంత్రి ధీమా వెలిబుచ్చారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపు కోవాలని అన్నారు. ఈ దీపాల కాంతులతో ప్రతి ఇంటింటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పర్యావరణానికి హాని కలిగించకుండా చిన్నా పెద్దలందరూ పండుగ జరుపుకోవాలని, ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.



## జన్వాడ ఫామ్‌హౌజ్ కేసు

### పోలీసుల ఎదుట విచారణకు పాకాల హాజరు

**వారధి న్యూస్, హైదరాబాద్ :** జన్వాడ ఫామ్‌హౌస్ కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల మోకిల పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. దాడి జరిగిన సమయంలో అదృశ్యమైన పాకాల బుధవారం పోలీసుల ఎదుట ప్రత్యక్షం అయ్యారు. అలాగే హైకోర్టులో ముందస్తు బెయిల్ కూడా దాఖలు చేశారు. ఈ క్రమంలో న్యాయవాదితో పాటు ఆయన విచారణకు వచ్చారు. నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ ఆధ్వర్యంలో విచారణ సాగుతోంది. ఇటీవల రాజ్ పాకాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పార్టీ కేసుకు సంబంధించి విచారించాల్సి ఉందని అందులో పేర్కొన్నారు. జన్వాడలో ఫామ్‌హౌస్‌పై ఇటీవల సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. ఇక్కడి రిజర్వ్ కాలనీలో ఉన్న రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి పార్టీ నిర్వహించారు. భారీ శబ్దాలతో ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. 21 మంది పురుషులు, 14 మంది మహిళలను అదుపులోకి తీసుకున్నారు. 35 మందితో నిర్వాహకులు మద్యం పార్టీ నిర్వహిం చారు. డ్రగ్స్ పరీక్షలు నిర్వహించిన పోలీసులు.. రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్లు నిర్ధరించారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగానే రాజ్ పాకాలకు నోటీసులు ఇచ్చారు.



## తెలంగాణలో మూడు రోజులు వర్షాలు

**వారధి న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణలో రాగల మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. అక్టోబర్ 30న ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజగిరి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

## పంచాయతీలను గ్రేడ్‌లుగా విభజించండి

### సీఎస్‌కు టీపీఎస్‌ఏ వినతి

**వారధి న్యూస్, హైదరాబాద్ :** గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులను తెలంగాణ పంచాయతీ సెక్రటరీల అసోసియేషన్ (టీపీఎస్ఏ) వినతి పత్రం సమర్పించింది. పంచాయతీలను గ్రేడ్‌లుగా విభజించాలని, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా మార్చాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్ లను కలిసిన టీపీఎస్ఏ అధ్యక్షుడు పి.మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీనివాస్‌లు వినతి పత్రం ఇచ్చారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషన్ కాలాన్ని రెండు సంవత్సరాలకు తగ్గించాలని, పంచాయతీరాజ్ చట్టంలోని లోపాలను సవరించాలని, 317 జీవోతో నష్టపోయిన కార్యదర్శులను సొంత జిల్లాలకు పంపించాలని వారు కోరారు. కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలని, అర్హత ఉన్న బిల్ కలెక్టర్‌లకు పదోన్నతి కల్పించాలని, పారిశుధ్య సిబ్బందికి పే స్కేల్ వర్తింప చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. తమ అసోసియేషన్‌కు హైదరాబాద్‌లో వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. అధికారులను కలిసి వారిలో టీపీఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సతీష్ కుమార్, సుదర్శన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.అరుణ్, జాయింట్ సెక్రటరీ వి.కవిత, లక్ష్మి నారాయణ లు వినతి పత్రం ఇచ్చారు

## ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు

### డీఏ 3.64శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ

**వారధి న్యూస్, హైదరాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దీపావళి సందర్భంగా తీపికబురు చెప్పింది. డీఏ 3.64శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన డీఏ 2022 జూలై ఒకటో తేదీ నుంచి వర్తించనున్నది. డిసెంబర్ ఒకటిన చెల్లించే నవంబర్ జీతంతో కలిపిన పెరిగిన డీఏ ప్రభుత్వం చెల్లించనున్నది. 2022 జులై ఒకటి నుంచి ఈ నెల వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10శాతం ప్రాన్ ఖాతాకు జమవుతాయి. సీపీఎస్ ఉద్యోగులకు మిగతా 90శాతం 17 వాయిదాల్లో చెల్లించనున్నారు. సీపీఎస్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 వాయిదాల్లో చెల్లించినట్లు ప్రభుత్వ పేర్కొన్నది. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగులకు సైతం 17 వాయిదాల్లో చెల్లించనున్నది. రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ బకాయిలను జనవరి నుంచి 17 వాయిదాల్లో జమ చేయనున్నది. నవంబరు జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపులు చేయనున్నారు. 2022 జులై ఒకటి నుంచి 2024 అక్టోబర్ 31 వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నారు. 2025 మార్చి 31వ తేదీ లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు డీఏ బకాయిలు 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం




ఉత్తర్వుల్లో పేర్కొంది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10 శాతం ప్రాన్ ఖాతాకు జమ చేస్తారు. 90 శాతం 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైం కంటింజెంట్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేపడతారు. విశ్రాంత ఉద్యోగులకు డీఏ బకాయిలు 2025 జనవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

## సీఎం రేవంత్ శిశుపాలుడిలా మారాడు

### దాసోజు శ్రవణ్

**వారధి న్యూస్, హైదరాబాద్ :** సీఎం రేవంత్ శిశుపాలుడిలా మారాడని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. నెగిటివ్ మైండ్ సెట్‌తో ఎందరో కాంగ్రెస్, టీడీపీ నేతల రాజకీయ జీవితాలను రేవంత్ నాశనం చేశాడన్నారు. బుధవారం తెలంగాణ భవన్ లో మీడియాతోమాట్లాడారు. ప్రకృతి ప్రకోపానికి రేవంత్ గురి కావాల్సిందేనని హెచ్చరించారు. కేసీఆర్ ను ఫినిష్ చేయడం రేవంత్ తరం కాదు ..తస్మాత్ జాగ్రత్త... తెలంగాణ సమాజం కర్రు కాల్చి వాత పెడుతుందని హెచ్చరించారు. రేవంత్ ది ప్రజా పాలన కాదు.. మూరపు పాలన.. హిట్లర్ పాలన అన్నారు. రేవంత్ ది దుర్మార్గపు పాలన నా కాదా? తెలంగాణ సమాజం ఆలోచించాలన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి తెలంగాణ ప్రజలకు ఆద్యుడిగా ఉండాలన్నారు. దావూద్ ఇబ్రహీం తరహాలో రేవంత్ మాట్లాడుతున్నాడని, క్రిమినల్ సీఎం లా ఉంది రేవంత్ పద్ధతి ఉందని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని నడుపుతున్న వ్యక్తి క్రిమినల్ అయితే ఇక సమాజం ఎట్లా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఆలోచించాలి...ఈ సీఎంకు గడ్డి పెట్టాలన్నారు. కాంగ్రెస్ కు రేవంత్ భస్మాసురిడిలా మారాడని, ఆ పార్టీని ఫినిష్ చేసిందే ఆయన అన్నారు. రేవంత్ సమైక్య వాదుల చెప్పులు మోస్తున్నప్పుడు.. కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోస్తున్నాడన్నారు. కేసీఆర్ పేరు మార్చడానికి గోడ మీద పెయింట్ కాదు ..పెయింటర్ రెడ్డి అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.



తెలంగాణ ఆత్మ కేసీఆర్ అన్నారు. రేవంత్ కూర్చుంటున్న సచివాలయం కేసీఆర్ నిర్మించిందేనన్నారు. కేసీఆర్ శ్రమ లేకుంటే తెలంగాణ ఇంతటి ఉన్నత స్థితిలో ఉండేదా? అని ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన సొంత పార్టీ నేతలను ఫినిష్ చేసిన చరిత్ర రేవంత్ ది అని దుయ్యబట్టారు. నెహ్రూ ను మోడీ అవమానిస్తున్నట్టే రేవంత్ కేసీఆర్ ను అవమానిస్తున్నారన్నారు. హైడ్రా, మూసి, జీవో 46 ,జీవో 29, తెలంగాణ స్పెషల్ పోలీస్ ఇలా అన్నిటిలో రేవంత్ ది నెగిటివ్ మైండ్ సెట్ అన్నారు. చిల్లర మల్లర చేష్టలు మానుకో రేవంత్ రెడ్డి అని హెచ్చరించారు. పాలన చేత కాక పిచ్చి మాటలు అని ధ్వజమెత్తారు. అడ్డు అదుపు లేకుండా అహంకారం తో వ్యవహరిస్తే రేవంత్ ను ప్రకృతే చూసుకుంటుందని వెల్లడించారు.

## ఆంధ్రప్రదేశ్‌లో నేటి నుంచి ఉచిత గ్యాస్ పథకం అమలు

**వారధి న్యూస్, అమరావతి :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇప్పటికీ కొందరికీ ఫ్రీ గ్యాస్ ఎలా తీసుకోవాలనే సందేహం కలుగుతుంది. ఏయే పత్రాలు ఇవ్వాలి..? అని అడుగుతున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ధరఖాస్తు దారుని వద్ద ఎల్పీజీ కనెక్షన్, ఆధార్ కార్డ్, తెల్ల రేషన్ కార్డు ఉండాలి. ఎప్పటిలాగే మొబైల్ నంబర్ ద్వారా గ్యాస్ బుకింగ్ చేయాల్సి ఉంటుంది. గ్యాస్ బుక్ చేసిన తర్వాత 24 గంటల్లో గ్రామాల్లో.. రెండు రోజుల్లో సిలిండర్ డెలివరీ అవుతుంది. ఒకవేళ సిలిండర్ డెలివరీ సమయంలో గ్యాస్ డెలివరీ ఏజెంట్ డబ్బులు తీసుకుంటే రెండు-రోజుల్లో లబ్దిదారుల ఖాతాల్లో రూ.851 జమ అవుతుంది. గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకొని డీలర్ వద్దకెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఈ కేవైసీ చేసిన తర్వాత రెండు, మూడు రోజుల్లో అప్ డేట్ అవుతుంది. ఆ లోపు సిలిండర్ వస్తే డబ్బులు చెల్లించాలి. కేవైసీ పూర్తయిన తర్వాత.. సిలిండర్‌కు లబ్దిదారుడు ఇచ్చిన నగదు వారి ఖాతాలో జమ అవుతుంది. ఫ్రీ గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి సమస్య ఉంటే 1967 నంబర్‌కు కాల్ చేయాలని అధికారులు సూచించారు. ఫస్ట్ సిలిండర్ మార్చి 31వ తేదీ లోపు బుక్ చేసుకోవాలి.



# దీపాల వెలుగుల పరమార్థమే దీపావళి

దీపావళి అంటే దీపముల వరుస. చీకటి నుంచి వెలుగులోకి రావడం అనేది అంతరార్థం. మనచుట్టూ ఆవరించిన అంధకారం దీపం వెలిగించగానే మాయమైనట్లు అనేక జన్మలలో చేసిన పాపాలు భగవంతుని కరుణాకటాక్షాలతో దూరం అవ్వడమే దీపావళి. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాస ప్రారంభంలో దేవీ నవరాత్రులు, నరక చతుర్దశి, దీపావళి పండుగలు రావడం విశేషం. త్రయోదశి రోజు రాత్రి అపమృత్యు నివారణ కోసం దీపాలు వెలిగించి ఇంటిముందు ఉంచాలి. నరక చతుర్దశి రోజున అభ్యంగన స్నానం చేయాలి. అమావాస్య కనుక ప్రపంచమంతా చీకట్లు ఆవరించి ఉంటాయి. ఈ చీకట్లను పాదోలేందుకు దీపాలు వెలిగించాలన్న ఆలోచనతోనే దీపావళి జరుపుతారు. దీపాల వెలుగుల కారణంగా చీడపీడలు, పురుగూ పుట్రా, అడవి జంతువుల భయం ఉండదన్న భావన కూడా ఉంది. నరకాసురుడు మరణించిన రోజుగా నరకచతుర్దశినీ, దీపావళినీ వేడుక చేసుకుంటాం. ఈ పండుగ నుంచి మనం గ్రహించాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి. ఈ పండుగను నరకాసుర వధకు సంకేతంగా కాదు, మన లోపల ఉన్న దోషాలను తొలగించుకోవడానికి ఒక సంకల్పంగా జరుపుకోవాలి. అప్పుడే అది నిజమైన దీపావళి అవుతుంది. లేకపోతే డబ్బు ఖర్చు, నూనె ఖర్చు, టపాకాయల ఖర్చు తప్ప ప్రయోజనం ఉండదు.

నరకం వలన భయం లేకుండా నరక చతుర్దశి నాడు స్నానం చెయ్యాలని నరక చతుర్దశి గురించి యమధర్మరాజుని ఉద్దేశించి చెప్పినట్లు భవిష్య పురాణం చెబుతోంది. శ్రీరాముడు ఆశ్వయుజ మాసంలో విజయదశమి రోజున శమీ వృక్షాన్ని పూజించి అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడయ్యాడు. మహావిష్ణువు వామనావతారం ఎత్తి బలిచక్రవర్తిని పాతాళ లోకానికి పంపించాడు. అయినప్పటికీ బలి శ్రీహరినే ధ్యానిం



చాడు. దానికి సంతోషించిన శ్రీహరి 'నీవు దీపావళి రోజున పాతాళ లోకం నుంచి భూలోకానికి వచ్చి ఈ ఒక్కరోజు పరిపాలన చెయ్యి' అన్నాడు. ఆ రోజు వెలిగించే దీపాలకే బలిదీపం అని పేరు. వరాహావతారం లో విష్ణుమూర్తికి, భూదేవికి జన్మించినవాడే నరకాసు-రుడు. బ్రహ్మ వల్ల వరాలు పొంది దేవతల్ని బాధ పెట్టాడు. దేవతలందరూ దేవేంద్రుని వద్దకు వెళ్లి తమ బాధ చెప్పుకోగా దేవేంద్రుడు దేవతలందరితో కలిసి విష్ణు మూర్తి వద్దకు వెళ్లి ప్రార్థించగా శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి నరకుడిని వధించారు. భూదేవి కూడా నరకుడి మరణానికి బాధపడలేదు. ఆమె అతనొక్కడికే తల్లి కాదు, భూమి మీద జీవించే ప్రతివారికి తల్లే కదా. పుత్ర శోకాన్ని మరచి నరకుని పేరు మీద పండుగగా ప్రజలు జరుపుకోవాలని శ్రీమహావిష్ణువుని ప్రార్థించింది. అదే నరక చతుర్దశి. ఆ తర్వాత రోజే ఆనందోత్సాహాలతో జరుపుకునే దీపావళి పండుగ. ప్రతి ఇంటా దీపాల వెలుగులు నింపే పండుగ దీపావళి. చీకటిపై వెలుగు, చెడుపైన మంచి, అజ్ఞానం మీద జ్ఞానం సాధించిన గెలుపునకు ప్రతీక ఈ పండుగ. దీపావళి పండుగ అంటే ప్రముఖంగా గుర్తొచ్చేవి పట్టుబట్టలు, పిండివంటలు, బాణాసంచా, దీపాల కాంతులు. దేశ ప్రజలు తమదైన శైలిలో పండుగను ఒక్కో చోట ఒక్కో విధంగా చేసుకుంటారు. ఉత్తర, దక్షిణ భారత ప్రజలు తమదైన సంప్రదాయాలతో, భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు. అయితే ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో పండుగ జరుపుకునే పద్ధతులలే కాదు అందుకు గల కారణాలు కూడా వేరు. పండుగ ఎందుకు జరుపుకుంటున్నారనే దానిపై ఒక్కో ప్రాంతంలో ఒక్కో కథ ప్రచారంలో ఉంది. శ్రీ మహావిష్ణువు వరాహ అవతారంలో ఉండగా వరాహస్వామి, భూదేవిలకు అసుర సంధ్యా సమయంలో నరకుడు జన్మిస్తాడు. తపస్సుతో శివుడి చేత వరం పొంది దేవమానవులను చిత్రహింసలకు గురి చేస్తుంటాడు. నరకాసురుడు తల్లి చేతుల్లోనే చంప బడాలనే వరం పొందిన కారణంగా ఎదురులేని వాడై లోకాలను ముప్పతిప్పలు పెడుతుంటాడు. దీంతో భయాందోళనకు

గురైన దేవతలు శ్రీ మహావిష్ణువుని శరణువేడుతారు. వారికి అభయమిచ్చిన విష్ణువు భూదేవీ సమేతంగా శ్రీ కృష్ణ సత్యభామలుగా భూలోకంలో జన్మిస్తారు. నరకుని దురాగతాలు పెచ్చుమీరిన అనంతరం శ్రీకృష్ణుడు నరకుడిపై యుద్ధం ప్రకటిస్తాడు. భార్య సత్యభామను వెంటతీసుకెళతాడు. అక్కడి ఇరు వర్గాలకు భీకర యుద్ధం జరుగుతుంది. చివరకు నరకుడి వరం కారణంగా తల్లి అయిన సత్యభామ చేతిలోనే మరణిస్తాడు. దీంతో అతడి చెరలో ఉన్న దేవమానవులకు విముక్తి దొరకుతుంది. నరకాసురుడు మరణించాడన్న ఆనందంలో ప్రజలు దీపాలు వెలిగించి, బాణాసంచా పేల్చి పండుగ చేసుకున్నారు. శ్రీ మహావిష్ణువు ఏడవ అవతారమైన రామచంద్రుడు.. సీతను అపహరించిన రావణుడితో భీకర యుద్ధం చేస్తాడు. ఈ యుద్ధంలో రావణుడు మరణిస్తాడు. అప్పటికే రాముడి 14 ఏళ్ల వనవాసం ముగుస్తుంది. దీంతో రాముడు.. సీత,లక్ష్మణ,ఆంజనేయ సమేతంగా అయోధ్యకు తిరిగి వెళతాడు. అనంతరం రాముడు పట్టాభిషిక్తుడవుతాడు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ఆనందంతో పండుగ జరుపుకున్నారు. గదిని ఆవరించిన అంధకారం దీపం వెలిగించగానే మాయమైనట్లు అనేక జన్మలలో చేసిన పాపాలు భగవంతుని కరుణాకటాక్షాలతో దూరం అవ్వడమే దీపావళ అని పెద్దల ఉవాచ. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాస ప్రారంభంలో దేవీ నవరాత్రులు, నరక చతుర్దశి, దీపావళి పండుగలు రావడం విశేషం. త్రయోదశి రోజు రాత్రి అపమృత్యు నివారణ కోసం దీపాలు వెలిగించి ఇంటిముందు ఉంచాలి.

ఎడిటర్

# నేడు హారతులు.. లక్ష్మీ పూజలు

## నోములు, వ్రతాలకు నేడే ముఖ్యం

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 30 :** చతుర్దశి నాడు వేకువజామునే తైలాభ్యంగన స్నానం చేసే సంప్రదాయం అనాదిగా వస్తున్నది. అంతేకాదు, నువ్వుల నూనెలో లక్ష్మీ కళలు ఆవహించి ఉంటాయి. చతుర్దశి తెల్లవారు జామున నువ్వులతో తలంటుకొని తలస్నానం చేస్తే లక్ష్మీప్రదం. నరక దుర్గతి నుంచి విముక్తి లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ప్రదోషకాలంలో దీపారాధన చేయాలి. ఈ దీపాలు లక్ష్మీకటాక్షం కలిగించడంతోపాటు పితృదేవతలకు నరకబాధను విముక్తిచేస్తాయని నమ్మకం. దీపావళి నాడు హారతులు ప్రధానమైన వేడుక. పుట్టింటికి వచ్చిన ఆడకూతుళ్లు ఇంట్లో ఉన్న మగవాళ్లందరికీ హారతులు ఇస్తారు. సంప్రదాయబద్ధంగా కొనసాగే ఈ ప్రక్రియ గురువారం సూర్యోదయానికి ముందుచేసుకోవాలని సిద్ధాంతులు సెలవిస్తున్నారు. సూర్యోదయానికి ముందు కుదరని పక్షంలో, వర్జ్యం వెళ్లిపోయిన తర్వాత ఇవ్వొచ్చు. ఏటా అమావాస్య నాడు వచ్చే ఈ పండుగ




ఈసారి ఒకేరోజు జరుపుకోనున్నారు. అమావాస్య తిథి గురువారం పరివ్యాప్తమై ఉన్నందున గురువారం ఉదయం హారతులు, సాయంతరం లక్ష్మీపూజలుఉ చేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో హారతులు, లక్ష్మీపూజలు ఒకేరోజు చేసుకోవాలని పంచాంగకర్తలు సూచిస్తున్నారు. ఆశ్వీయుజ బహుళ చతుర్దశి, అమావాస్య తిథులు కలిసి వచ్చాయి. రాత్రంతా అమావాస్య తిథి పరివ్యాప్తమై ఉండటంతో దీపావళి గురువారమే చేసుకోవాలి. నోముల విషయంలోనూ పండితులు పలు సూచనలు చేస్తున్నారు. లక్ష్మీపూజలకు ఎలాగైతే సాయంత్రం అమావాస్య ఉండాలన్న నియమం ఉన్నదో.. నోములు నిర్వహించాలంటే సూర్యోదయానికి అమావాస్య తిథి ఉండాలని చెప్తున్నారు. దీపావళి పండుగ విశేషాలలో ముఖ్యమైంది లక్ష్మీపూజలు. వ్యాపారస్తులంతా దీపావళి సాయంత్రం లక్ష్మీదేవికి పూజలు చేసి, కొత్త ఖాతా పుస్తకాలు ప్రారంభిస్తారు. ఒక రకంగా చెప్పాలంటే లక్ష్మీపూజలతోనే కొత్త ఆర్థిక సంవత్సరాన్ని మొదలుపెడతారు. రాత్రిపూట అమావాస్య తిథి ఉన్నప్పుడే లక్ష్మీ పూజలు చేసుకోవాలని పండితులు చెప్తున్నారు. గురువారం సాయంత్రం లక్ష్మీపూజలు చేసుకోవాలని సూచిస్తున్నారు. దీపావళికి కొత్త అల్లుడిని ఇంటికి పిలిచి కొత్తబట్టలు, కానుకలు సమర్పించే సంప్రదాయం తెలుగువారికి ఉంది.

# మనలోని చెడును నరకాలి

## మంచితో ముందుకు సాగాలి

**తిరుపతి, అక్టోబర్ 30 :** నరకాసురుడు మంచి వంశం నుంచి వచ్చినవాడే. అతను విష్ణుమూర్తి కుమారుడని పురాణ గాథలు చెబుతున్నాయి. నరకాసురుడిలో కొన్ని చెడు ధోరణులు ఏర్పడ్డాయి. అతనికి మురాసురుడు అనే మిత్రుడున్నాడు. మురాసురుణ్ణి నరకుడు సేనానిగా చేసుకున్నాడు. వారిద్దరూ కలిసి ఎన్నో యుద్ధాలు చేశారు. వేలాది మందిని చంపారు. వారిద్దరినీ ఒకేసారి చంపడం కష్టం. కాబట్టి కృష్ణుడు మొదట మురాసురుణ్ణి చంపాడు. కృష్ణుడికి 'మురారి' అనే పేరు రావడానికి కారణం ఇదే! మురాసురుడికి మాయలు తెలుసు. వాటి వల్ల అతని ముందు యుద్ధంలో ఎవరూ నిలబడలేకపోయేవారు. మురాసురుడి వధ తరువాత నరకాసుర వధ తేలికయింది. నరకాసురుణ్ణి విడిచిపెట్టినా అతను పద్ధతుల్ని మార్చుకోడని కృష్ణుడికి తెలుసు. యుద్ధంలో నరకుణ్ణి మృత్యు ముఖానికి తీసుకువచ్చేసరికి, అతనికి జ్ఞానోదయం అయింది. అనవసరంగా చాలా చెడును మూట కట్టుకున్నానని అతను గ్రహించాడు. నువ్వు నన్ను చంపడం లేదు. నాలోని చెడును తొలగిస్తున్నావు. నాకు మంచే చేస్తున్నావు. ఈ విషయం అందరికీ తెలియాలి. నేను పోగు చేసుకున్న దోషాలు నాశనం అవుతున్న ఈ రోజును అందరూ పండుగ చేసుకోవాలి. ఈ రోజు నాకు ఒక కొత్త వెలుగును ఇచ్చింది. ఆ వెలుగు ప్రతి ఒక్కరూ పొందాలి అని కృష్ణుణ్ణి నరకాసురుడు కోరాడు. ఆ విధంగా ఆ రోజు దీపావళి పండుగ అయింది. ఈ రోజు దేశమంతా వెలుగులతో నిండిపోవాలి. ఆ వెలుగు మనలోని మలినాలను కాల్చెయ్యాలి. దానికోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. నేను నిన్ను చంపబోతు న్నాను అని నరకుడికి కృష్ణుడు చెప్పాడు. మనకు అలా చెప్పేవారు ఎవరూ ఉండరు. మనకు తెలియ కుండానే అది జరిగిపోవచ్చు. మృత్యువు మనల్ని ఎప్పుడు తీసుకుపోతుందో మనకు చెప్పదు. అది మనిషి రూపంలో రావచ్చు. మరణానికి కారణం బ్యాక్టీరియా, వైరస్ లేదా మనలోని జీవకణాలూ కావచ్చు. అప్పటి వరకూ ఎదురు చూడకుండా ఆత్మావలోకనం చేసుకోవాలి. మనలో విషం పోగు చేసుకుంటున్నామా లేదా దివ్యత్వాన్ని వికసింప జేసుకుంటున్నామా అనేది ఆలోచించాలి. ఎంపిక మన చేతిలోనే ఉంది. ప్రతి ఒక్కరికీ వారి జీవితాన్ని కొనసాగించడానికి కొన్ని ఎంపికలు ఉంటాయి. జీవితంలో ఎదురుదెబ్బలు తగిలే వరకూ ఎదురుచూడకుండా, అలాంటి పరిస్థితి రాకుండా మనల్ని మనం మలచుకోవడం సరైన ఎంపిక. కృష్ణుడు తనను తాను ఆ విధంగా మలచు కున్నాడు. కృష్ణుడి చేతిలో దెబ్బతినే పరిస్థితికి దారితీసే మార్గాలను నరకాసురుడు ఎంచుకున్నాడు. వారిలో ఒకరిని దేవుడిగా పూజిస్తాం. మరొకరిని రాక్షసుడిగా అసహ్యించుకుంటాం. అందుకే, సరైన మార్గంలో జీవితాన్ని మలచుకోవాలి. లేదంటే జీవితం తనదైన పద్ధతుల్లో మనల్ని మలుస్తుంది. ఈ వాస్తవాన్ని దీపావళి గుర్తు చేస్తుంది. మంచి పుట్టుక కలిగి ఉండి కూడా నరకుడు చెడ్డకు ప్రతినిధిగా మారాడు. మరణించే సమయంలో తన స్థితిని అతను గుర్తించాడు. అది ముందే గుర్తించేవారు మరింత ఉన్నతంగా జీవితాలను మలచుకోగలరు. నిర్దిష్టమైన రీతిలో తనను తాను మలచుకోవడానికి మనిషి ఎంతో శ్రమపడాలి. చాలామంది తమకు నిర్బంధాలైపోయిన విషయాలను జీవితపు చివరి క్షణాల వరకూ గ్రహించరు. ముందే వాటి గురించి తెలుసుకోగలిగితే జీవితాలను మెరుగుపరుచుకోవచ్చు. దానికోసం మనలో చైతన్యాన్ని వెలిగించుకోవాలి. ఈ పండుగ సందర్భంగా కాల్చి బూడిద చేయాల్సింది టపాకాయలను కాదు... మనలోని దోషాలనూ, లోపాలనూ! దీపావళి అందించే సందేశం ఇదే!



# బౌద్ధ మతంలో విభిన్నంగా దీపావళి

## దీపాల వరుసతో భిక్షులకు స్వాగతం

**అమరావతి, అక్టోబర్ 30 :** దీపావళికి ఒక్కోచోట ఒక్కో విధమైన కథ ప్రచారంలో ఉంది. అలాగే బౌద్ధంలోనూ ఓ కత ప్రచారంలో ఉంది. ప్రతి ఆషాఢ మాసంలో బౌద్ధ భిక్షువులకు వర్షావాసం ప్రారంభ మవుతుంది. ఆ కాలంలో మూడు నెలల పాటు భిక్షువులు ప్రజల వద్దకు భిక్ష కోసం వెళ్ళరు. అడవుల్లో, గుహల్లో ఉండి... దొరికింది తింటూ, ధ్యానంలో, విద్యలో ప్రత్యేక స్వయం శిక్షణ సాగిస్తారు. ఇలా వర్షావాసం పూర్తి చేసి, ఆశ్వయుజ మాసంలో తిరిగి గ్రామాలకు బయలుదేరుతారు. గ్రామాలకు వచ్చే భిక్షువులకు దారి పొడవునా దీపాలతో ప్రజలు స్వాగతం పలుకుతారు. అదే దీపావళిగా, బౌద్ధుల ధర్మ దీపావళిగా ప్రసిద్ధం చెందింది. బౌద్ధులు మరణాన్ని నిర్వాణం అంటారు. నిర్వాణం అంటే దీపం ఆరిపోవడం. ప్రమిదలోని నూనె, వత్తీ పూర్తిగా మండిన తరువాత ఇక దీపం వెలుగదు. అదే నూనె, అదే వత్తి ఇక ఉండవు. అంటే... అదే దీపాన్ని ఇక ఎప్పటికీ వెలిగించలేం. మనిషి నిర్వాణం తరువాత కూడా అంతే! ఇలా అనిత్యత్వాన్నీ, అనాత్మవాదాన్నీ దీపంతో పోల్చి చెబుతుంది బౌద్ధం. మరణించిన వ్యక్తి తల దగ్గర దీపం ఉంచే సంప్రదాయం బౌద్ధ భిక్షువుల నిర్వాణం నుంచి పుట్టినదే! స్తూపాల మీద దీపాలు ఉంచే ఆచారం కూడా దాన్నుంచి వచ్చిందే! అందుకే మరణాన్ని దీపం ఆరడంతో పోలుస్తాం. మనుషులు చీకటి నుంచి వెలుగులోకి, వెలుగు నుంచి వెలుగులోకి నడవాలని అంటుంది బౌద్ధం. చీకటి నుంచి వెలుగులోకి నడవడం అంటే అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు పయనించడం అని అర్థం. వెలుగు నుంచి వెలుగులోకి' అంటే 'విజ్ఞానం నుంచి శీలం వైపు పయనించడం' అని అర్థం. ఇలా మనిషికి శీలం, విజ్ఞానం ఈ రెండూ కలిసి ఉంటేనే పరిపూర్ణత. వేల ఏళ్ల క్రితమే బౌద్ధంలో దీప పూజ మొదలయింది. బౌద్ధ స్తూపాల దగ్గర, బౌద్ధ ఆరామాల్లో వందలాది దీపాలు వెలిగించేవారు. బౌద్ధ ధర్మోపన్యాసాలు, దాన కార్యక్రమాలు జరిగే ప్రదేశాలను దీపాలతో నింపేవారు. తమ గ్రామానికి బుద్ధుడు భిక్షువులతో కలిసి వచ్చిన సందర్భాల్లో ఇంటింటా దీపాలను వెలిగించి, ఆహ్వానం పలికే సంప్రదాయం బలీయంగా సాగింది. ఇల్లు వదలి వచ్చిన సిద్ధార్థుడు ఆరేళ్ళు కృషి చేసి, చివరకు జ్ఞానోదయం పొంది బుద్ధుడయ్యాడు. సారనాథ్‌లో మొదటి వర్షావాసం ముగించి రాజగృహకు వచ్చాడు. ఆ సమయంలో... బుద్ధుడైన తన బిడ్డను కపిలవస్తు నగరానికి తీసుకురావాలని మంత్రుల్ని ఆయన తండ్రి శుద్ధోధనుడు ఆదేశిస్తాడు. చివరకు సిద్ధార్థుడి బాల్య మిత్రుడైన కాలు ఉదాయిని పంపుతాడు. కాలు ఉదాయి బుద్ధుణ్ణి వెంటబెట్టుకొని కపిలవస్తుకు వస్తాడు. ఆ సందర్భంలో బుద్ధునికి శుద్ధోదనుడు దారిపొడవునా దీపాలు వెలిగించి స్వాగతం పలికాడు. ఆ రోజు రాజ్యమంతటా దీపాలు వెలిగించారు. అలా బుద్ధుడి కపిలవస్తు నగర పునరాగమనానికి సంకేతంగా దీపాలవెల్లి బౌద్ధ సంప్రదాయంగా నిలిచిపోయిందని అంటారు.



# ధరలతో కళతప్పుతున పండుగలు

**హైదరాబాద్, అక్టోబర్ 30 :** ధరల నేపథ్యంలో పండగలకు కళ తప్పింది. అన్ని పండగల్లాగే దీపావళి కూడా ఇంటికే పరిమితం కానుంది. బాణాసంచా కాల్చితేనే దీపావళి కాదు. అయితే దీపవాళి ప్రత్యేకతే వేరు. అయితే బాణాసంచా ధరలు కూడా విపరీతంగగా పెరిగాయి. దీపాలతో ఇల్లంతా వెలగించి కొత్త కాంతులను ఆహ్వానించడం ద్వారా పండగ జరుపుకోవాలి. అలాగే ధరలు దాడి చేస్తున్న వేళ కలసి పండగ జరుపుకోవాలని, బాణాసంచా కాల్చాలన్న ఆలోచన నుంచి బయటకు రావాలి. దీపావళి రోజు దీపాలు వెలిగించి, లక్ష్మీపూజలతో, ఇంటి పిండి వంటలకే ప్రాధాన్యం ఇస్తూ పండగ జరుపుకోవడం ఉత్తమం. ఏటా దీపావళి పర్వదినాన్ని పిల్లాపెద్దలు కసలి ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చెడుపై మంచి గెలుపునకు చిహ్నంగా దీపాల పండుగను జరుపుకొంటారు. దీపాల పండుగ వేడుకలకు ప్రజలు ముందుగానే దీపాలు వెలిగించేందుకు సిద్ధం కావడం ఈ యేడాది విశేషంగా చెప్పుకోవాలి. తగంలో ఎప్పుడూ లేనంతగా ఇప్పుడు ప్రజలు దీపాలను వెలిగించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ మేరకు మహిళలు ప్రమిదలను కొనుగోలు చేస్తున్నారు. ధరలు పెరిగిన నేపథ్యంలో పరిమిత ఖర్చుతోనే ప్రజలు గ్రీన్ దీపావళి జరుపుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. పటాసులు కొనుగోలు చేయకుండా మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగించి ఆనందాన్ని అందరితో పంచుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ధరల దెబ్బంతో వెలుగుల పండుగ దీపావళి కళతప్పుతోందన్న భావన రాకుండా దీపాలను వెలగించి పూజలలో భక్తిప్రపత్తులు చాటడం ముఖ్యం.



అయితే తారాజువ్వల వెలుగులు, టపాసుల మోతలతో సందడిగా సాగాల్సిన పండుగ రోజు ఈసారి నిశబ్దంగా గడిచిపోనుందన్న భావన పిల్లల్లో ఉండడం సహజం. పర్యావరణహితం కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఏటా పండుగకు వారం ముందునుంచే బాణాసంచా విక్రయాలతో సందడి ప్రారంభమవుతుంది. బాణాసంచా దుకాణాలకు అనుమతి పక్రియలో భాగంగా ఒక్కో దుకాణదారుడు రూ.30వేల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. ఇక ఒక్కో దుకారణదారుడు సుమారు లక్ష నుంచి రూ.5లక్షల వరకు బాణసంచా కొనుగోలు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అమ్మకాలు సాగుతాయా లేవా అన్న భయం ఉంది.

## గల్ఫ్ ఎక్స్ గ్రేషియా మంజూరి పత్రం అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

- గల్ఫ్ కార్మికుల సమస్యల అధ్యయనానికి త్వరలో అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు



వారధి న్యూస్ , జగిత్యాల ప్రతినిధి : సౌదీ అరేబియాలో మృతి చెందిన కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి అంజయ్య కుటుంబానికి మంగళవారం రూ.5 లక్షల గల్ఫ్ ఎక్స్ గ్రేషియా మంజూరి పత్రం (ప్రొసీడింగ్స్) ను మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక కార్యక్రమంలో అందజేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా (మృతధన సహాయం) ఇవ్వడం దేశ చరిత్రలోనే ప్రథమం అని అన్నారు. గల్ఫ్ కార్మికులు, ఎన్నారైలు తమ సమస్యలు విన్నవించుకోవడానికి హైదరాబాద్ ప్రజాభవన్ లో 'ప్రవాసీ ప్రజావాణి' కౌంటర్ ఏర్పాటు చేశామని, గల్ఫ్ కార్మికుల సమస్యలు అధ్యయనం చేసి ప్రభుత్వానికి సూచనలు చేయడానికి త్వరలో అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. కాంగ్రెస్ ఎలక్షన్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 'గల్ఫ్ గ్యారంటీ' ని అమలు చేసిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి,టీపీసీసీ అధ్యక్షులు బి. మహేశ్ కుమార్ గౌడ్ కు,మంత్రివర్గానికి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు అందరికీ కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంజనీరింగ్ కాలేజీ మౌలిక వసతుల కల్పనలో కృషి చేస్తా

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వారధి న్యూస్, వనపర్తి: జె.ఎన్.టి.యు. ఇంజనీరింగ్ కాలేజీలో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం జె.ఎన్.టి.యు. రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ మరియు చీఫ్ ఇంజనీర్ వేంకటేశ్వర రెడ్డి కలెక్టర్ ను తన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్, వనపర్తి జిల్లాలో 2022లో ప్రారంభమైన జె.ఎన్.టి.యు. ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న సమస్యలను కలెక్టర్ కు వివరించారు. కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం వంద కోట్ల పరిపాలన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, నిధులు ఇంకా విడుదల కాలేదని, అందుబాటులో నిధులు లేక విద్యార్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించలేకపోతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీని పట్ల స్పందించిన కలెక్టర్, సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుతో పాటు మౌలిక వసతుల కల్పనలో తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.ఎస్. రాజు, వైస్ ప్రిన్సిపాల్ రామ్ నరేష్ కూడా పాల్గొన్నారు.

## దీపావళి పండగ జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి



వారధి.న్యూస్ : నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ దీపావళి పర్వదినాన్ని జిల్లాలోని ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఈ పండగ ప్రజల జీవితాల్లో మంచిని తీసుకురావడంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకాంక్షించారు. గురువారం దీపావళి పండగను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలతో పాటు అధికారులకు, ప్రజాప్రతినిధులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండగ చీకటిని పారద్రోలుతూ వెలుగులు తీసుకు వచ్చే ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందాల హరివిల్లుకు వేదిక కావాలని అభిలషించారు. దీపావళి దివ్య కాంతులు ప్రతి ఒక్కరి జీవితంలోనూ శాంతి, శ్రేయస్సు, ఆనందాలను అందించాలన్నారు. చెడుపై మంచి సాధించిన విజయాన్ని దీపావళి సూచిస్తుందని, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. అలాగే జిల్లాలోని ప్రజలు టపాసులు కాల్చే సందర్భంలో అవసరమైన జాగ్రత్తలు, పాటిస్తూ పండగను ప్రతి ఒక్కరు ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, అధికారులకు దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ క్రీడలకు ఎంపికైన శ్రీచరణ్



వారధి న్యూస్ , జగిత్యాల ప్రతినిధి : రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ క్రీడా పోటీలకు జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణ వేణి టాలెంట్ స్కూల్ కు చెందిన విద్యార్థి ఎంపికయ్యారు.జగిత్యాల నుండి ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పాఠశాలల క్రీడలో అత్యంత ప్రతిభ కనబరిచిన సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన బుక్య శ్రీ చరణ్ నాయక్ 9 వ తరగతి అండర్ 17 బాలుర విభాగం బాస్కెట్ బాల్ క్రీడకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కొంగల రవీందర్ రెడ్డి తెలిపారు.నవంబర్ 2 నుండి మహబూబాద్ జిల్లాలో కేసముద్రం లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో చరణ్ పాల్గొంటారని తెలిపారు. శ్రీ చరణ్ ను పాఠశాల కరస్పాండెంట్ కొంగల రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి,ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రేచపల్లి గ్రామస్థులు అభినందించారు.

## పాలమూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ముట్టడించిన మాజీ మంత్రి

- సీఐ అప్పయ్య పై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగిన శ్రీనివాస్ గౌడ్
- ఘటనాస్థలి నుంచి కేటీఆర్ కు ఫోన్
- ఉన్నతాధికారుల హామీతో ధర్నా విరమించిన శ్రీనివాస్ గౌడ్



వారధి న్యూస్ మహబూబ్ నగర్ : సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్ట్ లు పెట్టారని పార్టీ నాయకుడు వర్ధ భాస్కర్ ను పోలీస్ స్టేషన్ కి పిలిపించి మొదటి పట్టణ సిఐ కొట్టాడని నిరసిస్తూ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యం లో భారత రాష్ట్ర సమితి నాయకులు మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా తనను సీఐ అప్పయ్య వాడు వీడు అంటూ సంబోధిస్తున్నాడు అంటూ శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులను అమర్యాదగా మాట్లాడే హక్కు నీకు ఎవరు ఇచ్చారు అంటూ నిలదీశారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో మరియు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పోలీసులకు ఎంతో మర్యాద ఇచ్చానని... కేవలం 9 నెలల కాలంలోనే వారంతా ఇలా మారిపోయి నోటికొచ్చినట్లుగా తమను దూషించడం ఏమిటని శ్రీనివాస్ గౌడ్ అత్యంత ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర మూలాలు ఉన్న సిఐ అంటూ సిఐ అప్పయ్య పై నిప్పులు చెరిగారు. వర్ధ భాస్కర్ ను పరామర్శించడానికి ఇంటికి వెల్లిన నాయకులు అయన ఒంటి పై గాయాలు.. అయన ఆవేదన చూసి ఆయన ఇంటి నుంచి ర్యాలీగా పోలీస్ స్టేషన్ కు వెల్లి నిరసన వ్యక్తం చేసారు. సామజిక మాధ్యమాల్లో ప్రభుత్వ వ్యతిరేక పోస్ట్ లు పెట్టినందుకు సిఐ అప్పయ్య స్టేషన్ లో భూతులు తిడుతూ కొట్టారని బాధితుడు వర్ధ భాస్కర్ తెలిపారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. చట్ట పరిధిలో పని చేయాల్సిన అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా పని చేసి పోలీస్ వ్యవస్థకి చెడ్డపేరు తీసుకువస్తున్నారని అన్నారు. సామజిక మాధ్యమాల్లో పోస్ట్ లు పెడితే ఏదైనా సమస్య వస్తే పిలిచి మాట్లాడాలని.. ఇష్టం వాచినట్టు కొడితే ఎలా అని ప్రశ్నించారు. అతనికి ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని సిఐ ని అడిగారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలో వస్తుందని.. చట్టాన్ని అతిక్రమించి పని చేసిన అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేసారు. వర్ధ భాస్కర్ ని సిఐ కొట్టిన ఘటనపై న్యాయపరంగా ముందుకు వెళ్తామని చెప్పారు. మళ్లి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో నేతలు ఆందోళన విరమించారు. నిరసన కార్యక్రమం లో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఆంజనేయులు, రవి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు రాజు సాగర్, కిషోర్, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### కేటీఆర్ ఫోన్

పార్టీ నాయకుడు వర్ధ భాస్కర్ ను సిఐ అప్పయ్య కొట్టిన విషయం తెలుసుకొని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్ వర్ధ భాస్కర్ ను ఫోన్ లో పరామర్శించారు. ప్రభుత్వ తప్పులని ప్రశ్నిస్తే పార్టీ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తే భయపడవద్దని చెప్పారు. సిఐ పై చట్టప్రకారం ముందుకు వెళ్తామని, ఉన్నతాధికారులతో మాట్లాడుతానని కేటీఆర్ చెప్పారు.

## నూతన విధానం ద్వారానే మిల్లర్లకు ధాన్యం సరఫరా

- అదనపు కలెక్టర్ కే సీతారామారావు



వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో: రైస్ మిల్లర్లు ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు చేయాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కచ్చితంగా బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ ను పౌరసరఫరాల కార్పొరేషన్ కు సమర్పించాల్సి ఉంటుందని నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ కే సీతారామారావు తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు పై నూతన విధివిధానాలపై అవగాహన సమావేశాన్ని మిల్లర్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కే సీతారామారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 27 ద్వారా తీసుకొచ్చిన నూతన విధివిధానాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేయాలంటే మిల్లర్లు కచ్చితంగా బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్లను సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మిల్లర్లను నాలుగు రకాలుగా విభజించడం జరిగిందని అందులో గతంలో ఎలాంటి బకాయిలు లేని మిల్లర్లు 10 శాతం బ్యాంకు గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది అన్నారు. రెండవ రకం మిల్లర్లు గత బకాయిలతో పాటు పెనాల్టీ ఉన్నవారు 20 శాతం బ్యాంకు గ్యారంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ అందించాలన్నారు. మూడవ రకం మిల్లర్లు 100 శాతం బకాయిలు చెల్లించి 25 శాతం పెనాల్టీ పెండింగ్ ఉన్నవారు 25 శాతం పెనాల్టీ లేదా 25 శాతం బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే నాలుగో రకం మిల్లర్లు డిఫాల్టర్లుగా ఉన్నవారికి ధాన్యం కేటాయించబడదని అదనపు కలెక్టర్ తెలియజేశారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ అభ్యర్థన మేరకు మిల్లర్లకు అదనపు మిల్లింగ్ చార్జీలు కూడా అందజేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ అన్నారు. దొడ్డు రకం ధాన్యానికి క్వింటాలకు రూ.30/- అలాగే సన్న రకానికి రూ. 40/- చెప్పన అదనపు మిల్లింగ్ చార్జీలు అందించడం జరుగుతుందని, మిల్లర్లకు కేటాయించగా మిగిలిన ధాన్యాన్ని జిల్లాలోని గోదాములలో భద్రపరచడం జరుగుతుందన్నారు. మిల్లర్లు అందరూ వరి ధాన్యం కొనుగోలుకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించాలన్నరు. రైస్ మిల్లర్లు తప్పనిసరిగా సన్న రకం, దొడ్డు రకం వరి ధాన్యాన్ని దిగుమతులు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే 127 ప్రారంభం చేయడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని వసతులను కల్పించడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా వరి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు మిల్లర్లు పూర్తిస్థాయిలో జిల్లా యంత్రాంగానికి సహాయ సహకారాలను అందించాలని ఆయన సూచించారు. సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్సీఐకి అందజేసే ప్రక్రియను మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం విధించిన గడువు నేటితో ముగిసిందని, అందుకు మిల్లర్లు పెండింగ్ లో ఉన్న సీఎంఆర్ ను వెంటనే అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎం సివిల్ సప్లై రాజేందర్ , జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, అందరు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధి కోసం పార్టీలకతీతంగా కృషి

- మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి..



వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి : జగిత్యాల పట్టణాభివృద్ధి కోసం పార్టీలకతీతంగా కృషి చేస్తూ ముందుకు వెళుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి తో ముందుకు వెళ్తామని ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. జగిత్యాల పట్టణములో పారిశుధ్యము మెరుగు పరుచుటలో పలు వార్డులలో పాత ఆటోలు తరచూ రిపేర్ కావడం వలన ఇంటి చెత్త సేకరణకు ఇబ్బందులు ఏర్పడ్డాయని, అట్టి పాత ఆటోల స్థానములో 16 కొత్త ఆటోలు కొనుగోలు చేసి పట్టణ పారిశుద్యమునకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని బీట్ బజార్ యందు నూతనముగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను వినియోగములోకి తీసుకురావాడంలోకి 25 లక్షలుకేటాయించేందుకు సభ ఆమోదం తెలిపింది. సమావేశములో 9 అజెండా అంశములు ప్రవేశ పెట్టగా కౌన్సిల్ ఆమోదము తెలిపినది. పలువురు సభ్యులు పలు సమస్యలను అధ్యక్షురాలి దృష్టికి తీసుకరాగా అట్టి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్ బి.చిరంజీవి, తహసీల్దార్ రాం మోహన్,డి.ఈ యాదగిరి, మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీయర్లు శరణ్ తేజ, అనిల్, టి.పి.ఓ.శ్రీనివాన్,మునిసిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా పారదర్శకంగా జరగాలి

- నిర్దేశించిన మిల్లు లేదా గోదాము కు మాత్రమే వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వారధి న్యూస్, వనపర్తి : వానాకాలం వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టర్ ఛాంబర్ లో వరి కొనుగోలు పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి నిర్దిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని, ప్రతి ధాన్యపు బస్తా పై గుర్తింపు సంఖ్య ముద్రించాలని కలెక్టర్ సూచించారు. పౌర సరఫరాల శాఖ ద్వారా కొనుగోలు కేంద్రం నుండి కేటాయించిన మిల్లు లేదా గోదాముకు మాత్రమే ధాన్యం తరలించాలని, విధులకు విరుద్ధంగా ధాన్యం తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో కనీస మౌలిక వసతులు, తూకం యంత్రాలు అందుబాటులో ఉండాలని సూచించారు. ధాన్యానికి తేమ శాతం పరిమితులు నిర్ణయిస్తూ, పంట కోతల ప్రారంభం కాగానే కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రావాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జి. వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, డి.యం. ఇర్ఫాన్, డి.పి యం అరుణ తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్, నిబంధనల ప్రకారం టపాసులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి

- లైసెన్స్ లేకుండా విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలులి
- టపాసులు కాల్చే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలిలి
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి : దీపావళి పండుగ సందర్భంగా టపాసులు విక్రయ దుకాణాలు నిర్వహించేవారు లైసెన్స్ ఉన్న వారు మాత్రమే నిబంధన మేరకే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ఎలాంటి అగ్ని ప్రమాదాలు,అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రదేశంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జనవాసాలు లేని బహిరంగ ప్రదేశాలలో మాత్రమే టపాకాయల షాపుల ఏర్పాటు చేసుకోవాలని అన్నరు.టపాసులను జనావాసాలలో ఎట్టి పరిస్థితుల్లో నిలువ చేయరాదని, ఇలా నిలువ చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సూచించారు. దుకాణాల సమీపంలో ఇసుక, నీరు, ఫైర్ ఎక్స్ట్రిమిషన్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.అనుమతి లేకుండా బాణసంచా నిలువ చేసినా,తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.దీపావళి సందర్భంగా పిల్లలు, పెద్దలు టపాసులు కాల్చే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకొని పండగను ప్రశాంత వాతావరణ%శీ%లో జరుపుకోవాలని ఎస్.పి సూచించారు.

## బీసీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

- ఇది తగదన్న బీసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సాగర్



వారధి న్యూస్ మహబూబ్ నగర్ : మహబూబ్నగర్లో బీసీలపై జరుగుతున్న కక్ష సాధింపు చర్యలను ఆపాలని, గత ప్రభుత్వంలో జరిగిన విధంగా ఈ ప్రభుత్వంలో కూడా ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో విమర్శిస్తే తట్టుకోలేని పరిస్థితిలో నాయకులు ఉన్నారా అని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో ఖండించారు. గత ప్రభుత్వంలో ఇటువంటి ఎన్నో సంఘటనలు జరిగిన మేం అధికారంలోకి వస్తే ప్రశాంత పాలమూరు.. స్వేచ్ఛాయుత పాలమూరు అనే నినాదంతో గత ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చి ఇప్పుడు మరిచినట్లు ఉందని బీసీ సమాజ్ భావిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అంటేనే ప్రశ్నించడం కాబట్టి నిన్న పాలమూరులో వర్ధ భాస్కర్ ముదిరాజ్ అనే నాయకుడిపై సామాజిక మధ్యమంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నాడనే నేపంతోనే పోలీసులు బైండోవర్ చేసి ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదని, భవిష్యత్తులో ఏ బి సి నాయకులపై ఇబ్బందులకు గురిచేసిన బీసీ సమాజ్ చూస్తూ ఊరుకోదని, ఎక్కడ బీసీలకు అన్యాయం జరిగిన బీసీ సమాజ్ ప్రశ్నిస్తుందని శ్రీనివాస్ సాగర్ అన్నారు.

## కొల్లాపూర్ ఆర్డీవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన భన్సీలాల్



వారధి న్యూస్, కొల్లాపూర్: కొల్లాపూర్ రెవిన్యూ డివిజన్ ఆర్డీవో గా భన్సీలాల్ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. గజ్వేల్ ఆర్డిఓ గా పనిచేస్తున్న భన్సీలాల్ కొల్లాపూర్ ఆర్డిఓ గా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ ఇంచార్జ్ ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న టిఆర్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వై యాదగిరి భన్సీ లాల్ కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్డీవోగా విధులు చేపట్టిన భన్సీ లాల్ మాట్లాడుతూ.... కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# ‘హిందూ రాష్ట్ర’ను పునరుద్ఘాటించిన భగవత్



ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపక దినమైన అక్టోబరు 12, విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్ చీఫ్ డాక్టర్ మోహన్ భగవత్ ప్రసంగించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి దిగజారిన తర్వాత ఆయన చేసిన మరో ముఖ్యమైన ప్రసంగం నేపథ్యంలో ఇది జరిగింది. ఆ ప్రసంగంలో ఆయన నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకున్నారు. తాను మానవ మాత్రుడ్ని కాదని, దేవుడు తనను పంపాడని మోడీ చెప్పుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. బిజెపి 303 సీట్ల నుండి 240 సీట్లకు పడిపోయిన నేపథ్యంలో భగవత్ మాట్లాడుతూ, ‘ఒక వ్యక్తి సూపర్‌మ్యాన్‌గా వుండాలని కోరుకుంటాడు. ఆ తర్వాత దేవ దూత కావాలని, అటుపై భగవాన్ కావాలని కోరుకుంటాడు.’ అని వ్యాఖ్యానించారు. గతంలో అంత సామర్థ్యం లేనందున తాము ఆర్ఎస్ఎస్ సాయం కోరామని, కానీ ఇప్పుడు మరింత సామర్థ్యాన్ని సముపార్జించుకున్నామని బిజెపి పేర్కొన్న మొదటి ఎన్నికలు కూడా ఇవే కావచ్చు. భగవత్ ఈ ప్రసంగంతో నరేంద్ర మోడీ తలకెక్కిన అహంకారాన్ని కిందకు దించారు. సంఘపరివార్‌గా పిలిచే ఆర్ఎస్ఎస్ కూటమి హర్యానా ఎన్నికల్లో అతి చురుగ్గా పనిచేసింది. దానికి తోడు ఎన్నికల కమిషన్ మేనిపులేషన్ సాయంతో బిజెపి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ తప్పకుండా గెలుస్తుందనే భావనను పక్కకు నెట్టి మరీ బిజెపి ఈ విజయాన్ని మూటగట్టుకుంది. తాజాగా దసరా ప్రసంగంలో ఆయన బిజెపి విధానాలనే చాలా వరకు ఏకరవు పెట్టారు. బిజెపి యేతర ప్రభుత్వాలు వున్న రాష్ట్రాల్లో ఆర్ఎస్ఎస్ లక్ష్యాలను, కీలకమైన హిందుత్వ రాజకీయాలను ఎలా తీసుకెళ్లాలో చెప్పారు. ‘డీప్ స్టేట్’, ‘వోకిజమ్’, ‘కల్చరల్ మార్క్సిస్ట్’ వంటి పదాలన్నీ సాంస్కృతిక సంప్రదాయాలకు శత్రువులు. ఇందుకు వారు అనుసరించే పద్ధతి ముందుగా విద్యా సంస్థలను తమ ప్రభావం కిందకు తీసుకోవాలనుకుంటారు. ఆ తర్వాత ఆలోచనలను, విలువలను, సమాజ విశ్వాసాలను నాశనం చేయడానికి వారు ప్రయత్నిస్తారు. అటుపై సమస్యలను కృత్రిమంగా సృష్టించి, ప్రజల్లో తాము బాధితులమనే భావనను పాదుకొల్పడానికి ప్రయత్నిస్తారు. ఆ తర్వాత, అసమ్మతిని రెచ్చగొడతారు. ప్రజలు దూకుడుగా వ్యవహరించేలా చేస్తారు. ఒక అరాచక వాతావరణాన్ని సృష్టిస్తారు. వ్యవస్థ పట్ల చట్టాలు, పాలన పట్ల ప్రజల్లో విద్వేషం నెలకొనేలా చేస్తారు. ఇవన్నీ చేసిన తర్వాత దేశంపై ఒకరి ఆధిపత్యం లేదా పెత్తనం చెలాయించడమన్నది చాలా సులభతరమై పోతుంది.” అని చెప్పుకొచ్చారు.

సామాజిక, రాజకీయ అన్యాయాలను సహించలేని ప్రజల ప్రవర్తన, వారి వైఖరులను ఉద్దేశిస్తూ, పెద్దగా ప్రాచుర్యంలో లేని పదం వోకిజం (మేల్కొలుపు)ను అత్యంత అవమాన కరమైన రీతిలో మితవాదులు ఉపయోగించారు. ఆయన చేసిన ప్రసంగంలో ఇదే కీలకమైన వాక్యం. సామాజిక రాజకీయ వర్గాల్లో హిందూ మితవాదం ఆధిపత్యం చెలాయించేంత ఆర్ఎస్ఎస్ కూటమే ఈ పద్ధతిని అమలు చేస్తోంది. తన శాఖల ద్వారా అంటే సరస్వతి శిశు మందిర్, ఏకలవ్య విద్యాలయాలు వంటి పాఠశాలల ద్వారా అలాగే తనకున్న విస్తృత నెట్‌వర్క్ ద్వారా నోటి ప్రచారం ద్వారా దీనిని ముందు తనకు అలాగే కుల, లింగ వివక్ష వ్యవస్థను పెంచుతున్న సామాజిక ఇంగిత జ్ఞానాన్ని (సోషల్ కామన్‌సెన్స్) తన విస్తృత నెట్‌వర్క్ ద్వారా ఇది ప్రభావితం చేస్తోంది. ఇక చివరగా బిజెపి సానుభూతి గల కార్పొరేట్, ఐ.టి విభాగాలు మీడియాను నియంత్రించడం ద్వారా సమాజంలోని పెద్ద వర్గం ఆలోచనా ధోరణిని హిందూ జాతీయవాద కార్యాచరణ రూపు దిద్దుతోంది.

> ఇప్పుడు వోకిజం (మేల్కొలుపు) ఏం చేస్తుంది? న్యాయమైన సమాజం కోసం ఇది ఆకాంక్షిస్తుంది, పోరాడుతోంది. కులం, మతం, రంగు, భాషల ప్రాతిపదికగా వివక్షను ప్రదర్శించడాన్ని ఇది వ్యతిరేకిస్తుంది. ఎల్.జి.బి.టి హక్కులకు మద్దతిస్తుంది. అన్ని జీవుల సమానత్వపు హక్కులను హిందూ జాతీయవాద రాజకీయాల్లో చాలా కీలకమైన బ్రాహ్మణవాదం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. దీన్నే మరికొద్దిగా స్పష్టంగా, సూటిగా చెప్పాలంటే పలు రకాల రాజకీయ ధోరణులకు మతం ముసుగు వేస్తారు. తాలిబన్, ముస్లిం బ్రదర్‌హుడ్, అలాగే శ్రీలంక, మయన్మార్‌లలో బౌద్ధ మతం పేరుతో రాజకీయాలు, అసమానతలను పెంచి పోషిస్తున్న క్రైస్తవ ఛాందసవాదం ఇవన్నీ ఆ కోవలోకే వస్తాయి. స్థానిక పరిస్థితులపై ఆధారపడి వారు భిన్న వ్యక్తీకరణలకు పాల్పడుతుంటారు. మరో రకంగా చూసినట్లైతే, హిందూ జాతీయవాద సిద్ధాంత వ్యవస్థాపకులు, దళితులను, మహిళలను కించపరుస్తున్న మనుస్మృతిని ప్రశంసించారు. ముస్లింలు, క్రైస్తవులను కూడా ఆర్ఎస్ఎస్ విదేశీయులుగానే పరిగణిస్తోంది. 1984లో సిక్కుల ఊచకోతకు రహస్యంగా మద్దతిచ్చింది. ఒక సమాజంలో సామాజిక ఉద్యమాల లక్ష్యమైన సమానత్వపు విలువల ను ముందుకు తీసుకెళ్ళడానికి చూస్తున్నందున వోకిజాన్ని ఒక దుష్ట శక్తిగా, రుగ్మతగా మితవాద రాజకీయాలు భావిస్తున్నాయి. అణచివేత కు గురైన వర్గాలు చేసే చాలా ఉద్యమాల బలమైన కోరికే ప్రజా స్వామ్యం, దీనికోసమే ఇదంతా. భారతదేశంలో దళితులు, మహిళలు, ఎల్.జి.బి.టి చేపట్టే ఉద్యమాలను హిందూ జాతీయవాదులు తక్కువ చేసి చూస్తున్నారు. ఛాందసవాద శక్తులు పాలన సాగించే ముస్లిం మెజారిటీ దేశాల్లో మహిళలు ప్రధాన లక్ష్యాలుగా మారుతున్నారు. సమానత్వపు విలువల స్థానే అసమాన విలువలతో కూడిన ప్రాచీన స్వర్ణయుగపు విలువలను ప్రవేశపెట్టాల న్నది ఆర్ఎస్ఎస్ కూటమి ప్రయత్నంగా వుంది. అణగారిన వర్గాల హక్కులను పెంపొందించే ఆలోచనలు, ఉద్యమాల కోసం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తలు ఈ వోకిజం పదాన్ని ఉపయోగిస్తున్నారు.

ఆర్ఎస్ఎస్, బిజెపిల మధ్య అంతర్గత ఘర్షణలు వారికే సంబంధించిన ప్రైవేటు అంశం. కాగా వాటి మధ్య ఇగో ఘర్షణలు వున్నప్పటికీ ఈ రెండు సంస్థల మౌలిక విలువలు ఒక్కటే. ఇతర విషయాలు చాలా వాటిల్లో బిజెపి ఏం చెబుతోందో భగవత్ కూడా అదే చెబుతారు. ”ఈ కారణంగా నేడు, దేశంలోని వాయవ్య సరిహద్దుల్లోని పంజాబ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లు, సముద్ర హద్దులు కలిగిన కేరళ, తమిళనాడులు, బీహార్ నుండి మణిపూర్ వరకు మొత్తంగా పూర్వాంచల్ ప్రాంతాలు కల్లోలమయ్యాయి.” అంటూ బిజెపి యేతర పాలిత రాష్ట్రాలను ఆయన విమర్శించారు. లడఖ్‌ను, మణిపూర్‌ను ఒక గాటన కట్టడం ద్వారా వారి అసలు రంగు కూడా బయటపడిరది. మణిపూర్‌లో కుకీలకు వ్యతిరేకంగా మరీ ముఖ్యంగా మహిళలపై అత్యంత హేయమైన రీతిలో హింస చోటు చేసుకుంది. ఈ విషయంలో బిజెపి ప్రభుత్వ ఉదాసీనత మరింత ఆందోళన కలిగిస్తోంది. లడఖ్‌కు సంబంధించినంతవరకు పర్యావరణాన్ని పరిరక్షించేందుకై, సమాన పౌరసత్వం కోసం అనేక ఉద్యమాలను మనం చూశాం. పోరాటాలు చేయాల్సినంత తీవ్రమైన అంశాలే అవి. ఎంత శాంతియుతమైన పోరాటం అది? గుర్తించదగినటువంటి సోనమ్ వాంగ్‌చుక్ నాయకత్వం గురించి స్వర్ణాక్షరాలతో రాయవచ్చు. అలాగే ఆర్ఎస్ఎస్ నుండి ఉద్భవించిన బిజెపి మొత్తంగా ఈ లడఖ్ ఉద్యమాన్ని ఏ విధంగా నిర్లక్ష్యం చేసిందో కనిపిస్తోంది. ఇది భారతదేశ సమకాలీన చరిత్రలో ఒక చీకటి అధ్యాయం. ఆర్.జి కర్ మెడికల్ కాలేజీ విషాద ఘటన గురించి ప్రస్తావించడం, మరోవైపు మహిళా రెజ్లర్లపై జరిగిన అత్యాచారాలు దళిత బాలికలపై పెరుగుతున్న అత్యాచారాల పట్ల మౌనం పాటించడం చూస్తుంటే ఆయన పక్షపాతం అర్థమవుతోంది. అత్యాచారమనేది ఇండియా (పట్టణ) ప్రాంతాల్లో జరుగుతుంది తప్ప భారత్ (గ్రామాల్లో)లో జరగదని ఈ మహానుభావుడు ఒకసారి వ్యాఖ్యానించారు. కానీ ఇటువంటి కేసుల్లో చాలా శాతం బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే చోటు చేసుకుంటున్నాయి. అవి కూడా గ్రామాల్లోనో లేదా చిన్న పట్టణాల్లోనో జరుగుతున్నాయి. ఇలాంటి కేసులు అంటే దళితులపై అత్యాచారాలు 2022లో ఉత్తరప్రదేశ్‌లో 12,287 చోటు చేసుకోగా తర్వాత స్థానంలో రాజస్థాన్ (8,651), మధ్యప్రదేశ్ (7,732) నమోదవుతున్నాయని, సామాజిక న్యాయం, మహిళా సాధికారత మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ఇది ఆందోళనకరమైన పరిణామం.


# డీఎస్సీపై ఏపీ ప్రభుత్వం బిగ్ అప్‌డేట్!




ఏపీ ప్రభుత్వం మరో ఎన్నికల హామీ అమలు దిశగా అడుగుల వేస్తోంది. అధికారంలోకి వస్తే డీఎస్సీ నోటిఫికేషన్ పైన తొలి సంతకం చేస్తామని నాడు హామీ ఇచ్చారు. ఇప్పటికే మెగా డీఎస్సీ నిర్వహణ పైన నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా డీఎస్సీ నిర్వహణ .. పోస్టుల భర్తీ పైన ప్రభుత్వం తాజాగా కీలక ప్రకటన చేసింది. టెట్ కీ విడుదల చేసిన ప్రభుత్వం.. టీచర్ పోస్టుల భర్తీకి ముహూర్తం ఖరారు చేసింది. ఏపీ ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణ పైన కసరత్తు చేస్తోంది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ కోసం ముహూర్తం ఫిక్స్ చేసింది. నవంబర్ 6న నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించింది. 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. దీనికి అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పోస్టుల రోస్టర్ వివరాలు సమర్పించాలని ఇటీవల పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు. మరోవైపు నవంబరు 2న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాలు విడుదల చేయనున్నారు. ఈ ఫలితాలు విడుదల చేసిన తర్వాత డీఎస్సీ ప్రకటిస్తే కొత్తవారు కూడా దరఖాస్తు చేసుకునే వీలు కలుగుతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే మూడు నుంచి నాలుగు నెలల్లో డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి వారికి బాధ్యతలు అప్పగించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వేసవి నాటికి కొత్త టీచర్లకు శిక్షణ పూర్తిచేసి, వచ్చే విద్యా సంవత్సరంలో బడులు తెరిచే సమయానికి వారికి పాఠశాలల్లో బాధ్యతలు అప్పగించేలా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. కొత్త టీచర్లు వస్తే ప్రధానంగా ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయ సూళ్ల ఇబ్బందులు పరిష్కారం అవుతాయి. రాష్ట్రంలో దాదాపు 12వేల పాఠశాలలు ఒకే టీచర్‌తో నడుస్తున్నాయి. ఉపాధ్యాయుల భర్తీ పూర్తయితే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీరనుంది. కొత్తగా టెట్ రాసేవారికి అవకాశం కల్పించాలని అభ్యర్థులు కోరడంతో డీఎస్సీ నిర్వహణ మూడు నెలలు వాయిదా వేసింది. ఇటీవల టెట్ ముగియడంతో ఇప్పుడు డీఎస్సీకి సిద్ధమైంది. ఇటీవల ముగిసిన ఉపాధ్యాయ అర్హత పరీక్షల(టెట్) తుది కీ విడుదల చేసారు. దీనిని పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రాథమిక ‘కీ’పై అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుది ‘కీ’ విడుదల చేసినట్లు అధికారులు వెల్లడిరచారు. కాగా, నవంబరు 2న టెట్ ఫలితాలు విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 3,68,661 మంది టెట్ రాశారు. అర్హత పొందినవారికి డీఎస్సీలో దరఖాస్తు చేసుకునే అవకాశం దక్కనుంది.

# ఉక్కుమనిషి ‘సర్దార్’

సర్దార్ వల్లభభాయ్ పటేల్ పేరు వినగానే– దేశ స్వాతంత్ర్యం అనం తరం స్వదేశీ సంస్థానాల విలీనం అంశం ఎవరికైనా గురుకొస్తుంది. 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ నిజాం పైకి భారత సైన్యంతో దాడి చేయించి, రజాకార్లను పారద్రోలి, ఆ సంస్థానాన్ని ఇండియన్ యూనియ లో విలీనం చేసిన పటేల్ ఘనత అందరికీ స్ఫురణకు వస్తుంది. నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కలిగించి, మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ ను లొంగ దీసుకున్న మహా సాహసి మన ‘సర్దార్’. ‘ఉక్కుమనిషి’గా దేశ ప్రజ లంతా కీర్తించిన ఆయనను సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. 1875 అక్టోబర్ 31న గుజరాత్ లోని నడియాలో పటేల్ జవేరి భాయ్, లాడ్ దంపతులకు నాలుగవ సంతానంగా జన్మించారు. భారతదేశంలో కలిసేందుకు విముఖంగా ఉన్న, విభేదిస్తున్న పలు రాష్ట్రాలను జాతీయవాది అయిన పటేల్ ఒప్పించి, ఏకం చేసి భారతదేశంలో ఐక్యం చేసిన నేపథ్యంలో ఆయన్ను భారత దేశ ఉక్కు మనిషి (ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా) అని కూడా పిలుస్తుంటారు. ఇంట్లో అన్నలు తనపై అధికారం చెలాయించిన క్రమంలో ఆయన తరుచూ ఎదురు తిరిగేవారు. ఆ మనస్తత్వ ప్రభావమే పెద్దయ్యాక ఆయనలో స్పష్టంగా కనిపించింది. బాల్యంలో ఆకతాయిగా తిరుగుతూ చదువుపై అంతగా ధ్యాస పెట్టని పటేల్ ఏళ్ల వయసులో మాత్రం ఆంగ్లభాషపై మమకారం పెంచుకున్నారు. నాలు గేళ్లు కష్టించి మెట్రిక్యులేషన్ పూర్తి చేశాక, జిల్లా ప్లీడర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి న్యాయవాద వృత్తిని చేపట్టారు. లండన్ వెళ్లి ‘బారిస్టర్’ చదవనిదే తనకు గౌరవం దక్కదని భావించి, మూడేళ్ళు శ్రమించి తగిన ధనాన్ని సంపా దించారు. సోదరుడు విఠల్ భాయ్ పటేల్ కోరికపై తాను సంపాదించిన డబ్బుతో అతడిని బారిస్టర్ చదివించారు. అన్న తిరిగి వచ్చాక, మళ్లీ సంపాదించిన డబ్బుతో లండన్ వెళ్లి బారిస్టర్ పూర్తి చేశారు. తాను చదివిన విద్యా సంస్థలో ఉత్తమ విద్యార్థిగా 57 పౌనుల బహుమానాన్ని పొందారు. స్వదేశం వచ్చాక సూటు, బూటు, హ్యాటు ధరించి అహమ్మదాబాద్ లో గొప్ప క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచారు. లో ఒకరోజు స్నేహితులతో కలిసి క్లబ్లో పేకాడుతున్న సమయంలో గాంధీజీ అక్కడికి వచ్చి, జాతీయ పాఠశాలను నెలకొల్పేందుకు సహకరించాలని కోరారు. అపుడు గాంధీజీ వైపు పటేల్ కన్నెత్తైనా చూడలేదు. అయితే, అదే ఏడాది గాంధీజీ అధ్యక్షత వహించిన గుజరాత్ కాంగ్రెస్ సభకు పటేల్ కార్యదర్శిత్వం వహించాల్సి వచ్చింది. అపుడు మహాత్ముని ప్రభావంతో పటేల్ జీవితం దేశానికి అంకితమైంది. 1918లో కైరా జిల్లాలో కరవు కారణంగా పన్ను మినహాయింపు ఇవ్వాలని రైతులు చేసిన విజ్ఞప్తిని బ్రిటిష్ ప్రభుత్వం పట్టించు కోలేదు. కైరా సత్యాగ్రహాన్ని పటేల్ విజయ వంతంగా పూర్తి చేయగా, తనకు సరైన అనుచరుడు, కార్యదీక్షా పరుడు లభించాడని గాంధీ ప్రశంసించారు. ఆ తర్వాత అహమ్మదాబాద్ మున్సిపల్ చైర్మన్ గా 1928లో బార్డోలీ సత్యాగ్రహ సారథిగా, 1931లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా, 1932లో క్విట్ ఇండియా ఉద్యమంలో పటేల్ చురుకైన పాత్ర నిర్వహించారు. దేశ విభజన సమయంలో, భారత రాజ్యాంగ నిర్మాణంలో సంస్థానాల విలీనంలో పటేల్ నాయకత్వ పటిమ ఉపయోగ.పడిరది. గాంధీజీ సహచరుడిగా, జైలులో ఆయనకు సంరక్షకునిగా



వ్యవహరించిన పటేల్ వాస్తవ దృక్పథంతో ఆలో చిస్తూ, అరుదైన వ్యక్తిత్వంతో దేశానికి సేవలం దించారు. ఒకసారి కోర్టులో వాదిస్తున్న సమయంలో ఆయనకు టెలిగ్రాం రాగా, దానిని చదువుకుని కొద్దిసేపు కళ్లు మూసుకొని, ఏమీ కానట్లు తన వాదనను కొనసాగిం చారు. ఆ తర్వాత అందరికీ తెలిసింది ...ఆయన భార్య మరణించినట్లు టెలిగ్రాంలో వర్తమానం ఉందని. దేశ విభజన వేళ– ‘కుళ్లిన అవ యవాన్ని ఖండిరచి, మిగిలిన శరీరాన్ని కాపాడడమే మన కర్తవ్యం. దేశ విభజ నకు ఒప్పుకోకుంటే స్వాతంత్ర్యం వచ్చే అవకాశమే ఉండదు. మొత్తాన్ని కోల్పోవడం కంటే కొంత వదులుకోవడానికే నేను ఇష్టపడతాను’ అని ఆయన చెప్పేవారు. బార్డోలి సత్యాగ్రహం సందర్భంగా... ‘తక్కువ మాట్లాడండి, ఎక్కువ సాధించండి, విప్లవం.. అని కేకలు వేయకండి, అలా కేకలు వేసే నాయకులకు కొదవ లేదు. క్రమశిక్షణాశీలురైన అనుచరులు లేనిదే పోరాటం విజయవంతం కాదు. మంచి సైనికులుగా తయారుకండి’ అని పటేల్ పిలుపు నిచ్చారు. సంస్థానాల విలీనంలో నెహ్రూ శాంతి కాముకతను కాదని, సైనిక చర్యలు చేపట్టి సర్దార్ విజయం సాధించారు. పాకిస్తాన్ కు 55 కోట్ల రూపాయలు ఇవ్వరాదని నెహ్రూతో వాదించారు. తొలి రాష్ట్రపతి ఎన్నికలలో నెహ్రూ రాజగోపాలా చారిని సమర్థించగా, పటేల్ రాజేంద్ర ప్రసాద్ ను ప్రతిపాదించి సఫలీకృతులైనారు. భారత రాజ్యాంగం డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షునిగా అంబేద్కర్‌ను నియమించడంలో పటేల్ కీలక పాత్ర పోషించారు. 1950లో కాంగ్రెస్ అధ్యక్షునిగా నెహ్రూ కృపలానీని సమర్థించగా, పటేల్ పురుషోత్తమ్ దాస్ టాండన్ ను గెలిపించారు. కేంద్ర హోం మంత్రిగా, ఉప ప్రధానిగా 1947 నుండి 1950 డిసెంబర్ 15న మరణించే వరకు పదవిలో ఉన్నారు. పటేల్ సేవలకు గుర్తింపుగా 1991లో ‘భారతరత్న’ పురస్కారం ప్రకటించింది. అఖండ భారతావని సమగ్రతకు సమైక్యతకు చిత్త శుద్ధితో కృషి సల్పిన సర్దార్ పటేల్ ఖ్యాతిని అంతర్జాతీయంగా చిరస్థాయిగా నిలపాలని నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భారీ పటేల్ విగ్రహం ఏర్పాటుకు సంకల్పించి శ్రీకారంచుట్టారు. విగ్రహాన్ని గుజరాత్‌లో నర్మదానది మధ్యలో సర్దార్ సరోవర్ డ్యాంకు మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మించేందుకు నిర్ణయించి నరేంద్రమోడీ శంకుస్థాపన చేశారు. ఈ విగ్రహం నిర్మాణం అక్టోబర్ 2014లో ప్రారంభించి అక్టోబర్ 2018 లో అంటే 4 సంవత్సరాల కాలంలోనే పూర్తి చేశారు.





# క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసానిస్తాయి

## వనపర్తి నారాయణ స్కూల్‌లో ఘనంగా ఆటపోటీల నిర్వహణ : పాఠశాల ప్రిన్సిపల్ రామ్మూర్తి



**వారధి న్యూస్, వనపర్తి:** క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసానిస్తాయని, మరియు వారి ఎదుగుదలకు తోడ్పడతాయని నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ రామ్మూర్తి తెలిపారు. వనపర్తి నారాయణ స్కూల్ బ్రాంచ్ లో బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న జరగనున్న కార్యక్రమానికి ముందు బుధవారం నాడు విద్యార్థులకు ప్రత్యేక ఆటపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి, వివిధ రంగాలలో తమ నైపుణ్యాలను పెంపొందించుకున్నారు. క్రీడలు విద్యార్థుల మానసిక స్థితిని మరింత ఉల్లాసంగా, ఉత్తేజకరంగా తీర్చిదిద్దుతాయని ప్రిన్సిపల్ రామ్మూర్తి అభిప్రాయపడ్డారు. పోటీల్లో విజేతలకు బాలల దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల జిఎం, డిజిఎం, ఎజిఎం, కోఆర్డినేటర్, పిఈటీ, ఎడి, వీపీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.



# కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి



**వారధి న్యూస్ మహబూబ్ నగర్ :** శ్రీ కురుమూర్తి స్వామి జాతర మైదానంలో అధికారులతో సమావేశమై శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల నాటికి అధికారులకు అప్పజెప్పిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయేంద్ర బోయి హెచ్చరించారు బ్రహ్మోత్స వాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఆసౌకర్యాలు కల్పించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను వివిధ గ్రామాల నుండి వచ్చే రహదారుల పనులను ఎంతవరకు పూర్తి చేశారని అధికారులను అడిగితెలుసుకున్నారు ఉద్దాల మండపం దగ్గర బారికేడ్లు ఏర్పాటు చేయాలని అలాగే కోనేటి దగ్గర కూడా ఏర్పాటు చేయాలని 6 తారీకు అలంకార ఉత్సవం రోజు భక్తులు అధిక సంఖ్యలో 8వ తారీకు ఉద్దాల ఉత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పోలీసు బందోబస్తు నిర్వహించాలని సూచించారు అలాగే జాతర ప్రాంగణంలో మంచినీటి కొరత లేకుండా చూడాలన్నారు మరుగుదొడ్లు తొందరగా పూర్తి చేసి జాతరకు వచ్చే భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు అన్నదాన సత్రాన్ని సందర్భంగా పరిశీలించి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు ఈ కార్యక్రమంలో ఈవో మధుమేశ్వర్ రెడ్డి చైర్మన్ గోవర్ధన్ రెడ్డి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

# బెటాలియన్ ఉద్యోగుల కష్టాలు అర్థం చేసుకోవాలి!



తెలంగాణ పోలీస్ బెటాలియన్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు రోడ్ల మీదికి వచ్చి నిరసన తెలియజేయడం దేశంలో పెద్ద చర్చనీయాంశం అయింది. సాధారణంగా యూనిఫామ్ ధరించిన ఉద్యోగులు బహిరంగంగా నిరసన తెలియజేయకూడదు. కానీ వారు చేశారు.. దీంతో 8వ బెటాలియన్ ఉద్యోగులు నిరసన తెలియజేయడానికి కారణమైన 29 మంది ఉద్యోగులను సస్పెండ్ చేయడం, పదిమందిని సర్వీసు నుండి రిమూవ్ చేయడంతో బెటాలియన్ ఉద్యోగుల్లో, వారి కుటుంబ సభ్యుల్లో, ఆందోళన, అసంతృప్తి, ఆగ్రహం తారాస్థాయికి చేరడంతో కుటుంబ సభ్యులు రోడ్ల మీదకు వచ్చి రోడ్లను దిగ్బంధం చేశారు. శాంతి భద్రతలు అదుపు తప్పితే-అదుపులో పెట్ట వలసిన పోలీసులకు స్పెషల్ పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యుల నిరసనలు, రోడ్లను జామ్ చేయడం వంటి చర్యలు తలనొప్పిగా మారాయి. అయితే స్పెష ల్ పోలీసు వారి భార్యలకు, లోకల్ పోలీస్ అధికారులకు మధ్య జరిగిన సంభాషణను సోషల్ మీడి యా గోరంతలు కొండంతలుగా చేసి తాత్కాలిక ఆనందం పొందాలని ప్రయత్నం చేయడం క్షంతవ్యం కాదు. ప్రతీ మనిషి కష్టాలకు బాధపడతాడు. సుఖాలకు సంతోషిస్తాడు. ప్రభుత్వ ఉద్యోగాలు చేసే వారి విషయంలో ఇదే సూత్రం వర్తిస్తుంది. కొన్ని ఉద్యోగాలు చేయడం కష్టంగా ఉంటుంది. మరికొన్ని ఉద్యోగాలు చేయడం సులభంగా ఉంటుంది. కొన్ని ఉద్యోగాలకు ఒత్తిడి ఉంటుంది. కొన్ని ఉద్యోగాలకు పనే ఉండదు. సరిహద్దుల్లో దేశ రక్షణ బాధ్యతలు చూసే ఉద్యోగుల కష్టాలతో మిగతా ఉద్యోగుల కష్టాలను పోల్చడానికి వీలు ఉండదు. దేశం వారికి జీతాలు, పెన్షన్ ఇతర సౌకర్యాలు ఇస్తుంది కదా అని ఒక వాక్యంతో సరిపెడితే అది విజ్ఞత అనిపించుకోదు. దేశ రక్షణ, శాంతి భద్రతల రంగాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రత్యేక సర్వీస్ రూల్స్ ఉంటాయి. ఆ సర్వీసు రూల్స్‌ను అతిక్రమించే ఏ ఉద్యోగి అయినా శిక్షకు అర్హుడే!

అయితే ఈ మొత్తం ఉదంతాన్ని పరిశీలిస్తే, డ్యూటీల విషయంలో స్పెషల్ పోలీసుల కష్టాలను మానవతా దృష్టితో పోలీసు ఉన్నతాధికారులు అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు. చాలా రోజులు కుటుంబా న్ని వదిలి, బయట ఉండడం, బయట రాష్ట్రాలకు డ్యూటీ నిమిత్తం పంపినప్పుడు కనీస వసతులు కల్పించకపోవడం, ఆరోగ్య సంబంధమైన విషయాలతో బాధపడుతున్న వారిని సరైన రీతిలో ఉన్నతాధికారులు ట్రీట్ చేయకపోవడం, తమ పిల్లల చదువులకు బెటాలియన్‌లో సరైన విద్యా సౌకర్యాలు లేకపోవడం ఇత్యాది విషయాలన్నీ బెటాలియన్ ఉద్యోగులలో అసంతృప్తికి కారణమయ్యాయని చెప్పాలి. ఏ ఉద్యోగి అయినా తన కష్టాన్ని ఇతర ఉద్యోగుల కష్టాలతో పోల్చుకుని, తాను ప్రయోజనం, సౌకర్యాలను పొందాలని కోరుకుంటాడు. ఇది ప్రకృతి సూత్రం. దీన్ని ఎవరూ తృణీకరించలేరు. ఉన్నత అధికారులు అనేక సౌకర్యాలతో, సుఖమైన జీవితంతో సాటి ఉద్యోగులతో సేవలు చేయించుకుంటూ, దర్జాగా జీవితాన్ని గడుపుతూ ఉంటే... సదరు అధికారులపై కింది ఉద్యోగులకు అసంతృప్తి, ఆగ్రహం పెలుబుకుతాయి. 'యద్య దాచరది శ్రేష్టః' అని గీతాచార్యుడు చెప్పిన భగవద్గీత శ్లోకాన్ని అర్థం చేసుకుంటే ఉన్నత అధికారుల నిజాయితీ, విధ్యుక్త ధర్మం పట్ల నిష్ఠ, కింది ఉద్యోగుల పట్ల సమరసతా భావన వంటి విషయాలు కింది స్థాయి ఉద్యోగుల మానసిక స్థితిపై ప్రభావాన్ని చూపిస్తాయి.

చాలామంది ఉన్నత ఉద్యోగులలో బ్రిటిష్ అధికారుల ఆలోచనా భావనల పరంపర వాసనలు ఇంకా తొలగిపోలేదు. ఈ భావనల స్వరూపమే స్పెషల్ పోలీసు కుటుంబ సభ్యులను రోడ్ల మీదికి తెచ్చిందని చెబితే అతిశయోక్తి కాదేమో! ఒకప్పుడు స్పెషల్ పోలీసు ఉద్యోగాలకు ఎనిమిదవ తరగతి, పదవ తరగతి పాసైన వాళ్లు మాత్రమే ఎన్నికయ్యేవారు. వారికి చదువు తక్కువ కాబట్టి పై అధికారులు ఏ పనులు చెప్పినా బుద్ధిగా, బాధ్యతాయుతంగా చేసేవారు. ప్రస్తుతం పోలీసు ఉద్యోగాలకు వచ్చేవారు బాగా చదువుకున్నవారు. తమ వ్యక్తిత్వాలను కాపాడుకోవాలని ప్రస్తుతం స్పెషల్ పోలీస్ ఉద్యోగుల ఆలోచన తీరు ఉంది. దీనిని ఉన్నత అధికారులు దృష్టిలో ఉంచుకొని ఇటువంటి సమస్యలు భవిష్యత్తులో తలెత్తకుండా, పోలీసు వ్యవస్థపై సామాన్య ప్రజలకు నమ్మకం పోకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. స్పెషల్ పోలీసు ఉద్యోగుల కష్టాలను ప్రభుత్వం సానుకూల దృష్టితో ఆలోచించి, వారి కోరికలను తగిన రీతిలో నెరవేర్చవలసిన బాధ్యత కూడా ఉంది. ఇదే సందర్భంలో మాతో డ్యూటీకి సంబంధం లేని పనులను గ్రౌండ్‌లో చేయిస్తున్నారని కొందరు ఉద్యోగులు వీడియోలు తీసి పంపడం కూడా తప్పు. వీరు పొలాల్లో పని చేసే రైతులు, రైతు కూలీలు, బేల్దారి పనులు చేసే కార్మికుల కష్టాలను బేరీజు వేసుకుని ఆచితూచి మాట్లాడవలసి ఉంటుంది. వాస్తవంగా ఎంతో పెద్ద చదువులు చదువుకొని, ఉద్యోగం రాక దేశంలో యువత అనేక బాధలను ఎదుర్కొంటున్నారు. వీరి జీవితాలతో ఉద్యోగా లు పొందిన వారు అనుభవిస్తున్న సౌకర్యాలను కంపేర్ చేసుకోవాలి. ఇదే సందర్భంలో సమసమాజ నిర్మాణానికి మావోయిస్టు ఉద్యమాన్ని నడుపుతూ, ప్రాణాలను తృణప్రాయంగా సమాజానికి సమర్పిస్తున్న వ్యక్తులను, దేశసేవకే తమ జీవితాలు అనుకుంటూ, జీవితాంతం బ్రహ్మచారులుగా కొనసాగే ఆర్ఎస్ఎస్ ప్రచారకులను దృష్టిలో ఉంచుకొని స్పెషల్ పోలీసులు తమ విధ్యుక్త ధర్మం విషయంలో నిబద్ధతతో ఉంటే, ప్రభుత్వాలను నడిపే రాజకీయ నాయకులు దిగి వస్తారు.

# అయోధ్యలో అట్టహాసంగా దీపోత్సవం



## నేటి నుంచి ఉచిత గ్యాస్ పథకం అమలు

**అమరావతి,అక్టోబర్ 30 :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇప్పటికీ కొందరికీ ఫ్రీ గ్యాస్ ఎలా తీసుకోవాలనే సందేహం కలుగుతుంది. ఏయే పత్రాలు ఇవ్వాలి..? అని అడుగుతున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ధరఖాస్తు దారుని వద్ద ఎల్పీజీ కనెక్షన్, ఆధార్ కార్డ్, తెల్ల రేషన్ కార్డు ఉండాలి. ఎప్పటిలాగే మొబైల్ నంబర్ ద్వారా గ్యాస్ బుకింగ్ చేయాల్సి ఉంటుంది. గ్యాస్ బుక్ చేసిన తర్వాత 24 గంటల్లో గ్రామాల్లో.. రెండు రోజుల్లో సిలిండర్ డెలివరీ అవుతుంది. ఒకవేళ సిలిండర్ డెలివరీ సమయంలో గ్యాస్ డెలివరీ ఏజెంట్ డబ్బులు తీసుకుంటే రెండురోజుల్లో లబ్దిదారుల ఖాతాల్లో రూ.851 జమ అవుతుంది. గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకొని డీలర్ వద్దకెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఈ కేవైసీ చేసిన తర్వాత రెండు, మూడు రోజుల్లో అప్ డేట్ అవుతుంది. ఆ లోపు సిలిండర్ వస్తే డబ్బులు చెల్లించాలి. కేవైసీ పూర్తయిన తర్వాత.. సిలిండర్‌కు లబ్దిదారుడు ఇచ్చిన నగదు వారి ఖాతాలో జమ అవుతుంది. ఫ్రీ గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి సమస్య ఉంటే 1967 నంబర్‌కు కాల్ చేయాలని అధికారులు సూచించారు. ఫస్ట్ సిలిండర్ మార్చి 31వ తేదీ లోపు బుక్ చేసుకోవాలి.




## ప్రాణాంతక మయోనైజ్‌పై నిషేధం

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబర్ 30 :** ప్రాణాలను హరిస్తున్న మయోనైజ్‌పై నిషేధం విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆహార ప్రియులు ఎంతో ఇష్టంగా తినే మయోనైజ్ ప్రాణాంతకంగా మారడంతో దీనిపై నిషేధం విధించాలని నిర్ణయించింది. కల్తీ ఆహారం తీసుకొని పలువురు తీవ్ర అనారోగ్యం పాలవుతోన్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో సమీక్ష అనంతరం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో హోటళ్లు, ఫుడ్‌స్టాళ్లలో తరచూ తనిఖీలు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. రాష్ట్రంలో కొత్తగా 3 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 5 మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. మయోనైజ్‌ను ఎక్కువగా.. మండి బిర్యానీ, కబాబ్‌లు, పిజ్జాలు, బర్గర్లు, శాండ్‌విచ్‌లు, ఇతరత్రా ఆహార పదార్థాల్లో చెట్నీలా వేసుకుని తింటారు. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలతో బల్దియా ఆహార కల్తీ నియంత్రణ విభాగం అప్రమత్తమైంది. ఎన్నిసార్లు చెప్పినా హోటళ్లు తీరు మార్చుకోవట్లేదంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ పదార్థాన్ని నిషేధించేందుకు అనుమతి కోరింది. బంజారాహిల్స్‌లోని నందినగర్, సింగాడకుంట బస్తీ, గౌరిశంకర్‌కాలనీలలో గత శుక్రవారం సంత జరిగింది. అక్కడ ఏర్పాటు చేసిన 'దిల్లీ హాట్ మోమోస్' దుకాణంలో విక్రయించిన మాంసాహార మోమోస్, వాటితోపాటు ఇచ్చిన మయోనైజ్, చట్నీని బస్తీకి చెందిన రేష్మబేగం, ఆమె పిల్లలు రుమ్షా, రఫియా తిన్నారు. అదేరోజు రాత్రి ముగ్గురికీ వాంతులు, విరేచనాలు అయ్యాయి. పిల్లలిద్దరినీ ఆసుపత్రిలో చేర్చగా తల్లి ఇంట్లోనే ఉంది. ఆదివారం రేష్మబేగం (31) పరిస్థితి విషమించడంతో నిమ్స్‌కు తరలిస్తుండగా మధ్యలోనే మరణించింది. అల్వాల్‌లోని గ్రిల్ హౌజ్ హోటల్‌లో నాసిరకం మయోనైజ్‌ను తిన్న కొందరు యువకులు ఇటీవల ఆసుపత్రిపాలయ్యారు. వారం కిందట ఐదుగురు వాంతులు, విరేచనాలతో స్థానిక ఆసుపత్రిలో చేరడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది జనవరి 10న కూడా ఇలాంటి ఘటనే జరిగింది. అదే హోటల్‌లో షవర్మ తిన్న 20 మందికిపైగా యువకులు 3, 4 రోజులయ్యాక ఆసుపత్రుల్లో చేరాల్సి వచ్చింది. కొంతమందికి రక్త పరీక్షలు చేయగా.. హానికర సాల్మనెల్లా బాక్టీరియా ఉన్నట్లు వైద్యులు తేల్చారు. ఆ హోటల్‌లోని షవర్మ బాగోలేదని బల్దియాకు ఫిర్యాదులు అందాయి.

## ప్రజలకు కేసీఆర్ దీపావళి శుభాకాంక్షలు



**హైదరాబాద్,అక్టోబర్ 30 :** రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దీపావళి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనలోని మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞాన దీపాలను వెలిగించుకోవాలనే తాత్వికతను దీపావళి పండుగ మనకు అందిస్తుందని కేసీఆర్ పేర్కొన్నారు. దీపావళి పర్వదినానికి హిందూ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. మనం పయనించే ప్రగతిపథంలో అడుగడుగునా అడ్డుపడే నరకాసురుల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని సీఎం కేసీఆర్‌ప్రజలకు ఉద్బోధించారు. లక్ష్మీదేవి కృపాకటాక్షాలు తెలంగాణ ప్రజలపై ఉండాలని, ప్రతి ఇల్లు సకల శుభాలు, సిరిసంపదలతో విరాజిల్లాలని ఆకాంక్షించారు.

- 25లక్షల దీపాల వెలగింపుతో గిన్నిస్ రికార్డు
- అయోధ్య రామాలయ ప్రతిష్ట తరవాత తొలి ఉత్సవం
- దీపహారతితో ధగధగలాడిన సరయూ తీరం
- దోపోత్సవాన్ని ప్రారంభించిన సిఎం యోగి



**అయోధ్య, అక్టోబర్ 30 :** రామప్రతిష్ట తరవాత వచ్చిన దీపావళి వెలుగులతో అయోధ్య ధగధగలాడింది. సరయూ తీరం పులకించింది. భక్తజనం పరశించింది. దీపోత్సవంతో అయోధ్య వెలుగులు విరజిమ్మింది. దీపావళి సందర్భంగా అయోధ్యలోని సరయూ నది తీరాన దీపోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. లక్షల ప్రమిదలతో సరయూ తీరం దేదీప్యమానంగా వెలిగిపోయింది. రామమందిరం ప్రారంభమైన తర్వాత తొలిసారి వేడుకలు కావడంతో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. గిన్నిస్ రికార్డుల్లోకెక్కేలా ఉత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఇందుకు సంబంధించి 55 ఘాట్‌లలో ఏర్పాటు చేసిన ప్రమిదలను ప్రత్యేక డ్రోన్లతో గిన్నిస్ ప్రతినిధులు లెక్కించారు. 25 లక్షల దీపాలను వెలిగించాలని లక్ష్యంగా పెట్టుకున్న నిర్వాహకులు.. దాదాపు 28 లక్షల ప్రమిదలను ముందస్తుగానే ఆర్డర్ చేశారు. రామమందిరంతోపాటు పరిసర ప్రాంతాలను దీపాలతో అలంకరించారు. దీపోత్సవ కార్యక్రమంలో 30వేల మంది వాలంటీర్లు పాల్గొన్నారు. ఓ ఘాట్ వద్ద 80వేల దీపాలతో స్వస్తిక్ ఆకారంలో దీపాలను వెలిగించారు. పశుసంవర్ధకశాఖ



ఆధ్వర్యంలో ఆవు నెయ్యితో లక్షన్నర దీపాలను వెలిగించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేక పూజలు చేసి.. హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. మయన్మార్, నేపాల్, థాయిలాండ్, మలేసియా, కంబోడియా, ఇండోనేసియాకు చెందిన కళాకారులతో వేదిక వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఘాట్‌ల వద్ద దాదాపు 5 నుంచి 6వేల మంది అతిథుల కోసం ఏర్పాట్లు చేశారు. లైవ్ కవరేజీ కోసం పెద్ద తెరలు ఏర్పాటు చేశారు. నగరం మొత్తం దాదాపు 10వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. మొత్తంగా బాలరాముడు కొలువైన అయోధ్యలో దీపావళి సంబరాలు కన్నులపండువగా మొదలయ్యాయి. సరయూ నదీ తీరంలో ఎనిమిదేళ్లుగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'దీపోత్సవం' ఈసారి మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. అయోధ్యలో భవ్య రామాలయం నిర్మాణం జరిగిన తర్వాత జరిగిన తొలి దీపోత్సవం ఇదే కావడంతో అయోధ్య నగరం దీపకాంతులతో మెరిసిపోయింది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 'దీపోత్సవ్'ను ప్రారంభించగా, భక్తులు ఏకకాలంలో 25 లక్షలకుపైగా దీపాలు వెలిగించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. సరయూ నది ఘాట్‌లో 1,100 మంది హారతులు ఇవ్వడం ద్వారా మరో సరికొత్త రికార్డు కూడా సిద్ధమైంది. అయోధ్య పురవీధుల్లో లక్షలాది జనవాహిన మధ్య రామలక్షణ వేషధారులు రథంపై ఊరేగగా, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వయంగా రథం లాగి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. లేజర్ షోలు, డ్రోన్ షోలు, రామాయణ ఘట్టాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అయోధ్య మారుమోగింది. రామాలయ నిర్మాణం తర్వాత జరిగిన తొలి దీపోత్సవ్‌ను యోగి ఆదిత్యనాథ్ ప్రారంభిస్తూ, ఈనాటి దీపోత్సవ్ మనందరికీ గర్వకారణమని అన్నారు. ఇది మనమంతా జరుపుకుంటున్న 8వ దీపోత్సవమని చెప్పారు. ఎనిమిదేళ్ల క్రితం తొలి దీపోత్సవ్ జరుపుతున్నప్పుడు... యోగీజీ రామమందిరం నిర్మించడని ప్రతి ఒక్కరూ అడిగేవారని, రాముడు త్వరలోనే మనందరికీ ఆశీర్వదిస్తాడని ఆరోజు చెప్పడం జరిగిందని గుర్తుచేశారు. రామాలయ నిర్మాణం కలసాకారమైనందుకు ప్రధాని మోదీకి మనమంతా కృతజ్ఞతలు చెప్పుకోవాలని అన్నారు. యావద్దేశం కోవిడ్ మహమ్మారితో పోరాడుతున్న సమయంలో ప్రధాని అయోధ్యకు వచ్చిన రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు. ఈరోజు అయోధ్య వెలిగిపోతోందని, ఇవాళ వెలుగుతున్నవి కేవలం దివ్వెలు కావని, సనాతన ధర్మ విశ్వాసని చెప్పారు. ఈరోజు మన కాశీ వెలిగిపోతోంది. భవ్య కాశీని ఈరోజు యావత్ ప్రపంచం చూస్తోందని గర్వంగా చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్‌తో కలిసి టూరిజం యాప్‌ను, అయోధ్య మేయర్ రాసిన ఒక పుస్తకాన్ని యోగి ఆదిత్యనాథ్ విడుదల చేశారు.

## దగ్గర పడుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు

- పోటాపోటీగా ప్రచారం చేస్తున్న ట్రంప్, కమలా
- ప్రవాసభారతీయుల ఓట్లపై ఇరు నేతల గురి



**న్యూయార్క్, అక్టోబర్ 30 :** అమెరికా ఎన్నికలకు మరి కొన్నిరోజుల సమయమేఉండడంతో పోటాపోటీ ప్రచారం సాగుతోంది. అటు డొనాల్డ్ ట్రంప్ , ఇటు కమలా హ్యారిస్ ఇద్దరూ పోటాపోటీగా ప్రవాస భారతీయుల్ని ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ప్రవాస భారతీయుల ఓటు ఎటు అన్న చర్చ వస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు అంటే ప్రపంచం మొత్తానికి ఆసక్తి ఉంటుంది. ప్రపంచంలోని అన్ని దేశాల నుంచి వెళ్లిన జనం అమెరికాలో జీవిస్తూ ఉంటారు. అందుకే అక్కడి ఎన్నికలపై ఎంతో ఉత్సుకత ఉంటుంది. అది రాను రాను పెరుగుతుంది. ఎందుకంటే అక్కడ స్థిరపడిన విదేశీయులు ఓటర్లుగా మారడమే కాదు.. ఇప్పుడు ఆ దేశాన్ని పరిపాలింటే వారిలో భాగం అవుతున్ననారు. ఈ విషయంలో భారతీయులు చాలా ముందు ఉన్నారు. ఒకటి, రెండు తరాలకిందట వెళ్లిన వారు అమెరికా పౌరులుగా మారి నేరుగా పరిపాలన చేయడానికే పోటీ పడుతున్నారు. కమలాహ్యారిస్ అధ్యక్ష పదవికి అభ్యర్థిగా పోటీ చేస్తూండటం భారతీయ మూలాలున్నవారిని మరింత ఉద్వేగానికి గురి చేస్తోంది. అధ్యక్ష పదవికి పోటీ చేసేలా ఓ భారత మూలాలున్న నేత ఎదిగారంటే ఇక కింది స్థాయిలో వారు ఎంత ప్రభావిత స్థాయిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. కమలాహారిస్ భారతీయ మూలాలు ఉన్న మహిళ కావడంతో ఆమెవైపు దక్షిణ భారతానికి చెందిన వారు ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాలో భారతీయులు ఎక్కువగా ఉండే



డాలస్ వంటి ప్రాంతాల్లో తెలుగులో కూడా ప్రచార పోస్టర్లు వెలిశాయి. ప్రధాన పార్టీలు ఎన్నారైలను ఆకట్టుకునేందుకు ఇలా చేశాయి. ఇటీవల మెక్ డొనాల్డ్స్ లో పని చేసి ప్రచారం చేసిన ట్రంప్ ఓ భారతీయ అమెరికన్‌కు ఫ్రెంచ్ ఫ్రైస్ అమ్మిన వీడియోను విస్తృతంగా ప్రచారం అయ్యేలా చేసుకున్నారు. భారత మూలాలున్న ఓటర్లు ఇప్పుడు అమెరికా లో కీలకంగా మారారు. అమెరికాలోని భారతీయుల్లో ఎక్కువ మంది డెమొక్రటిక్ పార్టీ, దాని అనుబంధ సంస్థలలో పని చేస్తున్నారు. ప్యూ సర్వే ప్రకారం 68 శాతం రిజిస్టర్డ్ భారతీయ అమెరికన్ ఓటర్లు డెమొక్రటిక్ పార్టీతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుబంధం కొనసాగిస్తున్నారు. కేవలం 29శాతం మాత్రమే రిపబ్లికన్ పార్టీకి మద్దతు పలుకుతున్నారు. అందుకే రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఎక్కువగా భారతీయ మూలాలున్న వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడే పుట్టి అక్కడే పెరిగిన వారికి పౌరసత్వం లభిస్తుంది. వారి తల్లిదండ్రులు ఏ దేశానికి చెందిన వారు అయినా అమెరికాలో పుడితే పౌరసత్వం తీసుకోవచ్చు. ఆటోమేటిక్‌గా నిబంధనల ప్రకారం వయసు రాగానే ఓటు హక్కు వస్తుంది. అలాగే గ్రీన్ కార్డు పొందిన వారికి కూడా ఓటు ఉంటుంది. ఇలా వేరేదేశాల్లో పుట్టి అమెరికాలో సెటిల్ అయిన వారికి పౌరసత్వం పొందిన వారికి అధ్యక్ష స్థానానికి పోటీ చేసే అవకాశం ఉండదు. కానీ రాష్ట్రాల్లో గవర్నర్ పోస్టుల వరకూ పోటీ చేయవచ్చు. మంత్రులుగా బాధ్యతలు తీసుకోవచ్చు. భారతీయలు ఈ అవకాశంతో కింది స్థాయి నుంచి ఎన్నికల్లో పోటీ చేసి పైకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ విధానాలు భారతీయుల్ని కొంత వరకు కలవరపాటుకు గురి చేస్తున్నాయి. అయితే గతంలో ఆయన అధ్యక్ష పదవిలో ఉన్నప్పుడు పెద్దగా ఇబ్బందులు ఎదురు కాలేదని ఈ సారి కూడా ఎదురు కావని చెప్పి రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులు ప్రచారం చేస్తున్నారు. ఈ ఇద్దరిలో ఇండియన్స్ ఎవరి వైపు నిలబడతారన్నది ఎన్నికల ఫలితాల్లో తేలుతుంది.



## యూ ట్యూబర్ హర్షసాయికి ఊరట

### ముందస్తు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు

**హైదరాబాద్, అక్టోబర్ 30 :** లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ యూట్యూబర్ హర్ష సాయికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. తనపై పెట్టిన కేసు చెల్లదని హర్ష సాయి హైకోర్టును ఆశ్రయించగా, ఈ కేసుపై విచారించిన న్యాయస్థానం బుధవారం అతడికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.హర్షసాయిపై సెప్టెంబర్ 24న నార్సింగి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పెళ్లి పేరుతో అత్యాచారం చేశాడంటూ హర్షసాయిపై ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నార్సింగి పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. హర్ష, అతడి తండ్రి రాధాకృష్ణ తన వద్ద నుంచి రూ. 2 కోట్లు తీసుకున్నారని ఫిర్యాదులో యువతి పేర్కొంది. హర్షసాయితో పాటు అతని తండ్రి రాధాకృష్ణపై కూడా కేసు నమోదు చేశారు. ఃాధిత యువతి హర్ష సాయి-ఃతో కలిసి ఓ సినిమా కూడా నిర్మించినట్లు సమాచారం. ఆమెకు సొంత ప్రొడక్షన్ కూడా ఉంది. శ్రీ పిక్చర్స్ బ్యానర్‌లో హర్షసాయి హీరోగా మెగా అనే మూవీని ఆమె నిర్మించారట. బాధిత యువతి.. బిగ్ బాస్ ఓటీటీ కంటెస్టెంట్‌గా చేశారు. లైంగిక వేధింపుల కేసు నమోదు అయినప్పటి నుండి హర్ష సాయి ఎక్కడా కనిపించలేదు. తనపై నమోదైన కేసుపై న్యాయపర పోరాటానికి సిద్ధమని ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ షేర్ చేశాడు. హర్ష సాయిను పోలీసులు అదుపులోకి తీసుకునే ముందు నుంచే తన లాయర్ ద్వారా ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాడు. కానీ చాలాసార్లు బెయిల్ రిజెక్ట్ అయ్యింది. బాధితురాలు కొన్నాళ్లకు హర్ష సాయి తండ్రిపైన కూడా కేసు పెట్టింది. ఇద్దరూ బెయిల్ కోసం ఎన్నో ప్రయత్నాలు చేయగా తాజాగా వారికి బెయిల్ మంజూరైంది.

## బాణాసంచా తయారీకేంద్రం వద్ద పిడుగుపాటు ఇద్దరు మహిళలు దుర్మరణం

**కాకినాడ, అక్టోబర్ 30 :** తూర్పుగోదావరి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. బాణాసంచా కేంద్రం వద్ద పిడుగు పడడంతో ఇద్దరు మహిళలు దుర్మరనం చెందారు. ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామ శివారులోని బాణాసంచా తయారీ కేంద్రం వద్ద బుధవారం సాయంత్రం పిడుగుపడి ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో బాణసంచా తయారీ కేంద్రం పూర్తిగా దగ్ధం కాగా, ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఐదుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. పదిమందికి పైగా పాక్షికంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాణసంచా కేంద్రం వద్ద ఉన్న సమీపంలోని పొలాల్లోకి పరుగులు పెట్టి ప్రాణాలు కాపాడుకున్నారు.

వారధి
తెలుగు దిన పత్రిక

# రోజూ పరగడుపునే ఈ ఆకు నమిలి తినండి..



జామ ఆకులను నేరుగా బాగా శుభ్రం చేసి తినాలి. పరగడుపున తీసుకోవడం వల్ల మెరుగైన ఫలితాలు లభిస్తాయి. ఆకులను తినడం వల్ల జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుంది. జామ ఆకుల టీ తాగడం వల్ల డయేరియాను తగ్గించుకోవచ్చు. డయేరియాతో బాధపడేవారు రోజూ ఈ టీ తాగితే ఈ సమస్యను తగ్గించుకోవచ్చు. జామ ఆకుల్లో అనేక విటమిన్లు, ఖనిజాలు, సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలతో పాటు ప్రొటీన్, విటమిన్ సి, గల్లిక్ యాసిడ్ పుష్కలంగా ఉన్నాయి. జామ ఆకులను నీటిలో వేసి మరిగించి ఈ నీటిని ఉదయం ఖాళీ కడుపుతో సేవిస్తే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. జామ ఆకుల టీ తాగడం వలన బీపీ లెవెల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. దాంతో పాటు శరీరంలో మెటబాలిజం రేటు కూడా పెరుగుతుంది. జామ ఆకులు గర్భిణులు, పాలు ఇచ్చే తల్లులు తీసుకోకూడదు. జామ ఆకుల్లో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. జామ ఆకులు తింటే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. జామ ఆకులను నీటిలో వేసి బాగా మరిగించాలి. ఆ తర్వాత ఇందులో నిమ్మకాయ, తేనె వేసి తీసుకోవాలి. జామ ఆకుల టీ తాగితే చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. జామ ఆకుల్లో ముఖంపై ఉండే మచ్చలు పోగొట్టే విటమిన్-సి అధికంగా ఉంటుంది. ఇది చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. ఈ టీ తాగడంతో జుట్టు రాలడాన్ని తగ్గించుకోవచ్చు. జామ ఆకులను నీటిలో మరిగించి ఆ నీటితో జుట్టు కుదుళ్లకు మసాజ్ చేయాలి. దీంతో కుదుళ్లు బలంగా మారుతాయి.

# దంతాలు పచ్చగా ఉన్నాయా?



ఎన్ని పేస్టులు మార్చినా, ఎంత సేపు పండ్లు తోమినా సరే దంతాలు తెల్లగా మారడం లేదా? కానీ ఒక చిన్న పండుతో మీ పచ్చని పళ్లను తెల్లగా మెరిసేలా చేసుకోవచ్చు. కేవలం అరటి తొక్కతో పచ్చని పళ్లను తెల్లగా చేసుకోవచ్చు. అదెలా అనుకుంటున్నారా? అయితే ఇప్పుడు తెలుసుకుందాం. అయితే చాలా మంది అరటిపండును తినేసి దాని తొక్కను పనికిరాదని డస్ట్ బిన్ లో పడేస్తుంటారు కదా. కానీ అరటి తొక్క కూడా చాలా ఉపయోగాలు ఉన్నాయి. అరటి తొక్కలో మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి పళ్లను తెల్లగా చేస్తాయి. ఒక్క అరటితొక్కను మాత్రమే కాదు దానితో బేకింగ్ సోడాను కలిపి పెడితే మరింత మంచి ఫలితాలు ఉంటాయి. పచ్చని పళ్లను తెల్లగా చేయడానికి ముందుగా.. అరటి తొక్కను తీసుకుని దాని లోపలి తెల్లని భాగాన్ని దంతాల మీద బాగా రుద్దాలి. తొక్కను పై నుంచి కిందకి వృత్తాకారంలో రుద్దితే దానిలో ఉండే పోషకాలు దంతాలకు అంటుతాయి. ఆ తర్వాత ఒక చెంచా బేకింగ్ సోడాను తీసుకుని.. దానికి కొద్దిగా నీళ్లు కలిపి పేస్ట్ లా చేసుకోవాలి. ఇప్పుడు అరటి తొక్కతో బేకింగ్ సోడా పేస్ట్ ను కలిపి దంతాలకు రాస్తే సరిపోతుంది. ఆ తర్వాత దంతాలను క్లీన్ చేసుకోవాలి. అరటి తొక్కలో ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. ఇది దంతాల ఉపరితలాన్ని చేరి పసుపు రంగును పోగొట్టడానికి సహాయం చేస్తుంది. అలాగే బేకింగ్ సోడా నేచురల్ స్క్రబ్బర్‌గా పనిచేస్తుంది అంటున్నారు నిపుణులు. పళ్లపై పొరలోని మచ్చలను పోగొట్టడానికి సహాయపడుతుంది. అంతేకాదు బేకింగ్ సోడాలోని ఆల్కలీన్ లక్షణాలు దంతాల పసుపు రంగును తగ్గించడానికి సహాయపడతాయి. ఈ చిట్కాలను ఫాలో అవ్వడం మాత్రమే కాదు దంతాలను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవడం మర్చిపోవద్దు. రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవడం మంచిది. మరీ ముఖ్యంగా టీ, కాఫీ, సిగరెట్లు ఎక్కువగా తాగడం మానేయండి. ఎందుకంటే ఇవి మీ పళ్లను పసుపు రంగులోకి మార్చేస్తుంటాయి. అలాగే దంతాలు తెల్లగా ఉండేందుకు కనీసం 6 నెలలకోసారైనా దంత వైద్యుడి దగ్గరకు వెళ్లడం మర్చిపోవద్దు.

# సిట్జ్ బాత్ అంటే ఏమిటి?



మనలో చాలా మందికి సిట్జ్ బాత్ గురించి పెద్దగా తెలియదు. ఈ సిట్జ్ బాత్‌ను ఎక్కువగా మలద్వారం సమస్యలకు వాడుతారు. కూర్చోవడానికి వీలుగా ఉండే టబ్‌లో హాట్ వాటర్ వేసి కూర్చుంటారు. దీనినే సిట్జ్ బాత్ లేదా హిప్ బాత్ అని అంటారు. ఇలా వేడినీటిలో కూర్చోవడం వల్ల పైల్స్, మలబద్ధకం, ఫెరియానల్ ఫిస్టులాస్, మూత్రాశయం వ్యాధులు, యోని ఇన్ఫెక్షన్లకి ఎక్కువగా ఈ సిట్జ్ బాత్ చేస్తుంటారు. ముఖ్యంగా పైల్స్, ఫిస్టులా ఆపరేషన్ చేయించుకున్న వారు, ఈ సమస్యలతో బాధపడే వారు నొప్పి నుంచి విముక్తి చెందడానికి ఈ సిట్జ్ బాత్ బాగా ఉపయోగపడుతుంది. గోరువెచ్చని నీటిలో కూర్చోవడం వల్ల మలద్వారం దగ్గర ఎలాంటి ఇన్ఫెక్షన్లు ఉన్నా తగ్గుతాయని నిపుణులు చెబుతుంటారు. వేడి నీటికి ఆ భాగంలో నొప్పి, దురద ఏవి ఉన్నా కూడా తగ్గుతాయి. ఆ ప్రదేశం కూడా శుభ్రం అవుతుంది. మలద్వారం, యోని సమస్యలతో బాధపడేవారికి ఈ సిట్జ్ బాత్ బాగా ఉపయోగపడుతుంది. ఈ సిట్జ్ బాత్‌ను హేమోరాయిడ్లు, ఆసన పగుళ్లు, పెరియానల్ ఫిస్టులాస్, మల శస్త్రచికిత్స, ఎపిసియోటమీ, గర్భాశయ తిమ్మిరి, ఇన్‌ఫ్లమేటరీ ప్రేగు వ్యాధి, పైలోనిడల్ తిత్తులు, మూత్రాశయం, ప్రోస్టేట్ లేదా యోని అంటువ్యాధులు, ఇన్ఫెక్షన్ ఉన్నవారు ఎక్కువగా చేస్తారు. ఈ సమస్యల నుంచి దీర్ఘకాలికంగా బాధపడుతుంటే సిట్జ్ బాత్ ఉపశమనం కల్పిస్తుంది. అయితే ఈ సిట్జ్ బాత్‌ను ఎక్కువగా చేయకూడదు. మూత్ర విసర్జనలో తీవ్రంగా నొప్పి ఉంటే రోజుకి ఒక పది నిమిషాలు చేయాలి. తక్కువగా ఉంటే వారానికొకసారి అలా చేయాలి. సిట్జ్ బాత్ చేసిన తర్వాత జననాంగాలను కాటన్ క్లాత్‌తో మొత్తగా తుడవాలి. ఎక్కువ గట్టిగా రుద్దకుండా మెల్లగా చేయాలి. గర్భిణులు అయితే వైద్యుని సూచనల మేరకు మాత్రమే సిట్జ్ బాత్ చేయాలి. జీవనశైలిలో మార్పుల వల్ల ఈ మధ్య కాలంలో చాలా మంది మలబద్ధకంతో ఇబ్బంది పడుతున్నారు. ఇది కాస్త తీవ్రం అయ్యి, పైల్స్‌కి దారి తీస్తుంది. వాటర్ ఎక్కువగా తాగకపోవడం, ఆహారంలో ఫైబర్ లేకపోవడం, మాంసాహారం, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల బాడీ డీహైడ్రేట్‌కి గురై ఈ సమస్య వస్తుంది. దీనిని తగ్గించుకోవడానికి ఎన్ని మందులు వాడిన వ్యర్థమే. ఒక్కసారి వస్తే ఇక జీవితాంతం సమస్య ఉన్నట్లే. కొందరు దీనికి శస్త్ర చికిత్స కూడా చేసుకుంటారు. అయినా కూడా మళ్లీ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలంటే జ్యూస్‌లు ఎక్కువగా తాగడం, ఆహారంలో ఫైబర్ యాడ్ చేయడం, తృణ ధాన్యాలు తీసుకోవడం, వాటర్ ఎక్కువగా తాగడం వంటివి చేయాలి. అప్పుడే సమస్య నుంచి బయటపడతారు. లేకపోతే ఈ సమస్య తీవ్రమై.. కొన్నిసార్లు చనిపోయే ప్రమాదం కూడా ఉంది.

# ఆరోగ్యానికి అమృతంతో సమానం..!



తిప్పతీగలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కణాలను ఆరోగ్యంగా మార్చుతాయి. ఫ్రీ రాడికల్స్‌ను, వ్యాధిని కలిగించే క్రిములను అరికట్టడంలో సహాయపడతాయి. తిప్పతీగ రసం తాగితే రోగనిరోధకశక్తి పెరుగుతుంది. జ్వరం నుంచి ఉపశమనం పొందేందుకు తిప్పతీగ ఆకులు చాలా బాగా పనిచేస్తాయి. తిప్పతీగను వివిధ రూపాల్లో తీసుకుంటే ఇన్ఫెక్షన్ల నుంచి ఉపశమనం లభిస్తుంది. తిప్పతీగ శరీరంలోని టాక్సిన్లను తొలగిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. యూటీఐ సమస్యలను దూరం చేస్తుంది. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడంలో తిప్పతీగ సహాయపడుతుంది. తిప్పతీగతో గ్యాస్, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యల్ని ఇట్టే దూరం చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపున తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. తిప్పతీగలోని యాంటీ ఆక్సిడెంట్లు ఒత్తిడిని తగ్గించి ఇన్సులిన్ స్రావాన్ని పెంచుతాయి. దీంతో డయాబెటిస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. తిప్పతీగలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి శ్వాస వ్యవస్థను ఆరోగ్యంగా మార్చుతాయి. తిప్పతీగను వివిధ రూపాల్లో తీసుకుంటే దగ్గు, జలుబు, ఉబ్బసం నుంచి ఉపశమనం లభిస్తుంది. తిప్పతీగను అడాప్టోజెనిక్ హెర్బ్‌గా ఉపయోగించవచ్చు. తిప్పతీగ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని కంట్రోల్ చేస్తుంది. ఆందోళనను దూరం చేస్తుంది. తిప్పతీగ రసం తాగడంతో రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు కంట్రోల్ అవుతాయి. దీంత గుండె పనితీరు మెరుగుపడుతుంది. గుండె సంబంధిత సమస్యలు దరి చేరవు. ఉరుకుల పరుగుల జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని దూరం చేసేందుకు తిప్పతీగ చాలా బాగా ఉపయోగపడుతుంది. శరీరంలో పేరుకునే విష పదార్థాలను బయటకు తరిమేస్తుంది. 45 ఏళ్లు దాటిన తర్వాత మహిళల్లో ఎముకలు బలహీనంగా మారుతాయి. తిప్పతీగ రసం తాగితే మహిళల్లో బోలు ఎముకల వ్యాధి వచ్చే అవకాశం దాదాపు తొలగుతుంది. తిప్ప తీగను రసం రూపంలో తీసుకోవడంతో పలు ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. రోజూ తీసుకోవడం వల్ల క్రాంప్స్ నొప్పులు తగ్గుతాయి. మానసిక, శారీరక ఆరోగ్యం కోసం తిప్పతీగ రసం మంచి ఎంపిక.

## ఖాళీ కడుపుతో ఈ టీ తాగితే..

# సర్వరోగాలన్నీ మటాష్!



వాతావరణంలో మార్పులు, జీవనశైలిలో మార్పులు వల్ల కొందరు అనారోగ్యం బారిన పడుతుంటారు. ముఖ్యంగా శీతాకాలం అయితే ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న జలుబు, దగ్గు, గొంతు సమస్యలు వెంటాడుతాయి. వీటికి తోడు ఆరోగ్యానికి మేలు చేసే ఆహారం కాకుండా బయట దొరికే ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తింటున్నారు. దీనివల్ల అనారోగ్య సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ సీజన్ వస్తే చాలు ఇక.. రోగనిరోధక శక్తి కూడా పూర్తిగా తగ్గిపోతుంది. దీంతో వైరల్ ఫీవర్స్ ఎక్కువగా వస్తుంటాయి. కాస్త జలుబు చేసే చాలు.. ఇక ఫీవర్, దగ్గు అన్ని వచ్చి ఎన్ని రోజుల్కైన కూడా తగ్గదు. ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఉదయం పూట పోషకాలు ఉండే ఫుడ్‌ను తీసుకోవాలి. దీనివల్ల ఎలాంటి రోగాల్కైన కూడా నయం అయిపోతాయి. రోజంతా ఫ్రెష్‌గా ఉండటానికి కొందరు ఉదయం పూట టీ లేదా కాఫీ తాగుతుంటారు. దీనికి బదులు లవంగాలతో చేసిన టీ తాగితే రోగనిరోధకశక్తి పెరిగి ఎలాంటి అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. మరి లవంగాల టీ తాగితే శరీర ఆరోగ్యానికి ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం. కొందరు పిత్త సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. ముఖ్యంగా కడుపు, గొంతు సమస్యలతో బాధపడుతుంటారు. దీనివల్ల జీర్ణక్రియ కూడా దెబ్బతింటుంది. ఇలాంటి వారు లవంగాల టీని తాగడం వల్ల ఈ సమస్యలన్నింటి నుంచి విముక్తి పొందుతారు. రోజూ ఉదయం పూట పరగడుపున లవంగాల టీ తాగడం వల్ల కడుపులో చల్లగా ఉంటుంది. దీంతో కడుపులో మంట, అసిడిటీ తగ్గుతాయి. అలాగే జీర్ణక్రియ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని నిపుణులు అంటున్నారు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో లవంగం నీటిని తాగితే జీర్ణవ్యవస్థ బలంగా తయారవుతుంది. అలాగే గ్యాస్, అసిడిటీ, ఉబ్బరం, అజీర్ణం వంటి కడుపు వ్యాధులు కూడా నయం అవుతాయి. దీనివల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. లవంగాలలోని పోషకాలు ఆహారం ఈజీగా జీర్ణం అవుతుంది. దీంతో ఈ సమస్యల నుంచి విముక్తి చెందుతారు. కొందరి బాడీ కారణం లేకుండా వేడిగా అవుతుంది. దీంతో కడుపులో మంట, మలబద్దకం వస్తాయి. ఈ సమస్యల నుంచి విముక్తి చెందాలంటే లవంగాల టీను ఉదయం పూట తాగడం వల్ల బాడీ హైడ్రేట్‌గా ఉంటుంది. లవంగం టీ వల్ల బాడీకి చల్లదనం లభిస్తుంది. దీంతో కడుపు మంట నుంచి విముక్తి పొందుతారు.



# చూయింగ్ గమ్ తింటే కలిగే ప్రయోజనాలు

సాధారణంగా చాలా మంది టైమ్‌పాస్‌కి చూయింగ్ గమ్ తింటుంటారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగస్తులు, యువకులు అయితే ఎక్కువగా చూయింగ్ గమ్ నములుతుంటారు. అయితే చాలామంది దీనిని కేవలం సరదాకి మాత్రమే నములుతుంటారని అనుకుంటారు. కానీ ఇలా అనుకుంటే పొరపాటే. ఎందుకంటే చూయింగ్ గమ్ వల్ల బోలెడన్నీ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. తినడానికి తీపిగా ఉండే ఆ తర్వాత సాధారణం అయిపోయే చూయింగ్ గమ్‌ను ఎక్కువగా తింటారు. నోరు దుర్వాసన వస్తుంటే తగ్గడానికి, పురుషులు అయితే మద్యం సేవించిన తర్వాత వాసన బయటకు తెలియకూడదని చూయింగ్ గమ్ నములుతారు. అలాగే క్రీడాకారులు, ఎక్కువగా శారీరక శ్రమ చేసేవారు చూయింగ్ గమ్‌ను తింటుంటారు. అయితే ఈ చూయింగ్ గమ్ తినడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. మరి దీని వల్ల కలిగే ప్రయోజనాలేంటో చూద్దాం. చూయింగ్ గమ్ నమలడానికి ఈజీగా ఉంటుంది. దీన్ని నమలడం వల్ల నోటిలోని దుర్వాసన అంతా పోతుంది. అలాగే దంతాల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. చూయింగ్ గమ్ నమలడం వల్ల లాలాజల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో నోటిలో బ్యాక్టీరియా తగ్గిపోతుంది. అలాగే నోటిలో ఉండే కుహరం, ఫలకం వంటివి కూడా తగ్గే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే షుగర్ ఉండే చూయింగ్ గమ్‌ల కంటే షుగర్ లేని చూయింగ్ గమ్‌లను వాడటం ఆరోగ్యానికి మంచిది. ఆర్టిఫిషియల్ షుగర్ వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కాబట్టి షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్‌లను నమలడం మంచిది. చూయింగ్ గమ్ తినడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మెదడు చురుకుదనం కూడా పెరుగుతుంది. దీంతో మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉంటారు.

# సెల్‌ఫోన్ ఇలా పట్టుకుంటే..

## డెమెన్షియా వచ్చే ప్రమాదం ఉందా?



ప్రస్తుతం రోజుల్లో మొబైల్ వాడని వాళ్లు ఉండరు. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ కూడా మొబైల్‌కి బాగా ఎడిక్ట్ అయిపోయారు. ఉదయం లేచినప్పటి నుంచి నిద్రపోయే వరకు మొబైల్ వాడటమే కొందరి పని. ప్రస్తుతం అయితే ఇన్‌స్టాలో రీల్స్ చూస్తూ రోజంతా టైమ్ పాస్ చేస్తుంటారు. పొద్దున్న లేచిన వెంటనే రీల్స్ చూడటం స్టార్ట్ చేస్తారు. ఇక రోజంతా అదే పని. ఇలా మొబైల్ ఎక్కువగా చూడటం వల్ల కంటి ఆరోగ్యం దెబ్బతింటుంది. అలాగే ఒత్తిడి పెరిగి మానసికంగా కూడా ఇబ్బంది పడతారు. ఈ విషయాలు తెలిసిన కూడా మొబైల్ చూడటం మాత్రం మానరు. అయితే మొబైల్ పట్టుకునే పొజిషన్ వల్ల కూడా అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొందరికి ఎలా పట్టుకోవాలో తెలియక నచ్చినట్టుగా మొబైల్ పట్టుకుని గంటల తరబడి రీల్స్ చూస్తారు. దీనివల్ల డిమెన్షియా వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంతకీ డిమెన్షియా అంటే ఏమిటి? దీనివల్ల ఆరోగ్యానికి ఏదైనా నష్టం వాటిల్లుతుందా? పూర్తి వివరాలు స్టోరీలో తెలుసుకుందాం. కొందరు మొబైల్ లేదా ల్యాప్‌టాప్ చూసినప్పుడు తల, చేతుల భంగిమలను మార్చి పెడుతుంటారు. గంటల తరబడి తప్పుడు భంగిమలో ఉండటం వల్ల శరీరంలో వైకల్యం, మతిమరుపు వంటివి వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనినే డిమెన్షియా వ్యాధి అని అంటారు. ఈ వ్యాధికి ఇప్పటి వరకు ఎలాంటి చికిత్స లేదు. ఈ వ్యాధి బారిన పడితే చాలా ప్రమాదమని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి మొబైల్ చూసేటప్పుడు వంకరగా కాకుండా సరైన భంగిమలో పట్టుకోవాలి. అప్పుడే ఎలాంటి సమస్యలు ఉండవు. ఇలా తప్పుడు భంగిమలో మొబైల్ పట్టుకోవడం వల్ల మెదడులో రక్త ప్రసరణ కూడా తగ్గుతుంది. దీనివల్ల జ్ఞాపకశక్తి తగ్గుతుంది. అలాగే ఇది డిమెన్షియా నరాల సంబంధిత వ్యాధులకు కూడా కారణమవుతుంది. కాబట్టి సరైన భంగిమలో మాత్రమే మొబైల్‌ను వాడటం అలవాటు చేసుకోండి. కొందరు చేతిలో మొబైల్ పట్టుకుంటారు. కానీ తల మాత్రం వేరే దగ్గర ఉంటుంది. దీంతో మెదడులోని రక్తనాళాలపై ఒత్తిడి పడుతుంది. దీనివల్ల మెదడులో ఉండే ధమనులు కుంచించుకుని పోతాయి. దీంతో మెదడుకి సరిగ్గా రక్తప్రసరణ జరగదు. ఇక మెదడులోని కణాలు బలహీన పడి, డిమెన్షియా వ్యాధి వస్తుంది. కాబట్టి తల ఒక దగ్గర, మొబైల్ ఒక దగ్గర పెట్టుకుని కంఫర్ట్ లేకుండా వాడవద్దు. ఈ మొబైల్స్ ఎక్కువగా వాడటం వల్ల చాలా మంది అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ వ్యాధి బారిన పడే వారి సంఖ్య కూడా రోజురోజుకీ పెరుగుతుంది. కాబట్టి మొబైల్ ఫోన్ వాడేటప్పుడు తల వంచకూడదు. దీనివల్ల కేవలం డిమెన్షియా వ్యాధి మాత్రమే కాకుండా ఇతర సమస్యలు కూడా వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి మెడ, తలపై ఎలాంటి ఒత్తిడి పడకుండా మొబైల్ చూడటం అలవాటు చేసుకోవడం ఉత్తమం. దీనివల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యంగా ఉంటారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్

## చంద్రబాబు, కరువు
# కవల పిల్లలు

- నైరుతి పవనాలు అనుకూలించినా రాయలసీమలో కరువు ఛాయలు
- ఐదు జిల్లాలు, 54 మండలాల్లో కోరలు చాస్తున్న కరువు
- చంద్రబాబుపై ఎంపీ విజయసాయిరెడ్డి ఎద్దేవా



**అమరావతి, అక్టోబర్ 30 :** చంద్రబాబు, కరువు కవల పిల్లలు అని వైసీపీ ఎంపీ విజయసాయి-రెడ్డి చంద్రబాబును ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించిన నేపథ్యంలో చంద్రబాబుపై తీవ్ర ఆరోపణలు చేశారు. చంద్రబాబు వస్తే కరువు వస్తుందని అన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలు అనేది నానుడి అని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది నైరుతి అనుకూలించినా రాయలసీమ లో కరువు నీడలు వెంటాడు తున్నాయని విజయసాయిరెడ్డితెలిపారు. ఐదు జిల్లాలలో 54 మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, కొన్ని ప్రాంతాల్లో అనావృష్టి ఉందని అన్నారు. వైసీపీ హయాంలో రైతులపై పైసా భారం పడకుండా ఐదేళ్లపాటు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని పక్కన పెట్టి రైతుల ఉసురు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్ 2024కి సంబంధించి ఏపీ ప్రభుత్వం కరువు మండలాల జాబితాను మంగళవారం ప్రకటించింది. ఐదు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా 54 మండలాలు కరువు ప్రభావితానికి గురయ్యాయని తెలిపింది. ఈ మేరకు ఆయా మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కర్నూలు, అనంతపురం శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ఉన్న ఈ 54 మండలాల్లో వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదు కావడంతో ఈ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ ప్రభుత్వం ఆ జీవోలో తెలిపింది. వీటిలోని 27 మండలాల్లో తీవ్రమైన దుర్భిక్షం ఉంటే.. మరో 27 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. కలెక్టర్లు ఆయా జిల్లా గెజిట్‌లలో కరువు మండలాలను నోటిఫై చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

# కరువు మండలాలివే..

- జాబితాను ప్రకటించిన ఏపీ ప్రభుత్వం
- తగిన చర్యలు తీసుకోవాలని అధికారుల ఆదేశం



**అమరావతి, అక్టోబర్ 30 :** ఖరీఫ్ సీజన్ 2024కి సంబంధించి ఐదు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా 54 మండలాలు కరువు ప్రభావితానికి గురయ్యాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఆయా మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కర్నూలు, అనంతపురం శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ఉన్న ఈ 54 మండలాల్లో వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదు కావడంతో ఈ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ ప్రభుత్వం ఆ జీవోలో తెలిపింది. వీటిలోని 27 మండలాల్లో తీవ్రమైన దుర్భిక్షం ఉంటే.. మరో 27 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. కలెక్టర్లు ఆయా జిల్లా గెజిట్‌లలో కరువు మండలాలను నోటిఫై చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాలోని నార్పల.. అనంతపురం శ్రీసత్యసాయి జిల్లాలోని తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల.. అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, చిన్నమండెం, సంబెపల్లె, టి.సుండుపల్లె, రాయచోటి, లక్కిరెడ్డి పల్లె, రామాపురం, వీరబల్లె, తంబళ్లపల్లె, గుర్రంకొండ, కలపడ, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కురుబలకోట, పెద్దతిప్ప సముద్రం, బి.కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లె.. చిత్తూరు జిల్లాలోని పెనుమూరు, యాదమర్రి, గుడిపాల మండలాలను తీవ్ర కరువు మండలాలుగా నోటిఫై చేశారు. కర్నూలు జిల్లాలోని కౌతాలం, పెద్దకడుబూరు.. అనంతపురం జిల్లాలోని విడపనకల్, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు.. శ్రీసత్యసాయి జిల్లాలోని కనగానిపల్లి, ధర్మవ రం, నంబుల పులకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి.. చిత్తూరు జిల్లాలోని శ్రీరంగరాజపురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచర్ల, పూతలపట్టు, సోమల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లె, వెంకటగిరికోట, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం మండలాలను కరువు మండలాలుగా గుర్తించారు.

## ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి

### ఏపీలో వనరుల గురించి లోకేష్ విశ్లేషణ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 30 :** అమెరికాలో పర్యటిస్తున్న ఏపీ మంత్రి నారా లోకేష్ లాస్ వెగాస్‌లో నిర్వహిస్తున్న ఐటి సర్వ్ సినర్జీ సమ్మిట్‌లో పాల్గొన్నారు. వివిధ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని వారికి రిక్వస్ట్ చేశారు. ఏపీలో ఉన్న మానవ వనరులు, భూమి లభ్యత, వాతావరణ పరిస్థితులు వారికి వివరించారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ మేనేజింగ్ డైరక్టర్ రేచల్ స్కాఫ్‌ను కలిసి ఏపీలో పెట్టుబడుల అవకాశాలు పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు లోకేష్. "క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లక్ష్యాల సాధనకు నాయకత్వం ఉపకరిస్తుంది. స్మార్ట్ గవర్నెన్స్ కోసం ఎపి ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికల అమలులో క్లౌడ్ సేవలు కీలక పాత్ర వహించే అవకాశాలున్నాయి. ఏఐ మిషన్ లెర్నింగ్‌లో మీరు చూపిస్తున్న శ్రద్ధ, నిబద్ధత ఏపీని ఎఐ ఇన్నొవేషన్ కేంద్రంగా మార్చాలన్న మా ఆశయానికి ఊతమిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ సిస్టమ్, డిజిటల్ గవర్నెన్స్ మెరుగుదల, ఈ-గవర్నెన్స్ కార్యకమాలకు సహకారం అందించాలి"అని కోరారు. పెప్సికో మాజీ ఛైర్మన్ సిఇఓ ఇంద్రానూయితో భేటీ అయ్యాను. చంద్రబాబు నేతృత్వంలో ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు అమలుచేస్తూ వేగవంతమైన అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందని వివరించారు. టెక్నాలజీ, తయారీరంగంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాత్మక కృషిలో పెప్సికో భాగస్వాములు అవ్వాలని కోరారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవో క్లారా షిహ్?తో భేటీ అయ్యారు. టెక్ స్టార్టప్?లకు ఏఐ టూల్స్, మెంటార్ షిప్ అందించాలని.. ఏఐ ఆధారిత పరిశ్రమల కోసం యువతకు శిక్షణ ఇవ్వాలని కోరారు. విద్యాసంస్థలతో సేల్స్ ఫోర్స్ సంస్థ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. రెవేచర్ సిఇఓ అశ్విన్ భరత్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో టెక్ టాలెంట్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నెలకొల్పడానికి రెవేచర్ భాగస్వామ్యం వహించాలని కోరారు. రాష్ట్రంలో నైపుణ్య కార్యక్రమాలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఇతర డిమాండ్ ఉన్న ఐటి నైపుణ్యాల్లో యువతకు శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని కోరారు.



## కలకలం రేపుతున్న బాంబుల బెదిరింపు

- నగరంలోని హోటళ్లకు మరోసారి బెదిరింపు కాల్స్
- డాగ్, బాంబు స్క్వాడ్లతో తనిఖీలు

**తిరుపతి, అక్టోబర్ 30 :** ఆధ్యాత్మిక నగరి తిరుపతిలో వరుస బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. స్థానికులతోపాటు శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు ఆందోళనకు గుర్తిచేస్తున్నాయి. నగరంలోని హోటళ్లకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. గ్యాస్, వాటర్ పైపులైన్లు, మురుగునీటి పైపుల్లో పేలుడు పదార్థాలు ఉంచామంటూ ఎనిమిది హోటళ్లకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు తాజ్, బ్లిస్, మినర్వా, చక్రి, పాయ్ వైస్రాయ్, రీనెస్ట్, గోల్డెన్ దులీప్ హోటళ్లలో పోలీసులు.. డాగ్, బాంబు స్క్వాడ్లతో తనిఖీలు చేశారు. అయితే ఎక్కడా పేలుడు పదార్థాలు లభించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఐఎస్ఐ పేరుతో మంగళవారం రాత్రి 9.30 గంటలకు ప్రారంభమైన ఈ మెయిల్స్.. అర్ధరాత్రి వరకు కొనసాగాయి. కాగా, తమిళనాడులో ఐఎస్ఐ ఉగ్రవాది జాఫర్ సాదిక్?కు జైలు శిక్ష పడటంతో ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట ఈ బెదిరింపులు వస్తున్నాయి. తమిళనాడుతో పాటు తిరుపతిలోని హోటళ్లకు బాంబు మెయిల్స్ రావటం సమస్యగా మారింది. కంగారు పడాల్సిన అవసరం లేదని బెదిరింపు మెయిల్స్ ఎక్కడి నుంచి పంపుతున్నారనే విషయమై దర్యాప్తు జరుగుతోందని మొత్తం ఆరు కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

## మహారాష్ట్రలో మూడు స్థానాలకు
## సీపీఐ(ఎం) అభ్యర్థుల నామినేషన్

### 10,000 మందితో భారీ ర్యాలీ



**ముంబాయి, అక్టోబర్ 30 :** మహారాష్ట్రలో మూడు స్థానాలకు సీపీఐ (ఎం) అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇండియా బ్లాక్ (ఎంవీఏ)లో భాగంగా దహను, కల్వాన్, షోలాపూర్ సిటీ సెంట్రల్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు పోటీలో నిలిచారు. దహను (ఎస్టీ) నియోజకవర్గంలో ఇండియా బ్లాక్ పార్టీల నేతృత్వంలో 10,000 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ(ఎం) సిట్టింగ్ ఎమ్మెల్యే వినోద్ నికోల్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, నేతలు కిసాన్ గుజార్, మరియం ధావలే, కిరణ్ గహలా, రడ్కా కలంగ్డా, లక్ష్మణ్ డోంబ్రే, లహానీ దౌదా, సునీతా షింగ్డా, ఎన్‌సీపీ నేతలు మిహిర్ షా, వరుణ్ పరేఖ్, తన్మరు బారి, కాశీనాథ్ చౌదరి, కాంగ్రెస్ నేతలు సంతోష్ మోరే, హఫీజు ఖాన్, సుధాకర్ రౌత్, శివసేన నేతలు అజరు ఠాకూర్, సంజరు కాంబ్లే, సంజరు పాటిల్, ఉజ్వల దామ్షే, కష్టకారి సంఘటన నేతలు బ్రియాన్ లోబో, మధు ధోడి, భారత్ జోడో అభియాన్ నాయకులు రాజు భిసే, రమాకాంత్ పాటిల్ పాల్గొన్నారు. కల్వాన్ (ఎస్టీ) నుంచి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జేపీ గవిట్ నామినేషన్ దాఖలు చేశారు. నాసిక్ జిల్లాలోని కల్వాన్‌లో సుర్గానా తహసీల్‌ల నుంచి వేలాది మంది ప్రజలు, గిరిజన, గిరిజనేతర రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, ఎన్‌సీపీ లోక్‌సభ ఎంపీ భాస్కర్ భాగారే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శిరీష్ కొత్వాల్, శివసేన రూరల్ జిల్లా అధ్యక్షుడు జయంత్ దిండే, ఎన్‌సీపీ నేత రవీంద్ర దేవ్రే, కాంగ్రెస్ నేత శైలేష్ పవార్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సునీల్ మలుసరే, రాష్ట్ర కమిటీ సభ్యులు సుభాష్ చౌదరి, భికా రాథోడ్, ఇర్ఫాన్ షేక్, ఇంద్రజిత్ గావిత్, ఇంకా సావ్లిరామ్ పవార్, నీలేష్ షిండే పాల్గొన్నారు. షోలాపూర్ కలెక్టరేట్‌కు పార్టీ మాజీ ఎమ్మెల్యే నరసయ్య ఆదాం 12,000 మందికి పైగా కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. బీడీ, పవర్‌లూమ్, నిర్మాణ, రవాణా, అంగన్ వాడీ, ఆశా తదితర రంగాల్లోని కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఉదరు నార్కర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎంహెచ్ షేక్, రాష్ట్ర కమిటీ సభ్యులు నసీమా షేక్, నళిని కల్‌బుర్గి, యూసుఫ్ మేజర్, మాజీ మున్సిపల్ కార్పొరేటర్లు కామిని ఆడమ్, వ్యాంకటేష్ కొంగరి, అడ్వకేట్ అనిల్ వాసం పాల్గొన్నారు.

## ఆ ఏరివేతల వెనుక
## హోంశాఖ మంత్రి అమిత్ షా

### కెనడా ప్రభుత్వం ఆరోపణ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 30 :** కెనడాలో ఉన్న సిక్కు వేర్పాటువాదల ఏరివేతకు ప్లాన్ వేసింది భారత హోంశాఖ మంత్రి అమిత్ షా అని కెనడా ప్రభుత్వం ఆరోపించింది. ప్రధాని మోదీకి సన్నిహితుడైన అమిత్ షా సిక్కు వేర్పాటువాదులను టార్గెట్ చేసినట్లు ఆ దేశం పేర్కొన్నది. కెనడా చేసిన ఆరోపణలను భారత ప్రభుత్వం కొట్టిపారేసింది. ఖలిస్తానీల ఏరివేత వెనుక అమిత్ షా పాత్ర లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. సిక్కు వేర్పాటువాదులను షా టార్గెట్ చేసిన విషయాన్ని కెనడా విదేశాంగ శాఖ మంత్రి డేవిడ్ మారిసన్ తొలుత అమెరికాకు చేరవేశారు. అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు పత్రికకు ఆ సమాచారం ఇచ్చింది తానే అని డేవిడ్ పార్లమెంటరీ ప్యానెల్ భేటీలో తెలిపారు. సిక్కు వేర్పాటువాదుల హత్యకు ప్లాన్ వేసిన వ్యక్తి షానేనా అని ఓ జర్నలిస్టు అడిగారని, అయితే ఆ వ్యక్తికి అవునని తాను సమాధానం ఇచ్చినట్లు మారిసన్ తెలిపారు.

# అసలు బాధితుడు జగనే

- విజయమ్మ బహిరంగ లేఖపై వైసీపీ అసహనం
- ఆనాడు జగన్‌ను ఇబ్బంది పెట్టిన కాంగ్రెస్‌ను సపోర్టు చేయడం తప్పుకాదా అని నిలదీత..?
- చంద్రబాబు మేలు జరుగుతుందని తెలిసినా అప్పుడు ఎందుకు మౌనం



**అమరావతి, అక్టోబర్ 30 :** ఇటీవల వైఎస్ఆర్ ఆస్తుల విషయంలో మాజీ సీఎం జగన్ ఆమె సోదరి షర్మిల ఆస్తుల విషయంలో కొన్ని రోజులుగా వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో వైఎస్ఆర్ భార్య విజయమ్మ దీనిపై స్పందించి బహిరంగ లేఖ రాయడం తెలిసిందే. అయితే ఆమె స్పందనపై వైసీపీ మాత్రం పెదవి విరుస్తుంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికి ఉండగా ఆస్తులు పంచలేదని.. ఇప్పుడు ఉన్నవన్నీ కుటుంబ ఆస్తులే అని వైఎస్ విజయమ్మ చెప్పడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు ట్విట్టర్(ఎక్స్) ద్వారా సుదీర్ఘ లేఖను విడుదల చేసింది. దివంగత మహానేత వైఎస్ఆర్ భార్యగా, వైసీపీ అధ్యక్షురాలు వైఎస్ జగన్ తల్లిగా విజయమ్మను అమితంగా గౌరవిస్తామని ఆ లేఖలో తెలిపింది. బహిరంగ లేఖ నేపథ్యంలో కొన్ని అంశాలను ఆమె ముందుకు, ప్రజల ముందుకు తీసుకొస్తున్నామని పేర్కొంది. విజయమ్మ రాసిన లేఖలో జగన్‌ను లీగల్‌గా ఇబ్బంది పెట్టేందుకు, తద్వారా బెయిల్ రద్దుకు జరిగిన కుట్ర వ్యవహారాన్ని కనీసం ప్రస్తావించకపోవడం ప్రజలను పక్కదోవపట్టించడమే అని వైసీపీ తెలిపింది. సరస్వతీ కంపెనీ విషయంలో ఈడీ అటాచ్‌మెంట్ ఉన్నప్పటికీ, తెలంగాణ హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలు ఉన్నప్పటికీ, యాజమాన్య బదిలీ జరిగేలా క్రయవిక్రయాలు చేయకూడదని, అందుకే అటాచ్‌మెంట్‌లో ఉందనే విషయం అందరికీ తెలిసినప్పటికీ, సరస్వతీ విషయంలో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయవద్దని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జిలు సహా న్యాయ సలహాలు ఉన్నప్పటికీ, తప్పు అని తెలిసినప్పటికీ మోసపూరితంగా, కుట్రపూరితంగా షేర్లు బదిలీ చేసిన మాట వాస్తవమే కదా? అని ప్రశ్నించింది. షర్మిల భావోద్వేగాలకు, ఒత్తిళ్లకు గురై జగన్‌కు న్యాయపరంగా, చట్టపరంగా చిక్కులు తెచ్చే ఈ పనికి, తెలిసి కూడా విజయమ్మ ఆమోదించి సంతకం పెట్టడం నిజమే కదా అని నిలదీసింది. విజయమ్మ లేఖలో ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించడం ప్రజలను, వైసీపీ అభిమానులను పక్కదోవపట్టించడమే కదా అని చెప్పింది. 2024 ఎన్నికల్లో జగన్ ఒక్కరే ఒకవైపున ఉంటే, అటువైపు చంద్రబాబు నేతృత్వంలో రాజకీయ ప్రత్యర్థులు జట్టుకడితే, మరి కొన్ని గంటల్లో ఎన్నికల ప్రచారం ముగుస్తుందనగా, దివంగత మహానేత వైఎస్ఆర్‌ను ఎఫ్ఐఆర్ లో పెట్టిన, తన కుమారుడ్ని అన్యాయంగా 16నెలలు జైల్లోపెట్టిన కాంగ్రెస్‌కు ఓటు వేయండంటూ, వైసీపీని ఇబ్బందిపడుతూ వీడియో విడుదలచేసి విజయమ్మ షర్మిలగారివైపు ఉన్నారనే విషయాన్ని చాలా స్పష్టంగాచెప్పారు. దివంగత మహానేత, వైఎస్సార్ రాజకీయ ప్రత్యర్థులకు, వైఎస్సార్ కుటుంబంపై నిరంతరం కుట్రలు పన్నే చంద్రబాబుకు రాజకీయంగా మేలుచేసే ఇలా వ్యవహరించడం ధర్మమేనా? రాజకీయాలు పక్కనపెడితే ఒక తల్లిగా ఆరోజు విజయమ్మగారు మద్దతు సంగతి దేవుడెరుగు, కనీసం తటస్థవైఖరిని మరిచిపోయి, పక్షపాతం వహించిన వైనంచూసి వైఎస్సార్ అభిమానులు తీవ్రంగా కలతచెందారు, బాధపడ్డారు. ఇప్పుడు షర్మిలగారి భావోద్వేగాలు, ఒత్తిళ్ల ప్రభావంతో, సరస్వతీ కంపెనీ వ్యవహారంలో న్యాయపరంగా ఇబ్బందులు వచ్చి, స్వయంగా ఆమె కుమారుడి బెయిల్ రద్దు కుట్రకు దారితీస్తుందని తెలిసి కూడా మోసపూరితంగా, షేర్ల సర్టిఫికెట్లు పోయాయని చెప్పి, ఒరిజనల్ షేర్ సర్టిఫికెట్ లేకుండా, జగన్ గారి సంతకాలు లేకుండా, ఎవ్వరికీ తెలియకుండా షేర్లను బదిలీచేసి, షర్మిలతోనే విజయమ్మ ఉన్నారని మరోసారి స్పష్టంగా చెప్పారు.

11
గురువారం
31.10.2024
వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
SPORTS
క్రీడలు


# అభిషేక్ శర్మకు జాక్‌పాట్!




ఫ్రాంచైజీలు తమ రిటైన్డ్ ప్లేయర్ జాబితాలను సమర్పించేందుకు అక్టోబర్ 31ని గడువుగా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయించింది. ఐపీఎల్ 2025 కోసం ఓ ఫ్రాంచైజీ ఆరుగురు ప్లేయర్లను రిటైన్ చేసుకోవచ్చు. అందులో గరిష్టంగా అయిదుగురు క్యాప్డ్ ప్లేయర్లు, ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్స్ ఉండాలి. ఆరుగురినినేరుగా రిటైన్ చేసుకోవచ్చు, లేదా ఆర్‌టీఎమ్ కార్డ్‌తో వేలంలో దక్కించుకోవచ్చు. రిటైన్ లిస్ట్‌ను సమర్పించడానికి ఫ్రాంచైజీలకు మరికొన్ని గంటలు మాత్రమే గడువు ఉంది. ఇప్పటికే ఫ్రాంచైజీలు దాదాపుగా తమ రిటైన్ లిస్ట్‌ను ఖరారు చేశాయి. అయితే అధికారికంగా మాత్రం ప్రకటించకున్నా.. ప్లేయర్స్ లిస్ట్ మాత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ముగ్గురుని నేరుగా రిటైన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్యాట్ కమిన్స్, హెన్రిచ్ క్లాసెన్, అభిషేక్ శర్మ మొదటి మూడు ప్రాధాన్యత ప్లేయర్లుగా ఖరారు చేసింది. అయితే ఈ ముగ్గురికి ఎస్ఆర్‌హెచ్ సీఈవో కావ్య మారన్ నిర్ణీత ధర కంటే ఎక్కువగా ఆఫర్ చేసిందని సమాచారం. రూ.23 కోట్లు, రూ.18 కోట్లు, రూ.14 కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ట్రావిస్ హెడ్, నితీశ్ రెడ్డిని కూడా రిటైన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అబ్దుల్ సమద్‌ను అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా తీసుకోనుందట.అయిదుగురు క్లాప్డ్ ప్లేయర్లకు మాత్రమే ఛాన్స్ ఉండటంతో కీలక ప్లేయర్లు భువనేశ్వర్ కుమార్, టీ నటరాజన్, వాషింగ్టన్ సుందర్‌లను సన్‌రైజర్స్ హైదరాబాద్ వదులుకోక తప్పదు. వీరిలో కొందరిని వేలంలో తిరిగి దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. సుందర్ కోసం ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ పోటీ పడనున్నట్లు సమాచారం. న్యూజిలాండ్ రెండో టెస్టులో సత్తాచాటిన సుందర్‌కు చోటు లేకపోవడం నిరాశ కలిగించే అంశమే. మరికొన్ని గంటల్లో ఫుల్ డీటెయిల్స్ తెలియరానున్నాయి.



# రిటెన్షన్ లిస్ట్‌కు నేడు తుది గడువు..

రిటైన్ ప్లేయర్ల లిస్ట్‌ను సమర్పించడానికి ఫ్రాంచైజీలకు మరికొన్ని గంటలు మాత్రమే గడువు ఉంది. గురువారం సాయంత్రం 5 గంటలలోపు తమ రిటెన్షన్ లిస్ట్‌ను సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రిటెన్షన్ రూల్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలు మీ కోసం.. ఓ ఫ్రాంచైజీ ఆరుగురు ప్లేయర్లను రిటైన్ చేసుకోవచ్చు. అందులో గరిష్టంగా అయిదుగురు క్యాప్డ్ ప్లేయర్లు, ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్లకు మాత్రమే ఛాన్స్. ఆరుగురిని నేరుగా రిటైన్ చేసుకోవచ్చు లేదా ఆర్‌టీఎమ్ కార్డ్‌తో వేలంలో సొంతం చేసుకోవచ్చు. ఇందులో విదేశీ ప్లేయర్లకు ఎలాంటి పరిమితి లేదు. అంటే మొత్తం అయిదుగురు ఫారెన్ ప్లేయర్లను (క్యాప్డ్ ప్లేయర్ల రూల్‌తో) కూడా అట్టిపెట్టుకోవచ్చు. నేరుగా రిటైన్ చేసుకునే ఆటగాళ్లకు ఆయా ఫ్రాంచైజీలు వరుసగా రూ.18 కోట్లు, రూ.14 కోట్లు, రూ.11 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. నాలుగు, అయిదో ఆటగాడిని తీసుకోవాలనుకుంటే తిరిగి రూ.18 కోట్లు, రూ.14 కోట్లు చెల్లించాలి. అన్‌క్యాప్డ్ ప్లేయర్‌ను అట్టిపెట్టుకుంటే మాత్రం రూ.4 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది."ఓ భారత ప్లేయర్ అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా ఇలా పరిగణిస్తారు. గత అయిదేళ్ల క్యాలెండ్ ఇయర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో ఏ ఫార్మాట్‌లో అయినా తుదిజట్టులో కూడా చోటు దక్కించుకోని ఆటగాళ్లు, అలాగే ఆ సదరు ప్లేయర్లు బీసీసీఐతో సెంట్రల్ కాంట్రాక్ట్ కూడా లేకుండా ఉంటే అన్‌క్యాప్డ్‌గా పరిగణిస్తారు. ఇది భారత ఆటగాళ్లకు మాత్రమే వర్తిస్తుంది" ఫ్రాంచైజీ పర్స్ వ్యాల్యూను రూ.120 కోట్లకు పెంచారు. రిటెన్షన్ స్లాబ్‌ల ద్వారా అయిదుగురు క్యాప్డ్ ప్లేయర్లను రిటైన్ చేసుకుంటే రూ.75 కోట్లు చెల్లించాలి. మరో అన్‌క్యాప్డ్ ప్లేయర్‌ను కూడా తమ ఫ్రాంచైజీతో కొనసాగించాలంటే రూ. 4 కోట్లు వెచ్చించాలి. అయితే ఆ సందర్భంలో సదరు ఫ్రాంచైజీ రూ.41 కోట్లతోనే మెగా వేలంలో పాల్గొనాల్సి ఉంటుంది.రిటెన్షన్ ధరకు బదులుగా వేలంలో ప్లేయర్లను ఎలాంటి పరిమితి లేకుండా నిబంధనలకు అనుగుణంలో ఆర్‌టీఎమ్‌తో దక్కించుకునే అవకాశం కల్పించారు. అయితే ఈ సారి ఆర్‌టీఎమ్ రూల్స్‌లో ఓ మార్పు ఉంది. బిడ్ వేసిన ఫ్రాంచైజీ సదరు ఆటగాడిని దక్కించుకోవడానికి మరోసారి బిడ్ వేసే అవకాశం ఇవ్వనున్నారు. ఉదాహరణకు సీఎస్కే ప్లేయర్‌ను ఆర్సీబీ రూ.15 కోట్లుకు వేలంలో సొంతం చేసుకుంది. ఆ సదరు ప్లేయర్‌ను సీఎస్కే తమ దగ్గర అందుబాటులో ఉన్న ఆర్‌టీఎమ్‌తో రూ.15 కోట్లు చెల్లించి తీసుకుంటామని ముందుకు రావచ్చు. అయితే సీఎస్కే అలా ముందుకు వచ్చిన సందర్భంలో.. ఆర్సీబీ ధరను మరింత పెంచుతామని వేలాన్ని కొనసాగించవచ్చు. అప్పుడు రూ.20 కోట్లు ధర పలికాడని అనుకుందాం. అప్పటికే ఆ ఆటగాడిని సీఎస్కే దక్కించుకోవాలంటే గరిష్టంగా పలికన రూ.20 కోట్లను వెచ్చించాల్సి ఉంటుది. లేదంటే రూ.20 కోట్లకు ఆ ప్లేయర్ ఆర్సీబీకి వెళ్తాడు.




# ఆరుగురిని రిటైన్ చేసుకున్న రాజస్థాన్.. !?

ఐపీఎల్ 2025కి ముందు మెగా వేలం జరగనున్న విషయం తెలిసిందే. ఈసారి ఆరుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి ఫ్రాంఛైజీలకు ఇప్పటికే ఐపీఎల్ పాలక వర్గం అనుమతించింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ఉంటుంది. రిటైన్ జాబితాను ప్రకటించడానికి అక్టోబర్ 31 తుది గడువు. రిటైన్ ప్లేయర్ల లిస్ట్‌ను సమర్పించడానికి ఫ్రాంచైజీలకు మరికొన్ని గంటలు మాత్రమే ఉన్నా.. ఇప్పటివరకు ఏ జట్టు కూడా అధికారికంగా జాబితాను విడుదల చేయలేదు. అయితే రాజస్థాన్ రాయల్స్ ఆరుగురిని రిటైన్ చేసుకుందని తెలుస్తోంది. టీమిండియా ప్లేయర్స్ సంజు శాంసన్, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జరెల్, రియాన్ పరాగ్‌లను రాజస్థాన్ రాయల్స్ రిటైన్ చేసుకుందని తెలుస్తోంది. శాంసన్ మొదటి ఎంపికగా ఉన్నాడు. అతడికి 18 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. పరాగ్‌కు 14 కోట్లు, జరెల్‌కు 11 కోట్లు ఇవ్వడానికి రాజస్థాన్ సిద్ధమైందని సమాచారం. జైస్వాల్‌కు 18 కోట్లు, జోస్ బట్లర్‌కు 14 కోట్లు ఇవ్వనుందట. అన్‌క్యాప్డ్ ప్లేయర్ సందీప్ శర్మను 4 కోట్లకు తీసుకుందని ఓ జాతీయ మీడియా తమ కథనంలో పేర్కొంది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ యుజ్వేంద్ర చహల్‌ను వేలంలో తిరిగి దక్కించుకోవాలని చూస్తోందట. సంజు శాంసన్, యశస్వి జైస్వాల్, రియాన్ పరాగ్‌లు గత 2–3 ఏళ్లుగా రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ లైనప్‌కు మూల స్తంభాలుగా ఉన్నారు. గతేడాది విఫలమైన ఇంగ్లండ్ క్రికెటర్ జోస్ బట్లర్‌పై నమ్మకం ఉంచినట్లు తెలుస్తోంది. రాజస్థాన్ రిటైన్ జాబితాలో సందీప్ మాత్రమే స్పెసలిస్ట్ బౌలర్. పరాగ్ స్పిన్ బౌలింగ్ చేస్తాడు. టీమిండియా మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ ప్రధాన కోచ్‌గా ఫ్రాంచైజీకి తిరిగి వచ్చాడు. దాంతో ఫాన్స్ వేలంపై చాలా ఆసక్తిగా ఉన్నారు.

## కోహ్లీ తన స్థాయికి తగ్గట్టుగా

# ఆడలేకపోతున్నాడు

### ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బ్రాడ్ హాగ్

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన స్థాయికి తగ్గట్టుగా ఆడలేకపోతున్నాడు. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో వర్షం ప్రభావం కారణంగా ఇబ్బంది పడి డకౌట్ కాగా.. రెండో ఇన్నింగ్స్‌లో (70) హాఫ్ సెంచరీ చేసినా జట్టును మాత్రం ఆదుకోలేదు. రెండో టెస్టులో 1, 17 రన్స్ చేసి పెవిలియన్ చేరాడు. స్పిన్‌ను ఉతికారేసే కోహ్లీ.. సొంతగడ్డపై స్పిన్నర్లకే వికెట్లను ఇచ్చేయడం అందరిని నిరాశకు గురిచేస్తోంది. విరాట్ ఆట తీరుపై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బ్రాడ్ హాగ్ స్పందించాడు. దూకుడుగా ఆడేద్దామనే భావనతో ఔట్ అవుతున్నాడని పేర్కొన్నాడు.'న్యూజిలాండ్‌ను భారత్ తేలిగ్గా తీసుకుంది. సొంతగడ్డపై సులువుగా విజయం సాధించవచ్చనుకుంది. రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లీ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాడు. అగ్రెసివ్‌గా బ్యాటింగ్ చేసి రన్స్ చేయాలని చూశాడు. కివీస్ బౌలింగ్‌ను తక్కువగా అంచనా వేశాడు. షాట్లు కొట్టేటప్పుడు భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోయాడు. అందుకే స్పిన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. మూడో టెస్టులో అయినా టెక్నిక్‌ను మరింత మెరుగుపర్చుకోవాలి. టీమ్ సౌథీ బౌలింగ్‌లో రోహిత్ శర్మ ఇబ్బంది పడ్డాడు. సిరీస్ క్లీన్‌స్వీప్ కాకుండా ఉండాలంటే కోహ్లీ, రోహిత్ రన్స్ చేయాల్సిందే' అని బ్రాడ్ హాగ్ సూచించాడు. మూడో టెస్టు శుక్రవారం నుంచి ముంబైలో ప్రారంభం కానుంది.

# షమీని వదిలేందుకు సిద్ధమైన గుజరాత్



టీమిండియా సీనియర్ పేసర్ మహమ్మద్ షమీకి ఐపీఎల్ ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్ భారీ షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి షమీని వదిలేందుకు సిద్ధమైందని సమాచారం. గుజరాత్ రిటైన్ లిస్టులో షమీ పేరు లేదని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. చీలమండ గాయం కారణంగా ఏడాదికి పైగా షమీ ఆటకు దూరమవడంతోనే గుజరాత్ మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మహమ్మద్ షమీ చీలమండ గాయంతో భారత జట్టుకు దూరమయ్యాడు. ఈ ఏడాదిలో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో చివరిసారిగా ఆడాడు. అనంతరం విదేశాల్లో శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ఈ క్రమంలో ఐపీఎల్ 2024, టీ20 ప్రపంచకప్ 2024కు దూరమయ్యాడు. ప్రస్తుతం గాయం నుంచి పూర్తిగా కోలుకొని జట్టులోకి రీఎంట్రీ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇటీవలే ఫిట్‌నెస్ టెస్ట్‌లను కూడా క్లియర్ చేశాడు. అయితే షమీకి బీసీసీఐ సెలెక్టర్లు షాకిచ్చారు. దక్షిణాఫ్రికా టీ20 సిరీస్, ఆస్ట్రేలియాతో బోర్డర్–గవాస్కర్ ట్రోఫీకి ఎంపిక చేయలేదు.ఇక చేసేది లేక బెంగాల్ తరఫున నాలుగో రౌండ్ రంజీ మ్యాచ్ ఆడేందుకు మహమ్మద్ షమీ సిద్ధమయ్యాడు. ఏడాది కాలంగా క్రికెట్ ఆడని షమీని గుజరాత్ టైటాన్స్ కూడా పట్టించుకోలేదు. ఐపీఎల్ 2025 కోసం రిటైన్ చేసుకోకుండా.. వేలంలోకి వదిలేస్తోంది. ఒకవేళ రంజీ మ్యాచులో రాణిస్తే.. ఆర్‌టీఎమ్ ద్వారా తీసుకోవాలని చూస్తోందట. ఐపీఎల్ మెగా వేలం నవంబర్ 30న జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## బంగ్లాదేశ్ వర్సెస్ సౌతాఫ్రికా

# రెండో టెస్ట్‌లో ఆసక్తికర ఘటన



బంగ్లాదేశ్ వర్సెస్ సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ సందర్భంగా ఆ జట్టుకు అప్పనంగా ఒక్క బంతికే 10 పరుగులు లభించాయి. కనీసం బ్యాట్ టచ్ చేయకుండానే బంగ్లాదేశ్ ఖాతాలో ఈ పరుగులు చేరడం విశేషం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 144.2 ఓవర్లలో 6 వికెట్లకు 575 పరుగుల భారీ స్కోర్ చేసి డిక్లేర్ చేసింది. టోనీ డీ జోర్జి(269 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 177), ట్రిస్టన్ స్టబ్స్(198 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 106), వియాన్ మల్డర్(150 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లతో 105 నాటౌట్) శతకాలతో రాణించగా.. సేనురన్ ముతుసామీ(175 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 68), డేవిడ్ బెడింగ్‌హమ్(78 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్(5/198) ఐదు వికెట్లు తీయగా.. నహిద్ రాణా(1/83) ఓ వికెట్ పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్‌కు తొలి బంతికే 10 పరుగులు ఖాతాలో చేరాయి. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ సందర్భంగా ఆ జట్టు బ్యాటర్ సేనురన్ ముతుసామీ పదే పదే మిడిల్ పిచ్‌పై పరుగెత్తి అంపైర్ల మందలింపుకు గురయ్యాడు. పలుమార్లు హెచ్చరించినా తన తీరును మార్చుకోలేదు. దాంతో అంపైర్లు నిబంధన ప్రకారం సౌతాఫ్రికాకు 5 పరుగుల పెనాల్టీ విధించారు. దాంతో బంగ్లాదేశ్ ఖాతాలో అప్పనంగా 5 పరుగులు చేరాయి. కగిసో రబడా వేసిన తొలి బంతిని బంగ్లాదేశ్ ఓపెనర్ షెడమన్ ఇస్లామ్ వదిలేయగా.. కీపర్ చేతిలోకి వెళ్లింది. రెండో బంతి వేసే క్రమంలో కగిసో రబడా ఓవర్ స్టెప్ అయ్యి నో బాల్ వేసాడు. ఆ బంతి కాస్త వికెట్ కీపర్‌ను ధాటి బౌండరీకి దూసుకెళ్లింది. దాంతో బంగ్లాదేశ్‌కు అప్పనంగా మరో 5 పరుగులు లభించాయి. ఇలా మొత్తం 10 పరుగులు ఒక్క బంతికే.. బంగ్లా బ్యాటర్ టచ్ చేయకుండా వచ్చి చేరాయి.ఐసీసీ నిబంధనల్లోని ఆర్టికల్ 41.2.11 ప్రకారం ఫీల్డ్ అంపైర్ సౌతాఫ్రికాకు ఐదు పరుగుల పెనాల్టీ విధించాడు. ఈ రూల్ ప్రకారం అంపైర్లు తప్పు చేసిన ఆటగాడిని పలుమార్లు హెచ్చరిస్తారు. ముందుగా మందలిస్తారు. ఆ తర్వాత కెప్టెన్ సమక్షంలో జట్టులోని ఆటగాళ్లందరికి లాస్ట్ వార్నింగ్ అని చెబుతారు. అప్పటికీ అదే తప్పిదం చేస్తే 5 పరుగులు పెనాల్టీ విధిస్తారు.సౌతాఫ్రికా బ్యాటర్ ముతుసామీ విషయంలోనూ ఇదే జరిగింది. ముతుసామీ తప్పిదం.. రబడా నోబాల్ కారణంగా బంగ్లాదేశ్‌కు అప్పనంగా 10 పరుగులు లభించాయి. అయితే ఈ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. రబడా నిప్పులు చెరగడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 9 ఓవర్లలో 4 వికెట్లకు 38 పరుగులే చేసింది. ఇంకా 537 పరుగుల వెనుకంజలో ఉంది.

# మరోసారి ఆర్‌సీబీ కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ!

ఐపీఎల్ 2025కి ముందు మెగా వేలం జరగనుంది. ఫ్రాంఛైజీలు తమ రిటెన్షన్ జాబితాను అక్టోబర్ 31 లోపు సమర్పించాల్సి ఉంది. తుది గడువుకు మరికొన్ని గంటలే ఉన్న నేపథ్యంలో అభిమానుల దృష్టి అంతా రిటెన్షన్ జాబితాపైనే ఉంది. ఏ ఫ్రాంచైజీ ఏయే ఆటగాళ్లను అట్టిపెట్టుకుంటుంది, ఎవరిని వేలంలోకి వదిలేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. తుది గడువు సమీపిస్తున్నా కొద్దీ.. స్టార్ ఆటగాళ్ల చుట్టూ పలు ఆసక్తికర కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) కెప్టెన్‌గా బాధ్యతలు అందుకోనున్నాడట. ఫాఫ్ డుప్లెసిస్‌ను రిటైన్ చేసుకోవడానికి ఆర్‌సీబీ ఆసక్తిగా లేనట్లు తెలుస్తోంది. 2022 సీజన్ నుంచి బెంగళూరును డుప్లెసిస్ నడిపిస్తున్నాడు. గత మూడు సీజన్లలో రెండుసార్లు ప్లేఆఫ్స్‌కు చేర్చాడు కానీ.. 17 ఏళ్లుగా ఎదురుచూస్తున్న టైటిల్ కలను మాత్రం తీర్చలేకపోయాడు. కరేబియన్ ప్రీమియర్ లీగ్‌లో సెయింట్ లూసియా కింగ్స్‌ను విజేతగా నిలబెట్టిన డుప్లెసిస్‌కు మరో అవకాశం ఇవ్వాలని చూసినా.. ఆర్‌సీబీ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మరో మూడేళ్లకు తగ్గట్లుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని యూటర్న్ తీసుకుంది.ఫాఫ్ డుప్లెసిస్‌ను రిటెయిన్ చేసుకోకపోతే బెంగళూరుకు కొత్త కెప్టెన్ రావడం ఖాయం. గతంలో జట్టును నడిపించిన విరాట్ కోహ్లీ పేరే కెప్టెన్ రేసులో ప్రధానంగా వినిపిస్తోంది. కేఎల్ రాహుల్‌ను జట్టులోకి తీసుకోవాలని వ్యూహాలు సిద్ధం చేసినా.. లక్నో ఆర్‌టీఎమ్ ఉపయోగించే అవకాశం ఉండటం, వేలంలో అతడికి భారీ డిమాండ్ ఉండే అవకాశాల నేపథ్యంలో బ్యాకప్ ప్లాన్ సిద్ధం చేసిందని తెలుస్తోంది. 2013 నుంచి 2021 వరకూ విరాట్ ఆర్‌సీబీకి సారథ్య బాధ్యతలు నిర్వర్తించాడు. అయితే టైటిల్ మాత్రం అందించలేకపోయాడు. విరాట్ కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో డుప్లెసిస్ బాధ్యతలు అందుకున్నాడు.



వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com






# ఎన్టీఆర్ ఫ్యామిలీ నుంచి మరో ఎన్టీఆర్

## తెరకు పరిచయం చేస్తున్న వైవిఎస్ చౌదరి

సీతారామరాజు, లాహిరి లాహిరి లాహిరిలో, సీతయ్య లాంటి సినిమాలతో డైరెక్టర్‌గా సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న వైవీఎస్ చౌదరి ఇప్పటికే పలువురు యాక్టర్లను ఇండస్ట్రీకి పరిచయం చేసాడు. తాజాగా సీనియర్ ఎన్టీఆర్ కుటుంబం నుంచి మరో కొత్త నటుడిని అందరికీ పరిచయం చేస్తున్నాడు. దివంగత సీనియర్ ఎన్టీఆర్ కుమారుడు నందమూరి హరికృష్ణ మనవడు (జానకిరామ్ కుమారుడు) నందమూరి తారకరామారావు ఫస్ట్ దర్శన్ వీడియోను వైవీఎస్ చౌదరి షేర్ చేశాడు. ప్రొడక్షన్ నంబర్ 1గా రాబోతున్న ఈ చిత్రాన్ని వైవీఎస్ చౌదరి సతీమణి యలమంచిలి గీత నిర్మిస్తుండటం విశేషం. నందమూరి తారకరామారావు హీరోగా గ్రాండ్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్టు ఫస్ట్ దర్శన్ వీడియో చెప్పకనే చెబుతోంది. నటుడిగా అందరినీ ఇంప్రెస్ చేసేందుకు యాక్టింగ్, ఫైట్స్‌లో శిక్షణ తీసుకోవడంతోపాటు మేకోవర్ కూడా మార్చుకున్నట్టు తాజా లుక్స్‌తో తెలిసిపోతుంది. ఈ చిత్రానికి లెజెండరీ డైరెక్టర్ ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా.. సాయి మాధవ్ బుర్రా సంభాషణలు సమకూరుస్తున్నారు. చంద్రబోస్ పాటలు అందిస్తున్నాడు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. తాజాగా వైవిఎస్ చౌదరి ప్రెస్ మీట్ ఏర్పాటుచేసి ఎన్టీఆర్‌ను పరిచయం చేశారు. దీంతో ఈ అప్‌కమింగ్ హీరోకు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అతని ఎంట్రీని స్వాగతిస్తూ .. జూనియర్ ఎన్టీఆర్ ఆల్ ది బెస్ట్ చెబుతూ పోస్ట్ చేశారు. 'రామ్ సినీ ప్రపంచంలోకి నీ మొదటి అడుగుకు అభినందనలు. సినిమా ప్రపంచం నిన్ను ఆదరించడానికి ఎదురుచూస్తోంది. నువ్వు చేసే ప్రతి ప్రాజెక్ట్ విజయం సాధించాలని కోరుకుంటున్నా. అంటూ జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు తెలిపారు.






# లక్కీ భాస్కర్ ఓ మంచి సందేశాత్మక చిత్రం

## నిర్మాత నాగవంశీ వెల్లడి

దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా వెంకీ అట్లూరి తెరకెక్కించిన చిత్రం 'లక్కీ భాస్కర్' సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ దీనిని నిర్మించారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈనేపథ్యంలో నాగవంశీ సినిమా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇది తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందని తాము విశ్వసిస్తున్నామన్నారు. కొన్ని సినిమాలు తెరకెక్కించిన తర్వాత ఆనందకరమైన ఫీలింగ్ వస్తుంది. అలాంటి ఓ సినిమా ఇది. సినిమా చూసిన తర్వాత బాగా తీశామనే ఫీలింగ్ వచ్చింది. అందుకే దీనిపై గట్టి నమ్మకంతో ఉన్నాం. ఈరోజు ప్రీమియర్ వేస్తున్నాం. దర్శకుడు వెంకీ అట్లూరితో మాకు మంచి అనుబంధం ఉంది. ఒక దర్శకుడితో రిలేషన్ సెట్ అయితే హిట్లు, ఫ్లాప్‌పులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తాం కదా. అదేవిధంగా వెంకీతో నాకు మంచి ఫ్రెండ్‌షిప్ ఉంది. హిట్ లేదా ఫ్లాప్ ఏదైనా మా జర్నీ అలాగే కంటిన్యూ అవుతుంది. థ్రిల్లర్ జానర్‌లో ఉండే ఫ్యామిలీ సినిమా ఇది. బ్యాంకింగ్ సెక్టార్‌లో ఉండే లోపాలు వాడుకొని హీరో ఎదిగే క్రమాన్ని దీనిలో చూపించాం. 1980-90లో ముంబయి ఎలా ఉంది? అప్పటి రోజుల్లో బ్యాంక్స్ ఎలా వర్క్ చేశాయి? స్టాక్ మార్కెట్ ఎలా ఉంది? ఇలాంటి విషయాలతో కొత్త ప్రపంచాన్ని సృష్టించాం. సినిమా మొదలైన 15 నిమిషాల్లోనే ప్రేక్షకులు భాస్కర్‌తో కనెక్ట్ అవుతారు. అతడు గెలవాలని కోరుకుంటారు. ఆ విషయంలో నేను గ్యారెంటీ ఇవ్వగలను. డబ్బు సంపాదించాలనిపించినప్పుడు మనిషి ఎంత దూరమైనా వెళ్తాడు అనేది ఈ సినిమా. కంటెంట్‌ను బాగా నమ్మాం. విభిన్నమైన కంటెంట్‌కు కమర్షియల్ హంగులు జోడించాం. ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా చూడలేదు. ప్రేక్షకులకు ఎక్కడా బోర్ కొట్టదు. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఒక ఫీల్‌తో వస్తారని నాగవంశీ చెప్పారు. థియేటర్ల సమస్య గురించి మాట్లాడుతూ.. ఈ పండుగకు చాలా సినిమాలు విడుదలవుతున్నాయి. దానివల్ల మల్టీప్లెక్సులు దొరకడం కష్టంగా ఉంది. అన్నిచోట్లా ఇదే పరిస్థితి ఉంది. పరిస్థితులకు అనుగుణంగా సెట్ చేసుకొని ముందుకుసాగాలని అన్నారు. కిరణ్ అబ్బవరం 'క', 'అమరన్' కూడా విజయం అందుకోవాలని కోరుకున్నారు. తమ బ్యానర్‌లో బాలకృష్ణ హీరోగా చేయనున్న సినిమా అప్‌డేట్ గురించి మాట్లాడారు. దీపావళికి అప్‌డేట్ ఇద్దామనుకున్నాం. కాకపోతే సీజీ వర్క్ వల్ల కాస్త లేటు అవుతుంది. పండక్కి అప్‌డేట్ ఇవ్వలేకపోతున్నాం అని నాగవంశీ తెలిపారు.

# హిందీలో మరో ఛాన్స్ కొట్టేసిన రష్మిక

దక్షిణాదితోపాటు ఉత్తరాదిలోనూ వరుస చిత్రాలు చేస్తూ కెరీర్‌లో దూసుకెళ్తున్నారు నటి రష్మిక గతేడాది 'యానిమల్'తో విజయాన్ని అందుకున్న ఆమె ప్రస్తుతం చేతినిండా చిత్రాలతో వరుస షూటింగ్స్‌తో గ్యాప్ లేకుండా గడుపుతున్నారు. తాజాగా బాలీవుడ్‌లో మరో ప్రాజెక్ట్ ఓకే చేశారు. 'స్త్రీ', 'బేడియా', 'ముంజ్య' క్రియేటర్స్ దీనిని తెరకెక్కించనున్నారు. విభిన్న కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'థమా' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ రష్మిక తాజాగా ఓ పోస్ట్ పెట్టారు. ఈ యూనివర్స్ ఒక ప్రేమ కథ కోరుకుంటుంది. దురదృష్టవశాత్తూ అది చాలా ఉద్వేగంతో కూడుకున్నదని టీమ్ పేర్కొంది. ఆయుష్మాన్ ఖురానా, నవాజుద్దీన్ సిద్ధిఖీ, పరేశ్ రావల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ముంజ్య' దర్శకుడు ఆదిత్య సర్పోత్దార్ దీనికి దర్శకత్వం వహించనున్నారు.

# కెన్యాలో ప్రిపరేషన్ వర్క్‌లో రాజమౌళి

ప్రముఖ దర్శకుడు రాజమౌళి ప్రస్తుతం కెన్యాలో ఉన్నారు. ఇందులోభాగంగా మంగళవారం అంబోసెలి నేషనల్ పార్క్‌లో తీసిన ఓ ఫొటోని షేర్ చేసిన ఆయన తాజాగా ఇన్‌స్టా వేదికగా మరో పోస్ట్ పెట్టారు. అడవికి రారాజుగా పిలిచే సింహం ఫొటోని షేర్ చేశారు. 'క్రిస్ ఫాలోస్ తీసిన సెరెంగేటి (టాంజానియాలోని ఒక ప్రాంతం) రాజు ఫొటో ఇది. ప్రస్తుతం ఇది నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. తన తదుపరి సినిమా లొకేషన్స్ సెర్చ్‌లో భాగంగానే జక్కన్న అక్కడికి వెళ్లారని పలువురు భావిస్తున్నారు. దీంతో ఎంబి 29పై సినీప్రియుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. 'బాక్సాఫీస్ రికార్డులు తిరగరాయడం పక్కా', 'షూటింగ్ అప్‌డేట్‌లు కూడా ఇవ్వగలరు', 'మేము కూడా మీతోనే వచ్చేస్తాం సర్' అని కామెంట్స్ పెడుతున్నారు. ఇక మూవీ విషయానికి వస్తే.. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. విజయేంద్రప్రసాద్ కథ అందించారు. భారీ బడ్జెట్‌తో యాక్షన్ అడ్వెంచర్ మూవీగా ఇది సిద్ధం కానుంది. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జనవరి నుంచి ఈ సినిమా షూట్ మొదలుకానుందని ఇప్పటికే చిత్ర రచయిత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం లొకేషన్స్ వేటలో పడినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా కెన్యాలో పర్యటిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో మహేశ్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఆ పాత్ర కోసం ఆయన ఇప్పటికే సన్నద్ధమయ్యారు. ఈ సినిమాను ప్రకటించినప్పటినుంచి అప్‌డేట్స్ కోసం అభిమానులు ఎదురుచూస్తూనే ఉన్నారు. దీనికి 'గరుడ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది.

